



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక    ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 1  సంచిక : 72  పేజీలు : 12  సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ)  ప్రచురణ : హైదరాబాద్  శుక్రవారం 23 జనవరి 2026  వెల : 1/-రూ ॥

VOLUME :1  ISSUE : 72  PAGES : 12  EDITOR : G. A. RAO ( ANAND GANTYADA )  PUBLISHED : HYDERABAD  FRI 23 JANUARY 2026  PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


## ఝార్ఖండ్‌లో మావోయిస్టులకు

# భారీ ఎదురుదెబ్బ...

## ఎన్‌కౌంటర్‌లో 15 మంది నక్సల్స్ మృతి

- మావోయిస్టుల ఏరివేత ముమ్మరం
- సారండా అడవుల్లో భద్రతా దళాల వేట
- 2026 మార్చి నాటికి దేశాన్ని మావోయిస్ట్ రహితంగా మార్చాలన్నది కేంద్రం లక్ష్యం

- మిగతా 2లో...



## తెలంగాణలో బీసీ నేత సీఎం అయ్యే సమయం వస్తుంది



- అవకాశం ఉన్న ప్రతి చోట బీసీలకు పదవులు ఇస్తున్నామన్న మహేశ్ గౌడ్
- మున్సిపల్ ఎన్నికల్లో విజయమే లక్ష్యమని వెల్లడి
- దేవుళ్ల పేరుతో రాజకీయాలు మంచిది కాదని వ్యాఖ్య

**హైదరాబాద్ పెన్ పవర్:**కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం బీసీలకు పూర్తి స్థాయిలో న్యాయం చేస్తోందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. బీసీ నేత ముఖ్యమంత్రి అయ్యే ఆ సమయం తప్పకుండా వస్తుందని అన్నారు. మున్ముందు బీసీలకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని, అవకాశం ఉన్న ప్రతి చోట బీసీలకు పదవులు ఇస్తూ ముందుకు వెళుతున్నామని తెలిపారు. కష్టపడి పనిచేస్తే ఎవరి వాటా వాళ్లకు దక్కుతుందని, దీనిని ఎవ్వరూ

- మిగతా 2లో...



## కర్ణాటక అసెంబ్లీలో

# రగడ..

### గవర్నర్ పై ప్రభుత్వం ఆగ్రహం

- ప్రభుత్వం ఇచ్చిన ప్రసంగం పూర్తిగా చదవకుండానే వెళ్లిపోయిన గవర్నర్
- గవర్నర్ ను అడ్డుకుంటూ నిలదీసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు
- సరైన నిర్ణయం తీసుకున్నారంటూ గవర్నర్ కు బీజేపీ ఎమ్మెల్యేల మద్దతు

**హైదరాబాద్ పెన్ పవర్:**కర్ణాటక అసెంబ్లీలో వివాదం చెలరేగింది. అసెంబ్లీ సమావేశాల్లో గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ తన ప్రసంగాన్ని రెండు మాటలతోనే ముగించి సభలో నుంచి వెళ్లిపోయారు. ఉపాధి హామీ పథకంపై కేంద్రానికి వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం రాసిచ్చిన ప్రసంగాన్ని గెహ్లాట్ చదవలేదు.

- మిగతా 2లో...

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్‌కు

# సిట్ నోటీసులు

- ఫోన్ ట్యాపింగ్ కేసు... ఈసారి కేటీఆర్ కు సిట్ నోటీసులు
- ఉదయం 11 గంటలకు విచారణకు హాజరుకావాలని ఆదేశం
- జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో విచారణ
- రెండు రోజుల క్రితమే హరీశ్ రావును ప్రశ్నించిన అధికారులు




**హైదరాబాద్ పెన్ పవర్:**ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు గురువారం (జనవరి 22) సిట్ నోటీసులు జారీ చేసింది. 2026, జనవరి 23వ తేదీ ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. తెలంగాణ స్టేట్ పాలిటిక్స్‌లో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దూకుడు పెంచింది. ఇటీవలే ఈ కేసులో బీఆర్ఎస్ అగ్రనేత హరీష్ రావును సిట్ విచారించిన విషయం తెలిసిందే. దాదాపు 7 గంటల పాటు హరీష్ రావుపై సిట్ ప్రశ్నల వర్షం కురిపించింది. హరీష్ రావును ఇంటరాగేట్ చేసిన రెండు రోజుల్లోనే విచారణకు రావాలంటూ కేటీఆర్‌కు సిట్ నోటీసులు పంపడం స్టేట్ పాలిటిక్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. మరీ కేటీఆర్ విచారణకు హాజరు అవుతారో లేదో చూడాలి. ఫోన్ ట్యాపింగ్ కేసులో సమగ్ర దర్యాప్తు జరిపేందుకు హైదరాబాద్ పోలీస్‌కమిషనర్ సజ్జనార్ నేతృత్వంలో ఇటీవల స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్(సిట్) ను ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. సజ్జనార్ పర్యవేక్షణలో 9 మంది సభ్యులను నియమించారు.సిద్దిపేట సీపీ ఎస్ఎమ్ విజయ్‌కుమాం (ఐపీఎస్), రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా(ఐపీఎస్), మాదాపూర్ డీసీపీ రితిరాజ్(ఐపీఎస్), మహేశ్వరం డీసీపీ కె.నారాయణరెడ్డి(ఐపీఎస్), గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్ ఎం. రవీందర్ రెడ్డి, రాజేంద్రనగర్ అడిషనల్ డీసీపీ కేఎస్ రావు, ఫోన్ ట్యాపింగ్ కేస్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్, జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరి, టీజీ న్యాబ్

- మిగతా 2లో...

### విచారణకు వెళ్తా.. అడిగినవి చెప్తా: సిట్ నోటీసులపై కేటీఆర్ రియాక్షన్




**హైదరాబాద్ పెన్ పవర్:** ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు రావాలంటూ సిట్ జారీ చేసిన నోటీసులపై

- మిగతా 2లో...

## దావోస్ వేదికగా ఆసక్తికర భేటీ... రేవంత్ రెడ్డిని కలిసిన నారా లోకేశ్

- పరస్పర సహకారంతో అభివృద్ధిపై ఇరు నేతల చర్చ
- ఏపీ విద్యా సంస్కరణలు, ఐటీ ప్రగతిని వివరించిన నారా లోకేశ్
- తెలంగాణ స్కిల్ క్యాంపస్‌లను చూడాలని లోకేష్‌కు రేవంత్ ఆహ్వానం
- మేడారం జాతరకు రావాలని లోకేష్‌ను ఆహ్వానించిన సీఎం



- మిగతా 2లో...

## లోయలో పడిన ఆర్మీ వాహనం.. 10 మంది సైనికులు మృతి

- జమ్మూకశ్మీర్ లోని దోడా జిల్లాలో ఘోర ప్రమాదం
- 200 అడుగుల లోతులోకి పడిపోయిన బుల్లెట్ ప్రూఫ్ వాహనం
- గాయపడిన సైనికులు మిలిటరీ ఆసుపత్రికి తరలింపు



**హైదరాబాద్ పెన్ పవర్:**జమ్మూకశ్మీర్ లోని దోడా జిల్లాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఇండియన్ ఆర్మీకి చెందిన వాహనం లోయలో పడిపోయింది. చంబా-బందేర్వా హైవేపై ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 10 మంది సైనికులు ప్రాణాలు కోల్పోగా... పలువురు గాయపడ్డారు. ఆర్మీకి చెందిన బుల్లెట్ ప్రూఫ్ వాహనంలో 17 మంది ప్రయాణిస్తున్నారు. డ్రైవర్ వాహనాన్ని అదుపు చేయలేకపోవడంతో ప్రమాదం సంభవించింది. లోయలో సుమారు 200 అడుగుల లోతులోకి వాహనం పడిపోయింది. హై ఆల్టిట్యూడ్ పోస్టు వద్దకు వెళుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. వెంటనే ఆర్మీతో పాటు పోలీసులు సహాయక చర్యలు ప్రారంభించారు. గాయపడినవారిని ఉదంపూర్ మిలిటరీ ఆసుపత్రికి తరలించారు.



## రేవంత్ రెడ్డికి, సైబర్ నేరగాడికి పెద్ద తేడా లేదు

- ప్రజల ఖాతాల నుంచి రేవంత్ డబ్బులు తీసుకుంటున్నారన్న హరీశ్
- హామీలపై మంత్రులను ప్రజలు నిలదీస్తున్న పరిస్థితి ఉందని వ్యాఖ్య
- డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని మండిపాటు

**హైదరాబాద్ పెన్ పవర్:**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సిట్ నోటీసులు జారీ కావడంపై మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు.

- మిగతా 2లో...

## గ్రూప్-1 ఫలితాల రద్దుపై సస్పెన్స్...

### తీర్పును వాయిదా వేసిన తెలంగాణ హైకోర్టు



- గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష ఫలితాల రద్దుపై తీర్పు వాయిదా
- ఫిబ్రవరి 5న తీర్పును వెల్లడించనున్న తెలంగాణ హైకోర్టు
- సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాల్ చేసిన టీజీపీఎస్సీ, అభ్యర్థులు
- గతంలో నియామకాలకు షరతులతో కూడిన అనుమతి ఇచ్చిన ధర్మాసనం
- తీర్పు వాయిదాతో అభ్యర్థుల్లో కొనసాగుతున్న ఉత్కంఠ

- మిగతా 2లో...

## ఆక్రమణలపై హైడ్రా కొరడా...

# ఒకే రోజు రెండు చోట్ల చర్యలు

- గచ్చిబౌలి, శామీర్‌పేటలో ఆక్రమణలపై హైడ్రా ప్రత్యేక చర్యలు
- గచ్చిబౌలి టెలికాం నగర్‌లో 2500 గజాల పార్కు స్థలానికి విముక్తి
- శామీర్‌పేటలో 15 ఏళ్లుగా మూసివేసిన రోడ్డును తెరిపించిన అధికారులు
- ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులతో వేగంగా స్పందించిన హైడ్రా
- ఆక్రమణలు తొలగించి ఫెన్సింగ్, బోర్డులు ఏర్పాటు చేసిన సిబ్బంది



**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్ నగరంలో ఆక్రమణలపై హైడ్రా ప్రత్యేక దృష్టి సారించింది. ఒకే రోజు రెండు వేర్వేరు ప్రాంతాల్లో చర్యలు చేపట్టింది. గచ్చిబౌలిలో ఓ విలువైన పార్కు స్థలాన్ని కాపాడగా,

- మిగతా 2లో...

# దావోస్ వేదికగా ఆసక్తికర భేటీ... రేవంత్ రెడ్డిని కలిసిన నారా లోకేశ్

స్విట్జర్లాండ్‌లోని దావోస్ వేదికగా తెలుగు రాష్ట్రాల నేతల మధ్య స్నేహపూర్వక భేటీ జరిగింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇరు రాష్ట్రాల అభివృద్ధి, ప్రగతి ప్రణాళికలపై ఇరువురు నేతలు ఫలవంతమైన చర్చలు జరిపారు. పరస్పర సహకారంతోనే తెలుగు రాష్ట్రాల సమగ్రాభివృద్ధి సాధ్యమని ఇద్దరూ ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో భాగంగా మంత్రి నారా లోకేశ్... సీఎం రేవంత్ రెడ్డిని మంగళగిరి శాలువాతో సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు. ప్రతిగా సీఎం రేవంత్ రెడ్డి కూడా లోకేశ్ ను సత్కరించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో చేపడుతున్న విద్యా సంస్కరణలు, ఐటీ రంగంలో సాధిస్తున్న ప్రగతిని లోకేశ్ ముఖ్యమంత్రికి వివరించారు. ముఖ్యంగా 'ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్' కోసం తీసుకుంటున్న చర్యలు, వాటి ద్వారా వస్తున్న సానుకూల ఫలితాల గురించి చర్చించారు. దీనిపై స్పందించిన రేవంత్ రెడ్డి, తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి తెలిపారు. ముఖ్యంగా, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా టాటా సంస్థ సహకారంతో తెలంగాణలోని ఐటీఐలను ఆధునిక స్కిల్ క్యాంపస్‌లుగా తీర్చిదిద్దామని రేవంత్ రెడ్డి వివరించారు. ఈ క్యాంపస్‌లను సందర్శించి, అక్కడ అమలవుతున్న కార్యక్రమాలను పరిశీలించాలని లోకేశ్ ను ఆయన ఆహ్వానించారు. అలాగే, కోట్లాది మంది భక్తులు దర్శించుకునే మేడారం సమ్మక్క-సారలమ్మ దేవస్థానాన్ని వందల కోట్ల రూపాయలతో ఆధునికీకరిస్తున్నామని తెలిపారు. దశాబ్దాలుగా ఏ ప్రభుత్వం చూపని చొరవతో రహదారులు, మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, తప్పకుండా వనదేవతలను దర్శించుకోవాలని లోకేష్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానించారు.

పెట్టుబడుల సాధనలో తెలుగు రాష్ట్రాలు పరస్పరం పోటీపడుతూనే, అభివృద్ధి విషయంలో సహకరించుకోవాలని ఇరువురు నేతలు అభిప్రాయపడ్డారు. ఈ స్ఫూర్తితో ముందుకెళితే దేశానికే తెలుగు రాష్ట్రాలు ఆదర్శంగా నిలుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఎడిటర్ వ్యూ

# వసంతం చల్లుకునే పంచమి

"వసంత పంచమి" గా పిలువబడే మాఘ శుద్ధ పంచమి ప్రధానంగా రుతు సంబంధ పర్వదినం. ఈ దినమే చదువుల తల్లి "సరస్వతి జయంతి"గా కొన్నిచోట్ల భావించబడుతుంది. దీనిని "సరస్వతి పూజా దినంగా, శ్రీపంచమి, మదన పంచమి, రతి కామ దమనోత్సవ పర్వదినం"గా పంచాంగ కర్తలు పరిగణిస్తారు. వసంత పంచమి నామాన్ని బట్టే దీనిని రుతు సంబంధమైనదిగా భావించవచ్చు. మకర సంక్రాంతి తరువాత ఉత్తరాయణం ప్రారంభం అవుతుంది. ఆ కాలంలోనే క్రమంగా వసంత రుతు లక్షణాలైన చెట్లు చిగుర్చడం, పూలు పూయడం కనిపిస్తుంది. మాఘ మాసమే వసంత రుతువుకు ఆరంభమనే వాదనకూడా ఉంది. వసంతోత్సవారంభానికి వసంత పంచమినే కొందరు పంచాంగ కర్తలు ఉదహరిస్తారు. రాగల వసంత రుతువుకు శిశిరంలోనే స్వాగతించే పండుగ ఇది. ఈనాటి కృత్యాలలో నూతన వస్త్రధారణం, తైల స్నానాలు ప్రధానాలని చెప్పబడింది. నూతన వస్త్ర ధారులై, బుక్కా వసంతం చల్లుకునే పండుగ అయి నందునే వసంత పంచమి అని నామాంకితమైంది. "నవాన్న భక్షణ దినం"గా, సంక్రాంతికి వచ్చే ధాన్యాన్ని ఈ రోజు అన్నం వండి కులదేవతలకు నివేదించి తినే ప్రాచీన ఆచారమూ కొన్ని ప్రాంతాలలో ఉన్నది. ప్రాచీన కాలంలో "రోమనులు" కూడా "వసంత రుతు పండుగ"ను ఇదే రోజు, ఇదే మాదిరిగా చేస్తుండే వారని పేర్కొనబడింది. బ్రహ్మ వైవర్త పురాణంలో..ప్రకృతి ఖండంలో నాలుగో అధ్యాయంలో అన్ని శక్తులలో ప్రధానమైన శక్తిగల సరస్వ తిని వసంత పంచమినాడు పూజించాలని చెప్పబడింది. కనుక వసంత పంచమి "విద్యారంభ దినం". జ్ఞానప్రాప్తి కోసం సరస్వతిని ఆరాధించమని బ్రహ్మవైవర్త పురాణం చెప్తోంది. విద్యకు అధిదేవతయైన సరస్వతిని మాఘ మాసమందు తాటియాకులు, గంటము, గ్రంథము లాది విద్యా సాధనములను దేవి ఎదుట ఉంచి, గంధ పుష్పాదులతో గ్రంథ రచన ప్రారంభ సమయంలో పూజించే ఆచారం ఉండినట్లు సురవరం ప్రతాపరెడ్డి పేర్కొన్నారు. "యాకుందేందు తుషార హార ధవళా యా శుభ్ర వస్త్రాన్వితా

యా వీణావరదండ మండిత కరా యా శ్వేత పద్మాసనా, యా బ్రహ్మాచ్యుత శంకర ప్రభృతిభి దేవై సదా పూజితా, సామాంపాతు సరస్వతీ, భగవతీనిశ్శేష జడ్యా పహః" శ్లోక పఠనంతో పిల్లల చదువు ప్రారంభం అవుతుంది. సరస్వతీదేవి అహింసాదేవి. ఆయుధాలు ఏమీ ధరించని దేవత. తెల్లటి పద్మం మీద సరస్వతి నిలబడి ఉన్నట్లు, ఒక కాలు నిలువుగాను, మరొక కాలు దానిమీద అడ్డంగాను ఉంచుకుని, ఒక చేత వీణ మరొక చేత పుస్తకము ధరించి ఉన్నట్లు పద్మ పురాణ లిఖితం. తెల్లటి బట్టలు ధరించి, తెల్లటి పూలు, తెల్ల పూసల కంఠహారం, దానిపై తెల్లగంధం పూత తెల్లని వీణాపాణితో కూడిన ప్రశాంత, శాంతి దేవత సరస్వతి. పూజా సందర్భంలో చదువుకు, వ్రాతకు సంగీతానికి సంబంధించిన పరికరాలను ఆమె ముందుంచడం అనవాయితీ. సర్వవిద్యలకూ ఆధారమైన వాగ్దేవి చెంత పుస్తకాలు, కలాలు ఈ రోజున ఆరాధిస్తారు. "మాఘ శుక్ల పంచమ్యాం విద్యారంభే దినేపి చ పూర్వేహ్ని సమయం కృత్యాత త్రాహ్న సంయుతః రుచిః...'వసంత పంచమి రోజున ప్రాతఃకాలంలో సరస్వతీదేవిని పూజించి విద్యారంభం చేయాలని చెప్పబడింది. మేధ, ఆలోచన, ప్రతిభ, ధారణ, ప్రజ్ఞ, స్ఫురణ శక్తుల స్వరూపమే శారదాదేవి. సరస్వతి ఆరాధన వల్ల వాక్శుద్ధి కలుగుతుంది. చదువుల తల్లి కృపతో సద్బుద్ధినీ పొందుతారు. పసుపు పచ్చని బట్టలు ధరించి, సరస్వతికి రోజంతా పూజలు నిర్వహిస్తూ, కీర్తనలు పాడడం సనాతన సాంప్రదాయం. ఈనాడే రతీదేవి కామదేవత పూజ చేసినట్లు, రుతురాజు వసంతునికి కామ దేవుడు మంచి మిత్రుడైనట్లు, కనుక ఈనాడు "రతీ మన్మధ, వసంతుల పూజలు" చేయాలని పురాణ కథనం. రతీ మన్మథులను పూజించి మహోత్సవ మొనరించవలెనని, దానములు చేయవలెనని, దీని వలన మాధవుడు (వసంతుడు) సంతోషించునని నిర్ణయామృతకారుడు పేర్కొన్నాడు. రుగ్వేదంలో ప్రధానంగా గ్రీష్మ, శారద వసంత కాలాలు మూడే పేర్కొనబడినాయి. వసంత పంచమి నాటికే మామిడి తదితర చెట్లు బాగా చిగురించి, పుష్పిస్తాయి. పనస మొదలైనవి పైరు గాలికి పిందెలుగా మారుతాయి. శీతాకాలపు పడిశాలు దగ్గులాంటి రుగ్మతలు క్రమంగా తగ్గుతాయి.

# తెలంగాణలో బీసీ నేత సీఎం అయ్యే సమయం వస్తుంది

- మొదటి పేజి తరువాయి

అడ్డుకోలేరని మహేశ్ గౌడ్ అన్నారు. రాబోయే రోజులు అన్నీ బీసీలవే అని ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో మెజారిటీ స్థానాల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా పార్టీ ముందుకు సాగుతోందన్నారు. ఈ సందర్భంగా బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ వ్యాఖ్యలకు ఆయన గట్టి కౌంటర్ ఇచ్చారు. దేవుళ్ల పేరుతో రాజకీయాలు చేయడం దేశానికి మంచిది కాదని, కులం, మతం పేరుతో మన పిల్లలకు భవిష్యత్తు రాదని వ్యాఖ్యానించారు. రాముడు, అంజనేయుడి పేర్లు చెప్పి బీజేపీ నేతలు ఓట్లు దండుకుంటున్నారని విమర్శించారు. అర్వింద్ 'జై శ్రీరాం' అని కాకుండా, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజల వద్దకు వెళ్లి తాను చేసిన అభివృద్ధి ఏంటో చెప్పి ఓట్లు అడగాలని హితవు పలికారు. రాముని పేరు చెప్పడం తప్ప నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఏం చేశారో వివరించాలన్నారు. దేవుళ్లను రాజకీయాలతో ముడిపెట్టవద్దని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

# గ్రూప్-1 ఫలితాల రద్దుపై సస్పెన్స్... తీర్పును వాయిదా వేసిన తెలంగాణ హైకోర్టు

తెలంగాణ గ్రూప్-1 సర్వీసెస్ మెయిన్స్ పరీక్ష ఫలితాలను రద్దు చేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన అప్పీళ్లపై హైకోర్టు తన తీర్పును వాయిదా వేసింది. ఈ కేసులో తుది తీర్పును ఫిబ్రవరి 5వ తేదీన వెల్లడించనున్నట్లు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం గురువారం ప్రకటించింది. తీర్పు కాపీ ఇంకా సిద్ధం కాలేదని, అందువల్ల వాయిదా వేస్తున్నట్లు కోర్టు పార్టీలకు తెలియజేసింది. ఈ అప్పీళ్లపై గత డిసెంబర్ 31న వాదనలు ముగించిన ధర్మాసనం, తీర్పును రిజర్వ్ చేసింది. గ్రూప్-1 మెయిన్స్ మూల్యాంకన ప్రక్రియలో తీవ్రమైన లోపాలు ఉన్నాయని పేర్కొంటూ, సింగిల్ బెంచ్ జడ్జి జస్టిస్ నమవరపు రాజేశ్వర్ రావు సెప్టెంబర్ 9న ఫలితాలు, ర్యాంకుల జాబితాను రద్దు చేశారు. జవాబు పత్రాలను మ్యాన్యువల్‌గా పునఃమూల్యాంకనం చేయాలని లేదా 8 నెలల్లోగా పరీక్షను తిరిగి నిర్వహించాలని టీజీపీఎస్సీని ఆదేశించారు. సింగిల్ జడ్జి ఇచ్చిన ఈ తీర్పును తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఠఊూజ), ఎంపికైన కొందరు అభ్యర్థులు డివిజన్ బెంచ్‌లో సవాలు చేశారు. విచారణ జరిపిన ధర్మాసనం, సింగిల్ జడ్జి ఉత్తర్వులపై స్టే విధించింది. ఫలితాల ఆధారంగా నియామక ప్రక్రియను కొనసాగించడానికి టీజీపీఎస్సీకి అనుమతి ఇచ్చింది. అయితే, ఈ నియామకాలు కోర్టు తుది తీర్పునకు లోబడి ఉంటాయని అప్పట్లో స్పష్టం చేసింది.

ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వుల నేపథ్యంలో, టీజీపీఎస్సీ 563 పోస్టులకు గాను 562 పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. 2024 అక్టోబర్ 21 నుంచి 27 వరకు జరిగిన ఈ మెయిన్స్ పరీక్షలకు దాదాపు 30,000 మంది హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు జరగడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్‌కు సిట్ నోటీసులు

- మొదటి పేజి తరువాయి

డీఎస్పీ జీహెచ్ శ్రీధర్, హెచ్‌ఎంఆర్‌ఎల్ డీఎస్పీ నాగేందర్ రావును సభ్యులుగా నియమించారు. ఉన్నతస్థాయిలో ప్రొఫెషనల్ ఇన్వెస్టిగేషన్ చేసి పటిష్టమైన చార్జిషీట్ దాఖలు చేయాలని ఆదేశించారు.

**ఇప్పటికే సేకరించిన ఆధారాలతో..!**

ఫోన్‌ట్యాపింగ్‌పై పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైన తర్వాత సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ఐదుగురు సభ్యులతో స్పెషల్ టీమ్‌ను ఏర్పాటు చేశారు. వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌గా జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరి కేసును దర్యాప్తు చేశారు. ఇటీవల డీజీపీ అధికారికంగా స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్)ను ఏర్పాటు చేశారు. కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు కస్టోడియల్ విచారణ, ఇతర నిందితుల వాంగ్మూలాలు, సేకరించిన సాంకేతిక ఆధారాలతో సజ్జనార్ సిట్ మరింత లోతుగా దర్యాప్తు చేస్తోంది. ఫోన్ ట్యాపింగ్ వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరనేది ఇప్పటికే స్పెషల్ టీమ్ ప్రాథమిక సమాచారం సేకరించింది. సిటీ టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్ రావు కన్‌ఫెషన్ స్టేట్‌మెంట్‌లో పలువురు కీలక నేతల పేర్లు పరోక్షంగా వెల్లడయ్యాయి.

**ఆ నలుగురు.. 10 నెలల రిమాండ్**

ఫోన్ ట్యాపింగ్‌లో కీలకంగా వ్యవహరించిన మాజీ పోలీస్ అధికారులు ప్రణీత్‌రావు, రాధాకిషన్ రావు, భుజంగరావు, తిరుపతన్నను ఇప్పటికే అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. 10 నెలలకు పైగా బెయిల్ రాకుండా కీలక ఆధారాలను కోర్టుకు అందించారు. దీంతో ఈ కేసులో ప్రధాన నిందితుడైన ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు అమెరికాలో తలదాచుకున్నాడు. ఆయనను భారత్‌కు రప్పించేందుకు రెడ్ కార్నర్ నోటీసుల ప్రక్రియ సహా అమెరికా నుంచి డిపోర్ట్ చేయించేందుకు పోలీసులు విశ్వప్రయత్నాలు చేశారు.

అరెస్ట్ నుంచి తప్పించుకున్న ప్రభాకర్ రావును చివరకు వారం రోజుల పాటు కస్టోడియల్ ఎంక్వైరీ చేశారు. దీంతో పాటు గత ప్రభుత్వ హయాంలో ట్యాపింగ్ ద్వారా నష్టపోయిన బాధితులు, అధికారులు కాల్ డేటా సహా వాట్సాప్, సోషల్‌మీడియా డేటాను పోలీసులు ఇప్పటికే సేకరించారు. వీటి ఆధారంగా సిట్ దర్యాప్తును ముమ్మరం చేసింది.

ఇందులో భాగంగా ఇటీవల పలువురికి నోటీసులు ఇచ్చి విచారించింది. బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, చిరుమర్తి లింగయ్య, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ నవీన్ యాదవ్, అతడి తండ్రి, హరీష్ రావును సిట్ విచారించింది. ఈ క్రమంలో బీఆర్‌ఎస్ అగ్రనేత కేటీఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడంతో ఈ కేసులో నెక్స్ట్ ఏం జరగబోతుందనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

# రేవంత్ రెడ్డికి, సైబర్ నేరగాడికి పెద్ద తేడా లేదు

- మొదటి పేజి తరువాయి

సీఎం రేవంత్‌రెడ్డిపై ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి ప్రవర్తనకు, ఒక సైబర్ నేరగాడి ప్రవర్తనకు పెద్ద తేడా లేదంటూ తీవ్ర విమర్శలు గుప్పించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రజల కోసం ఖజానా నుంచి డబ్బులు ఖర్చు చేశామని, కానీ రేవంత్‌రెడ్డి మాత్రం ప్రజల ఖాతాల నుంచే డబ్బులు తీసుకుంటానంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై ప్రజలు మంత్రులను నిలదీస్తున్న పరిస్థితి ఉందన్నారు. ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పలేక, దృష్టి మళ్లించేందుకు సిట్ నోటీసులు పంపుతున్నారని విమర్శించారు. తాను, కేటీఆర్... ప్రభుత్వ వైఫల్యాలను గట్టిగా ప్రశ్నిస్తున్నందు వల్లే ఈ చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. ఎన్ని నోటీసులు ఇచ్చినా భయపడబోమని, హామీల అమలుపై ప్రశ్నించడం ఆపేది లేదని స్పష్టం చేశారు. డైవర్షన్ రాజకీయాలు చేస్తూ నీ బావమరిది కుంభకోణం బయటకు రాకుండా చూడాలనే ప్రయత్నమా? అని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. కాంగ్రెస్ మంత్రులు వాటాల కోసం కొట్టుకుంటున్నారని, ఆ పార్టీ పని అయిపోయిందని హరీశ్ వ్యాఖ్యానించారు. ప్రజల ముందుకు రావడానికి కాంగ్రెస్ నేతలు జంకుతున్నారని చెప్పారు. "ఎన్ని నోటీసులు ఇచ్చినా భయపడబోం. 6 గ్యారంటీలు, 420 హామీలు అమలు చేసే వరకూ మీ వెంటపడుతూనే ఉంటాం" అని అన్నారు.

# విచారణకు వెళ్తా.. అడిగినవి చెప్తా: సిట్ నోటీసులపై కేటీఆర్ రియాక్షన్

- మొదటి పేజి తరువాయి

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రియాక్ట్ అయ్యారు. సిట్ విచారణకు వెళ్తా.. వాళ్లు అడిగినవాటికి సమాధానాలు చెప్తానని అన్నారు. గురువారం (జనవరి 22) సిరిసిల్ల బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఫోన్ ట్యాపింగ్ కేసు ఒక బక్వాస్ కేసని అన్నారు. టీవీ సిరియల్ మాదిరిగా ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ కొనసాగుతోందని ఎద్దేవా చేశారు.

శాంతి భద్రతల కోసం, ప్రభుత్వాల అస్థిరత కోసం అధికారులు కొన్ని ఫోన్ కాల్స్ వింటారని పరోక్షంగా ఫోన్ ట్యాపింగ్ జరిగిందని అంగీకరించారు. అధికారులు ఫోన్ కాల్స్ వింటే తనకేం సంబంధమని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా, పాలన చేతకాక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ అవినీతి బయటపెడుతున్నామనే హరీష్ రావుకు, తనకు నోటీసులు ఇచ్చారని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ అని పిలిచి హరీష్ రావును అడిగిందే అడిగి టైంపాస్ చేశారు.. రేపు నాతో కూడా అదే చేస్తారన్నారు. ఇప్పుడు నా ఫోన్ ట్యాప్ అవుతోందో లేదో సిట్‌ను అడుగుతానని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ట్యాపింగ్ కేసు విచారణ ప్రారంభించి రెండేళ్లు అవుతోందని.. సిట్ దర్యాప్తు లీకులు తప్ప, అధికారిక ప్రకటన లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి విదేశాల నుంచి వచ్చే వరకు టైంపాస్ చేసేందుకే విచారణకు పిలుస్తున్నారని ఆరోపించారు. ముగ్గురు మంత్రుల పంచాయతీలో ముగ్గురు జర్నలిస్టులు బలయ్యారని.. అలాగే ఫోన్ ట్యాపింగ్ కేసులో బలయ్యేది పోలీసు అధికారులేనని అన్నారు. ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో ఇప్పటికే ఏసీబీ విచారణకు 2, 3సార్లు, ఈడీ విచారణకు ఒకసారి వెళ్లానని.. అలాగే ఫోన్ ట్యాపింగ్ కేసులో కూడా విచారణకు హాజరు అవుతానని తెలిపారు. సిట్ అధికారులు అడిగిన వాటికి సమాధానాలు చెప్తానని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసును న్యాయపరంగా ఎదుర్కొంటానని చెప్పారు. చిన్న చిన్న అంశాలపై సిట్ వేస్తోన్న ప్రభుత్వం.. అమృత్ స్కాంలో సీఎం రేవంత్ రెడ్డి బంధువు సృజన్ రెడ్డి అవినీతిపై, కంచె గచ్చిబౌలి భూములపై సిట్ ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. బీజేపీ, కాంగ్రెస్ కలిసి కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు గురువారం (జనవరి 22) సిట్ నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు జూబ్లీహిల్స్ నందినగర్‌లోని కేటీఆర్ నివాసానికి వెళ్లి అధికారులు నోటీసులు అందజేశారు. 2026, జనవరి 23వ తేదీ ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొన్నారు.

# ఝార్ఖండ్‌లో మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ...

ఝార్ఖండ్‌లో మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. సింగ్‌భూం జిల్లాలో భద్రతా దళాలు జరిపిన ఆపరేషన్‌లో 15 మంది మావోయిస్టులు హతమయ్యారు. సారండా అటవీ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే, సింగ్‌భూం జిల్లాలోని సారండా అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో పోలీసులు, సీఆర్‌పీఎఫ్ కోబ్రా బలగాలు సంయుక్తంగా కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో భద్రతా దళాలపై మావోయిస్టులు కాల్పులకు తెగబడటంతో, బలగాలు దీటుగా ప్రతిఘటించాయి. ప్రస్తుతం ఆ ప్రాంతంలో కూంబింగ్ కొనసాగుతోంది. 2026 మార్చి నాటికి దేశాన్ని మావోయిస్ట్ రహితంగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సహా మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల్లో భద్రతా బలగాలు నిర్మూలన చర్యలను ముమ్మరం చేశాయి. ఝార్ఖండ్‌లో జరిగిన ఈ తాజా ఎన్‌కౌంటర్‌ను కూడా ఈ ఆపరేషన్లలో భాగంగానే అధికారులు చూస్తున్నారు. మృతుల గుర్తింపు, స్వాధీనం చేసుకున్న ఆయుధాల వివరాలను అధికారులు అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఈ ఘటనతో మావోయిస్టుల ఏరివేత దిశగా మరో కీలక ముందడుగు పడినట్లయిందని భద్రతా వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# కర్ణాటక అసెంబ్లీలో రగడ.. గవర్నర్ పై ప్రభుత్వం ఆగ్రహం

- మొదటి పేజి తరువాయి

దీంతో గవర్నర్ గెహ్లాట్ తీరుపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మండిపడుతుండగా.. బీజేపీ ఎమ్మెల్యేలు గవర్నర్ సరైన నిర్ణయం తీసుకున్నారంటూ సమర్థిస్తున్నారు.

**అసలు ఏం జరిగిందంటే..**

అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సభలో గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ ప్రసంగించాల్సి ఉంది. సాధారణంగా ప్రభుత్వం రాసిచ్చిన ప్రసంగం కాపీని గవర్నర్ సభలో చదువుతారు. ఈ సంప్రదాయం మేరకు సిద్ధరామయ్య ప్రభుత్వం గవర్నర్ కు ప్రసంగం కాపీ అందించింది. అయితే, అందులో ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి చేసిన మార్పులను వ్యతిరేకించింది. కేంద్రం తీరుకు నిరసనగా రాష్ట్ర ప్రభుత్వం చేసిన తీర్మానాన్ని ఈ ప్రసంగం కాపీలో ప్రస్తావించింది. దీనిని చదివేందుకు నిరాకరించిన గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్.. సింపుల్ గా 'రాష్ట్రం ప్రగతి మార్గంలో నడుస్తోంది.. సమావేశాలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నా' అంటూ ప్రసంగాన్ని ముగించేశారు. ఆపై సభలో నుంచి వెళ్లిపోతుండగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆయనను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. గవర్నర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇది రాజ్యాంగ వ్యతిరేక చర్య అని సీఎం సిద్ధరామయ్య కూడా గవర్నర్ పై మండిపడ్డారు.

అయితే, కేంద్రానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ ప్రభుత్వం రాసిచ్చిన ప్రసంగాన్ని చదవకూడదని గవర్నర్ సరైన నిర్ణయం తీసుకున్నారంటూ బీజేపీ ఎమ్మెల్యేలు సమర్థించారు. కేంద్ర ప్రభుత్వాన్ని అవమానించాలన్న కాంగ్రెస్ కుటిల ప్రయత్నాన్ని సరిగ్గా తిప్పికొట్టారంటూ గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ ను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర కొనియాడారు. గవర్నర్ పట్ల కాంగ్రెస్ ఎమ్మెల్యేల ప్రవర్తనకు సీఎం సిద్ధరామయ్య క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఆక్రమణలపై హైడ్రా కొరడా... ఒకే రోజు రెండు చోట్ల చర్యలు

- మొదటి పేజి తరువాయి

శామీర్‌పేటలో ఏళ్లుగా మూతపడిన రహదారికి విముక్తి కల్పించింది. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా అధికారులు ఈ చర్యలు చేపట్టారు. వివరాల్లోకి వెళితే, గచ్చిబౌలి టెలికాం నగర్‌లో 1982 నాటి లేఅవుట్‌లో 4000 గజాల స్థలాన్ని పార్కు కోసం కేటాయించారు. అయితే, కాలక్రమేణా ఇందులో 1500 గజాలు ఆక్రమణకు గురై నిర్మాణాలు వెలిశాయి. మిగిలిన 2500 గజాల స్థలాన్ని కూడా కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నించడంతో స్థానికులు హైడ్రా ప్రజావాణిని ఆశ్రయించారు. కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాలతో రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. లేఅవుట్ ప్రకారం అది పార్కు స్థలమని నిర్ధారించుకుని, 2500 గజాల స్థలంలోని ఆక్రమణలను తొలగించారు. భవిష్యత్తులో ఇబ్బందులు రాకుండా ఫెన్సింగ్ వేసి, 'పార్క్ స్థలం' అని బోర్డును ఏర్పాటు చేశారు. మరో ఘటనలో, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేటలోని ఫ్రెండ్స్ కాలనీలోనూ హైడ్రా చర్యలు చేపట్టింది. 1987 నాటి లేఅవుట్‌లోని 20 అడుగుల రోడ్డును కొందరు ఆక్రమించి గోడలు, గేటు నిర్మించారు. దీనిపై ప్రజావాణికి ఫిర్యాదు అందడంతో హైడ్రా అధికారులు గురువారం ఆక్రమణలను తొలగించి, రహదారిని ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. గత 15 ఏళ్లుగా ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని, హైడ్రా చొరవతో తమ సమస్య తీరిందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

పెన్ పవర్
తెలంగాణ రౌండప్

# నైనీ కోల్ మైన్స్ టెండర్ నోటిఫికేషన్ రద్దు

- పాలనాపరమైన కారణాల వల్లే నిర్ణయమన్న సింగరేణి
- షెడ్యూల్ ప్రకారం సాయంత్రం ప్రారంభం కావాల్సిన బిడ్డింగ్
- సింగరేణి పాలకమండలికి పలు ప్రశ్నలు సంధించిన కేంద్ర బొగ్గు గనుల శాఖ



హైదరాబాద్ పెన్ పవర్:ఒడిశాలోని నైనీ బొగ్గు గని టెండర్ల నోటిఫికేషన్ ను రద్దు చేస్తున్నట్లు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్ సీసీఎల్) తాజాగా ప్రకటించింది. పాలనాపరమైన కారణాల వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. నైనీ కోల్ మైన్స్ టెండర్ల విషయంలో ఇటీవల తీవ్ర ఆరోపణలు రావడంతో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, గనుల శాఖ మంత్రి భట్టి విక్రమార్క స్పందించి టెండర్లు రద్దు చేస్తున్నట్లు ఇటీవల ప్రకటించారు. షెడ్యూల్ ప్రకారం.. ఈరోజు సాయంత్రం 5 గంటల నుంచి బిడ్డింగ్ ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉండగా టెండర్ రద్దు చేస్తున్నట్లు ఎస్ సీసీఎల్ ప్రకటించింది. మరోవైపు, నైనీ బొగ్గు బ్లాక్ టెండర్ల విషయంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ సింగరేణి పాలకమండలిని ప్రశ్నించింది. టెండర్ల విషయంలో అవినీతి ఆరోపణలు ఎందుకు వస్తున్నాయని, సైట్ విజిట్ ధృవీకరణ పత్రాలు ఎందుకు ఇవ్వడం లేదని సంయుక్త కార్యదర్శి సంజయ్ కుమార్ నిలదీశారు. టెండర్ల ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదని, నిబంధనలు, టెండర్లపై పాలక మండలిలో చర్చించి మరోసారి నిర్ణయం తీసుకుంటామని సింగరేణి అధికారులు వివరణ ఇచ్చారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దూకుడు

## ఫామ్‌హౌస్‌లో కేసీఆర్‌తో కేటీఆర్, హరీష్ రావు భేటీ




హైదరాబాద్ పెన్ పవర్: బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌తో కేటీఆర్, హరీష్ రావు భేటీ అయ్యారు. గురువారం (జనవరి 22) సాయంత్రం ఎర్రవెల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రానికి వెళ్లిన కేటీఆర్, హరీష్ రావు ఆయనతో సమావేశమయ్యారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్‌కు సిట్ నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. 2026, జనవరి 23న విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. సిట్ నోటీసుల నేపథ్యంలోనే కేసీఆర్‌తో హరీష్, కేటీఆర్ అత్యసరంగా భేటీ అయినట్లు బీఆర్ఎస్ పార్టీ వర్గాల సమాచారం. ఈ విషయంలో ఎలా ముందుకు వెళ్లాలనే దానిపై కేసీఆర్‌తో చర్చించనున్నట్లు తెలిసింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటికే హరీష్ రావును సిట్ విచారించిన సంగతి తెలిసిందే. దీంతో విచారణలో హరీష్ రావును సిట్ అడిగిన ప్రశ్నలు.. ఇచ్చిన సమాధానాల గురించి ఈ భేటీలో డిస్కస్ చేయనున్నట్లు సమాచారం. హరీష్ రావు విచారణ శైలీ ఆధారంగా ే (జనవరి 23) ఇంటరాగేషన్‌కు కేటీఆర్ సిద్ధం కానున్నట్లు తెలిసింది. కాగా, స్టేట్ పాలిటిక్స్‌ను షేక్ చేసిన ఫోన్ ట్యాపింగ్ కేసులో సమగ్ర దర్యాప్తు జరిపేందుకు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ నేతృత్వంలో ఇటీవల స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్(సిట్)ను ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. సజ్జనార్ పర్యవేక్షణలో 9 మంది సభ్యులను నియమించారు. ఈ క్రమంలో సజ్జనార్ సిట్ ఈ కేసులో దూకుడు పెంచింది. ఇందులో భాగంగానే ఈ కేసులో

-4 లో

# వలపు వలకు చిక్కి రూ.2.14 కోట్లు పోగొట్టుకున్న హైదరాబాద్ టెక్కీ

- సోషల్ మీడియాలో పరిచయమైన మహిళ మాయలో టెక్కీ
- ట్రేడింగ్ యాప్‌లో పెట్టుబడుల పేరుతో భారీ మోసం
- విడతలవారీగా రూ.2.14 కోట్లు బదిలీ చేయించిన కేటుగాళ్లు
- అప్పులు చేసి, ఆస్తులు అమ్మి డబ్బు కట్టిన బాధితుడు
- మోసపోయానని గ్రహించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు




హైదరాబాద్ పెన్ పవర్:హైదరాబాద్‌లో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సైబర్ మోసగాళ్ల చేతిలో దారుణంగా మోసపోయాడు. సోషల్ మీడియాలో పరిచయమైన ఓ మహిళ చెప్పిన మాయమాటలు నమ్మి, నకిలీ ట్రేడింగ్ యాప్‌లో పెట్టుబడి పెట్టి ఏకంగా రూ.2.14 కోట్లు పోగొట్టుకున్నాడు. ఈ ఘటన సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరిగింది. సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసుల వివరాల ప్రకారం, టీఎన్‌జీవో కాలనీకి చెందిన 44 ఏళ్ల సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి గతేడాది డిసెంబరులో సోషల్ మీడియా ద్వారా ఓ మహిళ పరిచయమైంది. తాను స్టాక్ ట్రేడింగ్‌లో భారీగా లాభాలు గడిస్తున్నట్లు నమ్మించింది. ఆమె మాటలు విశ్వసించిన బాధితుడి చేత ఓ నకిలీ ట్రేడింగ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించింది.డిసెంబర్ 12న తొలిసారిగా రూ.31.5 లక్షలు పెట్టుబడి పెట్టగా, యాప్‌లో భారీగా లాభాలు కనిపించాయి. దీంతో మరింత పెట్టుబడి పెడితే ఇంకా ఎక్కువ లాభాలు వస్తాయని ఆ మహిళ ఆశ చూపింది. ఆమెను నమ్మి రెండోసారి రూ.42.27 లక్షలు బదిలీ చేశాడు. ఆ తర్వాత లాభాలను విత్‌డ్రా చేసుకునేందుకు ప్రయత్నించగా, వచ్చిన లాభంలో 30 శాతం పన్ను యూఏఈ ప్రభుత్వానికి కట్టాలని మోసగాళ్లు మెలిక పెట్టారు.యాప్‌లో కనిపిస్తున్న వర్చువల్ లాభాలను నిజమని నమ్మిన బాధితుడు, ఆఫీసు సహోద్యోగుల నుంచి రూ.90 లక్షలు అప్పు తీసుకున్నాడు. కుటుంబ సభ్యుల నుంచి డబ్బు సేకరించి, కొన్ని ఆస్తులను కూడా అమ్మి మొత్తం 8 విడతల్లో రూ.2.14 కోట్లు వారికి పంపాడు. చివరకు డబ్బు విత్‌డ్రా కోసం ప్రయత్నించగా, అదనంగా మరో రూ.68 లక్షలు కట్టాలని చెప్పడంతో తాను మోసపోయినట్లు గ్రహించాడు.వెంటనే అప్రమత్తమైన బాధితుడు, ఆ మహిళ ఫొటోను ఇంటర్నెట్‌లో వెతకగా, అది ఇన్‌స్టాగ్రామ్‌లోని వేరొకరి ప్రొఫైల్ నుంచి దొంగిలించిందని తేలింది. దీంతో తాను నకిలీ ప్రొఫైల్‌తో మోసపోయానని నిర్ధారించుకుని సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## సిరిసిల్ల జిల్లాను ఎత్తేసే కుట్రలో

# రేవంత్ రెడ్డి ఉన్నారు

- సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ జెండానే ఎగురుతుందన్న కేటీఆర్
- అన్ని వార్డులను గెలవడమే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని శ్రేణులకు పిలుపు
- ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలన్న కేటీఆర్




హైదరాబాద్ పెన్ పవర్:సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ జెండానే ఎగరబోతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికలపై వార్డుల ఇంచార్జిలతో నిర్వహించిన సమావేశంలో ఆయన కీలక దిశానిర్దేశం చేశారు. మెజారిటీ కాదు.. అన్ని వార్డులు గెలవడమే లక్ష్యంగా బీఆర్ఎస్ ముందుకు వెళ్లాలని స్పష్టం చేశారు.సిరిసిల్ల ఒకప్పుడు ఎలా ఉందో, బీఆర్ఎస్ పాలనలో ఎలా అభివృద్ధి చెందిందో ప్రజలకు స్పష్టంగా వివరించాలని కేటీఆర్ సూచించారు. "మన పని మనమే చెప్పుకోవాలి.. వేరే వాళ్లు చెప్పరు" అంటూ కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. మున్సిపల్ ఎన్నికల తర్వాత ఇక స్థానిక ఎన్నికలు లేవని, నేరుగా సాధారణ ఎన్నికలే ఉంటాయని గుర్తుచేస్తూ, ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని చెప్పారు.

-4 లో

## మేడారం జాతరకు హెలికాప్టర్ సేవలు...

# డిస్కౌంట్ కూడా ఉంది!

- మేడారం జాతర భక్తుల కోసం హెలికాప్టర్ సేవలు ప్రారంభం
- తెలంగాణ టూరిజం, తుంబి ఎయిర్‌లైన్స్ సంయుక్త నిర్వహణ
- హనుమకొండ నుంచి మేడారానికి, జాతరపై ఏరియల్ వ్యూ రైడ్స్
- రెండు రకాల సర్వీసులకు వేర్వేరు ధరలు ఖరారు




హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధిగాంచిన మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతరకు వెళ్లే భక్తులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. జాతర సమయంలో వేగంగా గమ్యస్థానం చేరుకునేందుకు వీలుగా హెలికాప్టర్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. తెలంగాణ పర్యాటక శాఖ, తుంబి ఎయిర్‌లైన్స్ సంయుక్తంగా అందిస్తున్న ఈ సేవలు ఇవాళ్టి నుంచి ప్రారంభమయ్యాయి.భక్తుల అవసరాలకు అనుగుణంగా రెండు రకాల ప్యాకేజీలను నిర్వాహకులు ప్రకటించారు. మొదటి ప్యాకేజీలో భాగంగా హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానం నుంచి నేరుగా మేడారం వెళ్లి, తిరిగి వచ్చేందుకు అవకాశం కల్పించారు.

-4 లో

# ధాన్యం కొనుగోళ్లలో జాతీయ రికార్డు

- ఖరీఫ్‌లో 71.70 లక్షల టన్నులకు పైగా..
- రైతులకు మద్దతుధర, బోనస్ రూ. 18,444 కోట్ల చెల్లింపు
- రేషన్‌కార్డులపై ఇతర నిత్యావసరాలూ ఇస్తాం
- మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

-4 లో



01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దూకుడు

## ఫామ్‌హౌస్‌లో కేసీఆర్‌తో కేటీఆర్, హరీష్ రావు భేటీ

-3 పేజి తరువాయి
ప్రధాన నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావును కస్టడీలోకి తీసుకుని విచారించింది. అలాగే ఈ కేసులో ఇతర నిందితుల వాంగ్మూలాలు, సేకరించిన సాంకేతిక ఆధారాలతో మరింత లోతుగా దర్యాప్తు చేస్తోంది. అంతేకాకుండా గత ప్రభుత్వ హయాంలో ట్యాపింగ్ ద్వారా నష్టపోయిన బాధితులు, అధికారులు కాల్ డేటా సహా వాట్సాప్, సోషల్‌మీడియా డేటాను పోలీసులు ఇప్పటికే సేకరించారు. ఫోన్ ట్యాపింగ్ వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరనేది ఇప్పటికే స్పెషల్ టీమ్ ప్రాథమిక సమాచారం సేకరించింది. అధికారుల విచారణ పూర్తి కావడంతో ఇందులో రాజకీయ నాయకుల పాత్రపై సిట్ దృష్టి సారించింది. ఇందులో భాగంగానే పలువురు రాజకీయ నాయకులకు నోటీసులు జారీ చేసి విచారించింది. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, చిరుమర్తి లింగయ్య, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ యాదవ్, అతడి తండ్రిని ఇంటరాగేట్ చేసింది. అనంతరం బీఆర్ఎస్ అగ్రనేత హరీష్ రావుకు నోటీసులు ఇచ్చి విచారించింది. హరీష్ రావు విచారణ ముగిసిన రెండు రోజులకే మరో బీఆర్ఎస్ అగ్రనేత కేటీఆర్ కు సిట్ నోటీసులు జారీ చేసి విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ అగ్ర నాయకులకు సిట్ వరుసగా నోటీసులు జారీ చేస్తుండటంతో ఈ కేసులో నెక్ట్స్ ఏం జరగబోతుందని రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

# సిరిసిల్ల జిల్లాను ఎత్తేసే కుట్రలో రేవంత్ రెడ్డి ఉన్నారు

-3 పేజి తరువాయి
ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. జిల్లాల పునర్విభజన పేరుతో గందరగోళం సృష్టిస్తున్నారని, రాజన్న సిరిసిల్ల జిల్లాను ఎత్తివేయాలనే కుట్రలో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారని ఆరోపించారు. ఈ అంశం ప్రజల్లో, న్యాయవాదులు, మేధావుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. రేవంత్ పాలనను తుగ్లక్ తరహా పాలనగా అభివర్ణించారు. సర్పంచ్ ఎన్నికల ఫలితాలతో కాంగ్రెస్ షాక్‌లో ఉందని, అందుకే కార్పొరేషన్ ఎన్నికలకు భయపడుతోందని కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో 40 శాతానికి పైగా సర్పంచ్ స్థానాలు బీఆర్ఎస్ గెలుచుకుందని గుర్తు చేశారు. సిరిసిల్ల పట్టణం గత 35 ఏళ్లుగా కాంగ్రెస్‌కు దూరంగా ఉందని, బీఆర్ఎస్ ఆవిర్భావం తర్వాత మున్సిపాలిటీపై పూర్తి ఆధిపత్యం సాధించామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఎంత బాకీ పెట్టిందో గడపగడపకు తీసుకెళ్లాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. రైతుబంధు, బతుకమ్మ చీరలు, రిటైర్డ్ ఉద్యోగుల పింఛన్లు, నేతన్నల సమస్యలు అన్నింటినీ ప్రజలకు వివరించాలని సూచించారు.
నేతన్నలకు నిజమైన అండగా నిలిచింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని గుర్తుచేశారు. సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికలను తానే నేరుగా పర్యవేక్షిస్తానని ప్రకటించిన కేటీఆర్... ప్రజలు ఎప్పుడూ గులాబీ జెండా వైపేనని ధీమా వ్యక్తం చేశారు. ప్రతి కార్యకర్త, ప్రతి వార్డు ఇంచార్జి ఇంటింటి ప్రచారం చేసి, అభివృద్ధిని చెప్పి, కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

# ధాన్యం కొనుగోళ్లలో జాతీయ రికార్డు

**హైదరాబాద్ పెన్ పవర్:** ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణ సరికొత్త రికార్డు సృష్టించిందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గత ఖరీఫ్‌లో 53.49 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలుచేస్తే, ప్రస్తుత సీజన్‌లో ఏకంగా 71.70 లక్షల టన్నులు దాటినట్లు వెల్లడించారు. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలోనూ ఒక పంటను ఈ స్థాయిలో కొనుగోలు చేయలేదన్నారు. మద్దతుధర, బోనస్ కలిపి రూ.18,444 కోట్లు చెల్లించామని.. 14.2 లక్షల మంది రైతులు ప్రయోజనం పొందారని వివరించారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు, లీగల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ మార్గదర్శకాల రూపకల్పనపై హైదరాబాద్‌లోని ఐఏఎస్ అధికారుల అసోసియేషన్ క్లబ్‌లో పౌరసరఫరాలశాఖ, పౌరసరఫరాల సంస్థ అధికారులతో గురువారం సమీక్షించారు. తొలుత కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. పౌరసరఫరాలశాఖ, నీటిపారుదల శాఖల సమన్వయంతోపాటు తెలంగాణ రైతాంగానికి ఈ రికార్డులో భాగస్వామ్యం ఉందన్నారు. డీలర్లు ఎవరైనా రేషన్ బియ్యాన్ని దారిమళ్లిస్తే వెంటనే వారి డీలర్‌షిప్‌ను రద్దుచేయాలని అధికారుల్ని ఆదేశించారు. “గత ప్రభుత్వ హయాంలో దొడ్డు బియ్యం భారీగా దుర్వినియోగమైంది. బీరు ఫ్యాక్టరీలకు, రీసైక్లింగ్‌కు వెళ్లేది. ఆనాటి అక్రమాల్ని అరికట్టడానికి మేం సన్నబియ్యం పథకాన్ని ప్రవేశపెట్టాం.
రాష్ట్రంలో 85% (3.71 కోట్ల) మందికి.. ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున ఉచిత సన్నబియ్యంతో కడుపునిండా అన్నం పెడుతున్న ఘనత తెలంగాణదే. సన్నబియ్యంతోపాటు ఇతర నిత్యావసర వస్తువుల్ని కూడా రేషన్‌కార్డుదారులకు అందిస్తాం. రాష్ట్ర ఆర్థికపరిస్థితి మెరుగుపడ్డాక అమల్లోకి తెస్తాం. బకాయిలున్న మిల్లర్లకు ధాన్యం కేటాయింపులు ఉండవు. రాజకీయ ఒత్తిడి వస్తే నేను చూసుకుంటా. ఎవరేం చెప్పినా వారికి అధికారులు ధాన్యం కేటాయించొద్దు. గత భారాస ప్రభుత్వ హయాంలో ధాన్యం కేటాయింపుల విధానం లోపభూయిష్టంగా ఉండటంతో మిల్లర్లు భారీగా అక్రమాలకు పాల్పడ్డారు” అని మంత్రి విమర్శించారు. ఈ సందర్భంగా లీగల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ మార్గదర్శకాల పుస్తకాన్ని ఆవిష్కరించారు. రికార్డుస్థాయి ధాన్యం కొనుగోళ్ల నేపథ్యంలో అధికారులు, ఉద్యోగుల్ని అభినందించారు.

**విదేశాలకు ధాన్యం ఎగుమతులు..**
“రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తి భారీగా పెరుగుతోంది. గత ఖరీఫ్‌తో పోలిస్తే ఈసారి అదనంగా 3.95 లక్షల మంది రైతులు లబ్ధి పొందారు.
ధాన్యాన్ని ఇతర రాష్ట్రాలు, విదేశాలకూ ఎగుమతి చేస్తాం. రైతులు కూడా అధిక డిమాండ్ ఉన్న ధాన్యం రకాల్ని సాగుచేయాలి” అని మంత్రి ఉత్తమ్ సూచించారు. గోదాముల కొరత తీర్చేందుకు స్టెయిన్‌లెస్ స్టీల్‌తో కొత్త గోదాముల్ని ఏర్పాటుచేస్తామని వెల్లడించారు. ధాన్యాన్ని విదేశాలకు ఎగుమతి చేసే మిల్లర్లను ప్రోత్సహించడానికి కొత్త పాలసీ తెస్తామన్నారు. అంతకుముందు స్టీఫెన్ రవీంద్ర మాట్లాడుతూ ధాన్యం ఉత్పత్తి, నిల్వ, బియ్యం పంపిణీ పర్యవేక్షణకు వార్‌రూం ఏర్పాటు చేస్తామని తెలిపారు.

# భూపాలపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

**ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని పరిష్కారానికి చర్యలు తీసుకుంటా..**

**భూపాలపల్లి మున్సిపాలిటీ లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలో ఎమ్మెల్యే జీఎస్సార్...**



**జయశంకర్ భూపాలపల్లి. పెన్ పవర్:** జయశంకర్ భూపాలపల్లి మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. భూపాలపల్లి మున్సిపాలిటీ లోని వివిధ వార్డుల్లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ ముఖ్య నాయకులతో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ముందుగా దత్తాత్రేయ కాలనీ లో రూ.100 లక్షలతో శివనగర్ నుండి మహబూబ్ పల్లి వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో రూ.100 లక్షలతో సీసీ రోడ్డు, 5 ఇంక్లైన్ కమాన్ దగ్గర రూ.50 లక్షలతో రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ భవన నిర్మాణ పనులు, రూ.50 లక్షలతో ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు, ఆర్టీసీ బస్ డిపో దగ్గర రూ.200 లక్షలతో సీసీ రోడ్డు మరియు సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులు, ఫక్కీరు గడ్డలో రూ.50 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, మహిళలకి ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. జంగేడు లో రూ.150 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, మహిళలకి ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు.

**గౌడ కులస్తుల ప్రభుత్వ ఉద్యోగుల క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే...**
భూపాలపల్లి మంజూరునగర్ లోని ఎమ్మెల్యే గారి క్యాంప్ కార్యాలయంలో గౌడ కులస్తుల ప్రభుత్వ ఉద్యోగుల సంఘం వారి ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులను అభినందిస్తూ, వారికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ సేవలో గౌడ కులస్తుల ఉద్యోగులు సమర్థవంతంగా పని చేస్తూ, సమాజ అభివృద్ధికి తోడ్పడుతున్నారని ఎమ్మెల్యే ప్రశంసించారు. ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతాయుతంగా ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. సమాజ ఐక్యత, సేవాభావం పెంపొందించడంలో ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని అన్నారు.

**సాయి శుభం మల్టీ కుసైన్ ఫ్యామిలీ రెస్టారెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే...**
భూపాలపల్లి పట్టణంలో మెయిన్ రోడ్డులో ఐసీఐసీఐ బ్యాంక్ దగ్గర నూతనంగా ఏర్పాటు చేసిన సాయి శుభం మల్టీ కుసైన్ ఫ్యామిలీ రెస్టారెంట్‌ను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా రెస్టారెంట్ యాజమాన్యానికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. యువత ఉపాధి అవకాశాలు పెంచేలా ఇలాంటి వ్యాపారాలు ప్రారంభం కావడం అభినందనీయమన్నారు. నాణ్యమైన ఆహారం, పరిశుభ్రమైన వాతావరణంతో భూపాలపల్లి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

**చెల్పూరులో మార్కండేయ మహర్షి జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే...**
గణపురం మండలం చెల్పూరు గ్రామంలో నిర్వహించిన మార్కండేయ మహర్షి జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి, జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మార్కండేయ మహర్షి త్యాగం, భక్తి, ధర్మబోధనలు నేటి తరానికి ఆదర్శమని ఎమ్మెల్యే తెలిపారు. ఆయన చూపిన మార్గాన్ని అనుసరిస్తూ సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఇలాంటి జయంతి వేడుకలు మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు.

## మేడారం జాతరకు హెలికాప్టర్ సేవలు...

# డిస్కౌంట్ కూడా ఉంది!

-3 పేజి తరువాయి
ఈ రౌండ్ ట్రిప్‌కు ఒక్కో వ్యక్తికి ఛార్జీ రూ. 35,999గా నిర్ణయించారు. అయితే, జనవరి 23లోపు బుక్ చేసుకున్న వారికి రాయితీ అందిస్తుండగా, వారు రూ. 30,999 చెల్లిస్తే సరిపోతుంది. ఇక, రెండో ప్యాకేజీ కింద మేడారం జాతర అందాలను ఆకాశం నుంచి వీక్షించాలనుకునే వారి కోసం ‘జాయ్ రైడ్స్‘ నిర్వహిస్తున్నారు. మేడారం సమీపంలోని పడిగాపూర్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచి ఈ సర్వీసులు నడుస్తాయి. సుమారు 6 నుంచి 7 నిమిషాల పాటు సాగే ఈ గగన విహారానికి ఒక్కొక్కరికి రూ. 4,800 రుసుముగా వసూలు చేయనున్నారు. ఈ సేవలతో భక్తులు సమయం ఆదా చేసుకోవడంతో పాటు జాతరను విహంగ వీక్షణం చేసే అద్భుత అవకాశం పొందవచ్చు.

## యూపీసీవోల్ట్ తో తెలంగాణ ప్రభుత్వం ఎంఓయూ




**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ను దేశంలోనే ఏఐ డేటా సెంటర్ హబ్గా తీర్చిదిద్దాలన్న లక్ష్య సాధనలో రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక పెట్టుబడిని సాధించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ‘తెలంగాణ రైజింగ్’ ప్రతినిధి బృందం దావోస్లో యూపీసీవోల్ట్ సంయుక్త భాగస్వామ సంస్థతో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) చేసుకుంది. నెదర్లాండ్స్కు చెందిన యూపీసీ రిన్యూవబుల్స్ గ్రూప్, వోల్ట్ డేటా సెంటర్స్ సంయుక్త భాగస్వామ్యంలో రాష్ట్ర ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం ప్రకారం హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో 100 మెగావాట్ల సామర్థ్యంతో ఏఐ డేటా సెంటర్ నెలకొల్పుతుంది.
ముఖ్యమంత్రి నేతృత్వంలోని ప్రతినిధి బృందం వోల్ట్ సీఈవో హాన్ డీ గ్రూట్, యూపీసీ రిన్యూవబుల్స్ (ఆసియా పసిఫిక్) సహ వ్యవస్థాపకుడు స్టీవెన్ జ్వాన్, యూపీసీ రిన్యూవబుల్స్ ఇండియా సీఈవో అలోక్ నిగమ్ తో సమావేశమైంది. 3 ఈ ప్రాజెక్టుకు వచ్చే ఐదేళ్లలో రూ. 5,000 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ఈ డేటా సెంటర్కు అవసరమైన విద్యుత్ సరఫరాకు 100 మెగావాట్ల సామర్థ్యంతో ప్రత్యేక పునరుత్పాదక విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణ దశలో దాదాపు 3,000 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి. డేటా సెంటర్ ప్రారంభమైన తర్వాత మరో 800 మందికి ఉద్యోగ అవకాశాలు దక్కనున్నాయి. పెట్టుబడుల సాధనలో మంత్రి శ్రీధర్ బాబు ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందిస్తూ, తెలంగాణ రైజింగ్ 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తెలంగాణను తీర్చిదిద్దడంలో ఆధునిక డిజిటల్ మౌలిక వసతులు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు.

## రేకుర్తి సమ్మక్క-సారక్క జాతరకు పటిష్ట బందోబస్తు

**కరీంనగర్ పెన్ పవర్:** స్థానిక రేకుర్తిలో (జనవరి 28 నుండి 31 వరకు) అత్యంత వైభవంగా జరగనున్న సమ్మక్క-సారక్క జాతరను పురస్కరించుకొని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం గురువారం బందోబస్తు ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలించారు. జాతర జరిగే ప్రాంతాన్ని సందర్శించిన సీపీ, బందోబస్తు మ్యాప్‌ను పర్యవేక్షించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, జాతరకు వచ్చే వేలాది మంది భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన భద్రత కల్పించాలని అధికారులను ఆదేశించారు. అమ్మవార్ల గద్దెల వద్ద భక్తుల రద్దీని నియంత్రించేందుకు పటిష్టమైన బారికేడింగ్ ఏర్పాటు చేయాలన్నారు. జాతర ప్రాంగణంలో నిరంతర నిఘా కోసం ప్రత్యేక పోలీస్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి, భక్తులకు అవసరమైన సహాయం అందించాలన్నారు. జాతర సమయంలో వాహనాల రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పార్కింగ్ స్థలాలను కేటాయించి, రాకపోకలను క్రమబద్ధీకరించాలని సూచించారు. భక్తుల దర్శనం సజావుగా సాగేలా ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు క్షేత్రస్థాయిలో సిబ్బందిని సమన్వయం చేసుకోవాలన్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు సీపీ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ విజయకుమార్ ఇన్‌స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్ ఇతర పోలీసు అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు సిబ్బంది పాల్గొన్నారు.

## మేడారం భక్తులకు వాట్సప్ సౌకర్యం

**హైదరాబాద్ పెన్ పవర్:** మేడారం జాతరకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం తెలంగాణ ప్రభుత్వం తొలిసారిగా వాట్సాప్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. భక్తులు 76589 12300 నంబర్కు ‘హాయ్ ’ అని మెసేజ్ పంపితే జాతరకు సంబంధించిన పూర్తి వివరాలు పొందవచ్చు. జాతర రూట్ మ్యాప్, ట్రాఫిక్ అప్డేట్స్, పార్కింగ్, వైద్య కేంద్రాలు, స్నానఘట్టాలు తదితర సమాచారం నేరుగా వాట్సాప్లో లభించనుంది. ఈ సేవలతో భక్తులకు మరింత సౌకర్యం కలగనుంది

## నువ్వు ఓటు వేయడం వల్లే ఒక్క ఓటుతో నేను ఓడిపోయాను

**పెద్దపల్లి పెన్ పవర్:** పెద్దపల్లి జిల్లా కమాన్పూర్ మండలం గొల్లపల్లి గ్రామం నుండి ఇటీవల రంగాపూర్ గ్రామానికి నివాసం మార్చిన మొనారి రాధమ్మ(61) అనే వృద్ధురాలు ఎస్సారెస్పీ కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. గొల్లపల్లిలో తన ఓటు హక్కు అలాగే ఉండడంతో, ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ఓటు వేసింది. ఆ గ్రామం నుండి సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసిన కలబోయిన నరేందర్ అనే వ్యక్తి ఒక్క ఓటు తేడాతో ఓడిపోయాడు. దీంతో రెండు గ్రామాల్లో ఓటు హక్కు వినియోగించిన వారే తన ఓటమికి కారణమని భావించి, ముగ్గురు వ్యక్తుల మీద పెద్దపల్లి జూనియర్ సివిల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేసాడు నరేందర్ . ఈ నేపథ్యంలో సివిల్ కోర్టు వారికి నోటీసులు పంపగా, తనకు నోటీసులు వచ్చాయని రాధమ్మ తీవ్ర మనస్తాపానికి గురైయింది. తన అన్న ఓటమికి తానే కారణమని, తన కుటుంబం అంతు చూస్తానని రాధమ్మ కుటుంబ సభ్యులను నరేందర్ సోదరుడు విజేందర్ బెదరించిడు. నరేందర్, అతని సోదరుడు విజేందర్ వేధింపులు తాళలేక రాధమ్మ ఎస్సారెస్పీ కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. రాధమ్మ కొడుకు ఫిర్యాదుతో పోలీసులు నరేందర్, విజేందర్లపై కేసు నమోదు చేసారు.

## తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్2025 లకు ఫిబ్రవరి 3 లోగా దరఖాస్తు చేసుకోవాలి

**హైదరాబాద్, జనవరి 22 : పెన్ పవర్:** 2025 జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (జదీఖీజ) ద్వారా సర్టిఫికేషన్ పొందిన చిత్రాలకుతెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్2025 ప్రదానం చేయనున్నట్లు రాష్ట్ర చలనచిత్ర పరిశ్రమాభివృద్ధి సంస్థ తెలిపింది. ఫీచర్ ఫిలిమ్స్, జాతీయ సమైక్యతపై ఫీచర్ ఫిలిమ్స్, పర్యావరణం, హెరిటేజ్, చరిత్ర, సామాజిక చైతన్యం, బాలల చిత్రాలు, చలన చిత్ర రంగంలో టెక్నీషియన్లు, డాక్యుమెంటరీ, షార్ట్ ఫిలిమ్స్,సినిమా రంగంపై బుక్స్ తదితర రంగాలలో ఈ అవార్డులు ప్రదానం చేయనున్నట్టు తెలంగాణ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వెల్లడించారు. ఇప్పటివరకు ఉన్న అవార్డు విభాగాలకు తోడు ఈసారి కొత్త విభాగాలను కూడా ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. సామాజిక స్పృహను ప్రతిబింబించే చిత్రాలకు ‘ఉత్తమ సామాజిక సందేశ చిత్రం’ అవార్డు, ప్రత్యేక విభాగంలో డా. సి. నారాయణరెడ్డి అవార్డులను అందజేయనున్నామన్నారు. ఈ గద్దర్ అవార్డులకు అర్హులైన నిర్మాతలు, ఇతర దరఖాస్తుదారులు అవార్డులకు సంబంధించిన దరఖాస్తు పత్రాలు, మార్గదర్శకాలను జనవరి 31, 2026 వరకు పొందవచ్చని, తగిన డాక్యుమెంట్లతో కూడిన ఎంట్రీల సమర్పణకు ఫిబ్రవరి 3, 2026 చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ అవార్డుల వివరాలకు https://filmin.telangana.gov.in అనే వెబ్సైట్ లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. నిర్దేశిత మార్గదర్శకాలను పాటిస్తూ నిర్ణీత గడువులోపే దరఖాస్తులను సమర్పించాలని అర్హులైన నిర్మాతలను కోరారు.

# రేవంత్ స్ట్రాటజీనా... గులాబీ వాగ్ధాటా...



**హైదరాబాద్, జనవరి 22 పెన్ పవర్:** మ్మడి రాష్ట్ర విభజన తర్వాత నాటి టీఆర్ఎస్ పటిష్టతకు అప్పటి సీఎం కేసీఆర్ చాలా పకడ్బందీ చర్యలు చేపట్టారు. ముఖ్యంగా తమ పార్టీ ఏర్పడిందే టీడీపీ నుంచి కాబట్టి, టీడీపీ ఉనికి లేకుండా చూసుకున్నారు.నయానో, భయానో టీడీపీ నేతలను తమ పార్టీలో చేర్చుకుని పదవులు కట్టబెట్టారు. టీడీపీని తెరమరుగు చేయడం ద్వారా.. టీఆర్ఎస్ పదేళ్లపాటు అధికారంలో ఉండేలా చూసుకోగలిగారు. అయితే.. రాజకీయాలుమారుతూ వచ్చాయి.ప్రస్తుతం కాంగ్రెస్ సీఎంగా రేవంత్ రెడ్డి అధికారంలో ఉన్నారు.రేవంత్ రెడ్డికి .. కేసీఆర్ స్ట్రాటజీలపై పక్కాగ అవగాహన ఉంది. 2029 ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలోకి రావాలంటే.. బీఆర్ఎస్సమస్యల్లో కొట్టుమిట్టాడాల్సిన అవసరముంది. అంటే ఆ పార్టీని దెబ్బతీయగలగాలి. అందులో ఇప్పటికే కొంతవరకూ సక్సెసయ్యారు కూడా. కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్ సహా పలు కేసులు కత్తుల్లా బీఆర్ఎస్ నేతలమెడలపై వేలాడుతున్నాయి. అయితే ఇది చాలదు .. ఇంకా చాలా చేయాలన్నది రేవంత్ స్ట్రాటజీగా కనిపిస్తోంది.అందులో ముఖ్యమైంది బీఆర్ఎస్ ను బలహీన పరచడం. దానికి గతంలో బలంగా ఉండి ఇప్పుడు ..నిస్తేజంగా మారిన పార్టీలను తిరిగి చిగురింపజేయడం.. అందులో భాగంగా ఇప్పటికే కమ్యూనిస్టులకు( ప్రాధాన్యమిస్తున్నారు. ఆయా పార్టీలతో కలిసి సభల్లో పాల్గొంటున్నారు కూడా. ఇప్పుడు రాష్ట్రంలో ఉనికేకనుమరుగైన టీడీపీని కూడా కాస్త చిగురింప చేస్తే.. బీఆర్ఎస్ లోని కొందరు నేతలుఉ అటువైపు వెళ్లే అవకాశముంటుంది. ఆమేరకు వారి బలం కాస్త తగ్గితే.. అది వచ్చే ఎన్నికల్లో తమకు మేలు చేస్తుందన్నది రేవంత్ఉద్దేశ్యంగా కనిపిస్తోంది.ఆ స్ట్రాటజీలో భాగంగానే బీఆర్ఎస్ దిమ్మెలు కూల్చేయాలని సీఎం హోదాలో ఉండి సీఎం రేవంత్ రెడ్డి.. టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చినట్లు కనిపిస్తోంది. దీన్ని బీఆర్ఎస్ కూడా గట్టిగానేఎదుర్కొంటోంది. రేవంత్ రెడ్డి ఇప్పటికే అమరావతి ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తున్నారంటూ ఎదురుదాడి చేస్తోంది. ఇదే సందర్భంగా మళ్లీ తెలంగాణ సెంటిమెంట్, ఉద్యమ పార్టీ అంటూ పాత అంశాల్ని ప్రస్తావిస్తోంది.మరి.. రేవంత్ స్ట్రాటజీ వర్కవుట్ అవుతుందా..? బీఆర్ఎస్ వాగ్దాటి గెలుస్తుందా..? వేచి చూడాల్సిందేడ!

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## గ్రామాల్లో సమ్మక్క సాలమ్మ తల్లి తులాభారం.

**హైదరాబాద్ పెన్ పవర్:** కమాన్ పూర్ మండలంలోని గ్రామాల్లో శ్రీ సమ్మక్క సారలమ్మ తల్లికి సమర్పించే బంగారం తులాభారం ఎక్కడ చూసినా దర్శనమిస్తోంది.రెండు సంవత్సరాలకు ఒకసారి వచ్చే శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర తెలంగాణలో ప్రాచుర్యం పొందింది. ఇందులో భాగంగా కమాన్ పూర్ మండలంలోని గుండారం, జూలపల్లి, రొంపి కుంట, నాగారం, పెంచికల పేట, పేరా పల్లి, తదితర గ్రామాల్లో కిరాణం షాపులు కిటకిటలాడుతున్నాయి. ఆయా షాపుల వద్ద ప్రత్యేకంగా కాంట (తరాజు) పెట్టి వాటిపై కూర్చున్న తర్వాత తులాభారం వేసుకొని అంత బెల్లం (బంగారం) మొక్కు ప్రకారంగా తీసుకొని గ్రామీణ ప్రాంతాల్లో పంపిణీ చేయడం కనిపిస్తోంది. అలాగే ప్రస్తుతం సమ్మక్క సారలమల జోరు గ్రామీణ ప్రాంతాల్లో తల్లికి మేక సమర్పించి ఉత్సవాలు చేసుకోవడం జరుగుతుంది. ఈనెల 27 నుండి 29 వరకు సమ్మక సాలమ్మ జాతర కొనసాగుతుంది. గ్రామాల్లో శ్రీ సమ్మక్క సారలమ్మ తల్లి పండుగ వాతావరణం నెలకొంది.

## కీర్తిలాల్స్ సిగ్నేచర్ లాంజ్ ప్రారంభం

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆభరణాల రంగంలో భారత దేశంలోని అత్యంత విశ్వసనీయ మైన పేర్లలో ఒకటిగా నిలిచిన కీర్తిలాల్స్ నగరంలో తమ సోమాజిగూడ షోరూమ్లో సిగ్నేచర్ లాం జ్ను ఆవిష్కరించింది. ఈ ప్రత్యేకమైన లాంజ్, అధిక శ్రేణి ఆకర్షణీయమైన అనుభవాన్ని అందించే వజ్రా భరణాల అనుభవాన్ని అందించేలా రూపొం దించబ డిందని కీర్తిలాల్ స్టోర్ మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. సిగ్నేచర్ లాంజ్ సింగిల్ ఎడిషన్ జువెల్లరీని ప్రదర్శిస్తుందన్నారు. ప్రతి ఆభరణం ప్రత్యేకంగా ఉండేలా రూపకల్పన చేయబడుతూ, అరుదైన శిల్పకళను, వ్యక్తిత్వాన్ని తెలుపుకుంటుందని అన్నారు. సిగ్నేచర్ లాంజ్ కీర్తిలాల్ యొక్క అంతర్గత కళాత్మక దృష్టి, నైపుణ్య మైన తయారీ వారసత్వాన్ని ప్రతిబింబిస్తూ, ఆలో చనాత్మక డిజైన్, ఖచ్చితమైన హస్తకళ మరియు సొగసైన ఆభరణా లను అంది స్తుందన్నారు. మరింత వ్యక్తిగతమైన, అధునాతన వాతావర ణాన్ని అందిం చేందుకు రూపొందించ బడిన ఈ లాంజ్, వజ్రాభర ణాలను అనుభవించే విధానాన్ని సరి కొత్తగా నిర్వచిస్తుం దన్నారు. సిగ్నేచర్ లాంజ్లో సింగిల్ ఎడిషన్ జ్యువెల్ల రీ కలెక్షన్ను ప్రదర్శిస్తా మని, ఇది వజ్రాల సృష్టిలో అరుదైనది. ఇక్కడ డిజైన్ ఒక్కసారి మాత్రమే రూపొందించ బడుతుం దన్నారు. ఎప్పటికీ పునరావృతం కాదు అని, అధునా తన రూపక ల్పన పద్ధతులు, ఖచ్చితమైన ఇంజనీరింగ్ నాజూకైన వివరాలతో ఈ ప్రత్యేక ఆభరణాలు రూపొందించబడుతూ, ప్రతి ఆభరణానికి ప్రత్యేకమైన గుర్తింపును అందిస్తాయన్నారు.

## ఒక నిర్లక్ష్యపు చర్య జీవితాంతం బాధ మిగిలిస్తుంది. ప్రమాదాల నివారణకు అందరం కలిసి పనిచేద్దాం :

## పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా.



**హైదరాబాద్ పెన్ పవర్:** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు సురక్షితమైన ప్రయాణ వాతావరణాన్ని ఏర్పాటు చేయడానికి ప్రజలందరూ కలిసి పనిచేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీ అంబర్ కిషోర్ ఝా పిలుపునిచ్చారు.రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "అరైవ్అలైవ్" కార్యక్రమంలో భాగంగా మంచిర్యాల డీసీపీ కార్యాలయంలో, మంచిర్యాల డీసీపీ శ్రీ ఎగ్గడి భాస్కర్ అధ్యక్షతన మీడియా అవుట్‌రీచ్ డే కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ శ్రీ అంబర్ కిషోర్ ఝా చేతుల మీదుగా అరైవ్అలైవ్ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, వాహనదారులు ఇంటి నుంచి బయలుదేరి సురక్షితంగా గమ్యాన్ని చేరి తిరిగి క్షేమంగా ఇంటికి చేరుకోవాలనే ప్రధాన లక్ష్యంతోనే ఈ అరైవ్అలైవ్ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు.రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనల పాటించడం వ్యక్తిగత బాధ్యత మాత్రమే కాకుండా సమాజానికి సంబంధించిన అంశమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తే గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని అన్నారు.హెల్మెట్ ప్రాముఖ్యత అందరికీ తెలిసినప్పటికీ, దాన్ని ధరించకపోవడమే అనేక ప్రమాదాలకు ప్రధాన కారణమవుతోందని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల వల్ల కొందరు ప్రాణాలు కోల్పోతుంటే, మరికొందరు శాశ్వత అంగవైకల్యంతో జీవితాంతం బాధపడాల్సి వస్తోందన్నారు. ఎక్కువగా ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనల వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు.ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ, ప్రమాదాల నివారణలో భాగస్వాములు కావాలని సూచించారు. మానవ తప్పిదాలే రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణమని తెలిపారు. పట్టణాలు, గ్రామాల్లో రోడ్డు భద్రత కమిటీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రమాదం జరిగిన ప్రదేశాలను కమిటీ సభ్యులు పరిశీలించి, ప్రమాదానికి గల కారణాలను విశ్లేషించి, ఆ ప్రాంతంలో మళ్లీ ప్రమాదాలు జరగకుండా అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసి తగిన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

ద్విచక్ర వాహనాలు నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, రాంగ్ రూట్‌లో వెళ్లడం, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగించడం, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడం, అతివేగం వంటి చర్యలు ప్రమాదాలకు కారణమవుతున్నాయని హెచ్చరించారు.ప్రమాదాల రహిత కమిషనరేట్‌గా తీర్చిదిద్దేందుకు మూడు విధానాలను అమలు చేస్తున్నామని తెలిపారు. అవి 1. ఇంజనీరింగ్, 2. ఎడ్యుకేషన్ (అవగాహన), 3. ఎన్ఫోర్స్‌మెంట్ (కఠిన అమలు) అని వివరించారు.

సమాజంలోని మారుమూల ప్రాంతాల వరకు సమాచారాన్ని చేరవేసే శక్తి మీడియాకు ఉన్నందున, పోలీస్ శాఖతో సమన్వయంతో మీడియా రోడ్డు భద్రత సందేశాలను ప్రతి ఇంటికి చేరవేయడంలో కీలక పాత్ర పోషించాలని సీపీ కోరారు. అందరం కలిసి"అరైవ్అలైవ్" లక్ష్యంగా ప్రమాదాల నివారణ,సురక్షిత ప్రయాణం, క్షేమంగా గమ్యం చేరే వాతావరణాన్ని ఏర్పాటు చేద్దామని పిలుపునిచ్చారు.అనంతరం అధికారులు కలిసి అరైవ్అలైవ్ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, సీఐలు ప్రమోద్ రావు, అశోక్, శ్రీలత,నరేష్ కుమార్,ఎస్సైలు పాల్గొన్నారు.

# శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు పటిష్ట బందోబస్తు

**కరీంనగర్ పెన్ పవర్:** కరీంనగర్ స్థానిక మార్కెట్ రోడ్డులోని శ్రీ వేంకటేశ్వర దేవస్థానంలో రేపటి నుండి (జనవరి 23, శుక్రవారం) ప్రారంభం కానున్న శ్రీ లక్ష్మి, పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం బందోబస్తు ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గురువారం ఆలయ ప్రాంగణాన్ని సందర్శించిన సీపీ, బందోబస్తు మ్యాప్‌ను నిశితంగా పర్యవేక్షించారు. జనవరి 23 నుండి 29వ తేదీ వరకు వారం రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సీపీ అధికారులతో మాట్లాడుతూ... స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా క్యూ లైన్ల వద్ద పటిష్టమైన బారికేడింగ్ ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. శ్రీవారి కళ్యాణం జరిగే మండపం వద్ద తోపులాట జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ప్రసాద వితరణ కేంద్రాల వద్ద క్రమశిక్షణతో కూడిన బందోబస్తు నిర్వహించాలన్నారు. మార్కెట్ రోడ్డులో ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీసులకు సూచించారు. పర్యవేక్షణకు విచ్చేసిన సీపీకి ఆలయ కమిటీ సభ్యులు సాదర స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు



నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు వెంకటస్వామి, యాదగిరిస్వామి, ఇన్స్పెక్టర్లు రాంచందర్ రావు, తిరుమల్, ఖరీముల్లాఖాన్ ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఓయూటీయే అధ్యక్షుడు ప్రొఫెసర్ మనోహర్పై విధించిన సస్పెన్షన్ను వెంటనే ఉపసంహరించుకోవాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** యూనివర్సిటీ అధ్యాపకుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతూ నిలబడిన సీనియర్, ప్రొఫెసర్ మనోహర్ సస్పెండ్ చేయడం. అత్యంత బాధాకరం, తీవ్ర ఆందోళన కలిగించే చర్యగా భావిస్తున్నామని ఇది మొత్తం తెలంగాణ రాష్ట్రంలోని రెండున్నర కోట్ల మంది బీసీల ఆత్మగౌరవానికి సంబంధించిన సమస్యగా భావిస్తున్నట్లు ఎంపీ, బీసీజాక్ రాష్ట్ర చైర్మన్ ఆర్. కృష్ణయ్య అన్నారు. ఒకపక్క బీసీలకు రాజ్యాధికారంలో వాటా కల్పిస్తామని, హక్కులు ఇస్తామని, ఆర్థికంగా బలోపేతం చేస్తామని, విద్యాపరంగా బీసీలకు ఎక్కువ నిధులుకేటాయిస్తామని, రాజకీయంగా రిజర్వేషన్లు కల్పిస్తామని చెబుతున్న ప్రభుత్వం మరోపక్క ఈ విధంగా బీసీల మీద అణచివేత ధోరణి ప్రదర్శించడం ఎంత మాత్రం తగదు అని అన్నారు. ఈ అన్యాయమైన, ప్రజాస్వామ్య విరుద్ధమైన చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.ప్రొఫెసర్ మనోహర్ రెండు దశాబ్దాలకు పైగా అధ్యాపక వర్గానికి నిస్వార్థంగా సేవలందించారు. ఆయన సుమారు 15 సంవత్సరాల పాటు ూఖూా అధ్యక్షుడిగా, జనరల్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వహిస్తూ, ప్రమోషన్లు, జీతభత్యాలు, నియామకాలు, సేవా నిబంధనలు వంటి కీలక అంశాలపై అహర్నిశలు కృషి చేశారు. ముఖ్యంగా, యూనివర్సిటీ అధ్యాపకుల రిటైర్మెంట్ వయసును 65 ఏళ్లకు పెంచడంలో ప్రొఫెసర్ మనోహర్ కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఇది రాష్ట్రవ్యాప్తంగా మొత్తం అకడమిక్ సమాజానికి మేలు చేసిన చారిత్రక నిర్ణయం అన్నారు.తన దీర్ఘకాలిక సేవా ప్రయాణంలో ఎలాంటి వ్యక్తిగత లాభాపేక్ష లేకుండా పనిచేస్తూ, మచ్చలేని నాయకుడిగా అధ్యాపకుల విశ్వాసం, గౌరవాన్ని ఆయన సంపాదించారు.



అలాంటి నాయకుడికి అధ్యాపకుల సమస్యలపై మాట్లాడే హక్కును నిరాకరించడం ప్రజాస్వామ్య స్వరాలను అణిచివేయడమే కాకుండా, అకడమిక్ స్వేచ్ఛను కాలరాసినట్లే. అధ్యాపకులు మరియు వారి ప్రతినిధులు తమ న్యాయబద్ధమైన సమస్యలను లేవనెత్తే హక్కును కట్టడి చేయడానికి ఎవరికీ అధికారం లేదు.ఈ పరిణామానికి ఉస్మానియా యూనివర్సిటీ పరిపాలనే పూర్తి బాధ్యత వహించాలంటూ ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆయన మీద విధించిన సస్పెన్షన్ను వెంటనే రద్దు చేసి, ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ పరిణామాల నేపథ్యంలో ూఖూా ప్రస్తుతం ప్రెసిడెంట్గా ఉన్న మనోహర్ ని మరియు ఎగ్జిక్యూటివ్ కమిటీ నాయకులు విద్యానగర్ లోని బీసీ భవన్ లో ఆర్. కృష్ణయ్య కలిసి వారికి పూర్తి మద్దతు ప్రకటించారు. త్వరలోనే పెద్ద ఎత్తున దీనిమీద ఉద్యమం చేయనున్నట్టు తెలిపారు.ప్రజాస్వామ్య పాలనకు దిశానిర్దేశం చేసిన సంస్థగా పేరుగాంచిన ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఈ విధమైన ఘటన జరగడం సర్వత్రా విస్తృత చర్చకు దారితీస్తోంది. అధ్యాపక సంఘం అధ్యక్షునిపై ఈ చర్య తీసుకోవడం విశ్వవిద్యాలయంలో ప్రజాస్వామ్య నిర్వహణ, అకడమిక్ స్వయం ప్రతి పత్తిపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతోందని అన్నారు.అధ్యాపకుల హక్కులు, గౌరవం, ప్రజాస్వామ్య స్వరాన్ని కాపాడటంలో ఎలాంటి రాజీ లేకుండా నిలబడుతుందని, ప్రొఫెసర్ మనోహర్ పూర్తి మద్దతుగా ఉంటుందని తెలిపారు. త్వరలోనే బీసీ జేఏసీ చైర్మన్ ఎంపీ ఆర్. కృష్ణయ్య ఆధ్వర్యంలో ప్రొఫెసర్ మనోహర్ సస్పెన్షన్ ఎత్తివేయాలని బీసీల హక్కులను కాపాడాలని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు ఉంటాయని త్వరలోనే ప్రెస్ మీట్ కూడా ఉంటుందని ఆర్. కృష్ణయ్య తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్,,

## వంద మందితో బీఆర్ఎస్‌లో చేరిన పొనగంటి రాము..



**హైదరాబాద్ పెన్ పవర్:** హుజురాబాద్ నియోజకవర్గంలోని జమ్మికుంట మున్సిపాలిటీ 9వ వార్డు కాంగ్రెస్ పార్టీ మాజీ కౌన్సిలర్ పొనగంటి రాము, తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

ఈ సందర్భంగా హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, పొనగంటి రాముకు పార్టీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి సాదరంగా ఆహ్వానించారు.

అనంతరం పొనగంటి రాము, మాట్లాడుతూ,,

కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు గడిచినా ప్రజలకు చెప్పుకోదగ్గ అభివృద్ధి చేయలేదని విమర్శించారు. రాష్ట్రాభివృద్ధి బీఆర్ఎస్ పార్టీలోనే సాధ్యమని, కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ ముందుకు సాగిందని స్పష్టం చేశారు.తెలంగాణ ప్రజలంతా మళ్లీ కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా చూడాలని కోరుకుంటున్నారని అన్నారు.ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బ్రహ్మాండమైన విజయాన్ని సాధించిందని గుర్తు చేస్తూ, రాబోయే అన్ని ఎన్నికల్లోనూ హుజురాబాద్జమ్మికుంట మున్సిపాలిటీలలో గులాబీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

# 19 లక్షలకే డబుల్ బెడ్ రూమ్ ఇల్లు...



**హైదరాబాద్, జనవరి 22 పెన్ పవర్:** తెలంగాణ రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ హైదరాబాద్‌లో సొంతింటి కల కలిగిన వారి కోసం 289 రెడీ-టు-మూవ్ ఫ్లాట్ల విక్రయానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. నల్లగండ్ల, మియాపూర్, బండ్లగూడ వంటి ప్రాంతాల్లో ఉన్న ఈ 1BHK, 2BHK ఫ్లాట్లను పారదర్శకమైన ఆన్‌లైన్ లాటరీ పద్ధతిలో కేటాయించనున్నారు. సింగిల్ బెడ్రూమ్ ధరలు రూ. 13 లక్షల నుండి ప్రారంభం కాగా.. డబుల్ బెడ్రూమ్ ధరలు రూ. 19 లక్షలుగా నిర్ణయించారు. దరఖాస్తుదారులు జనవరి 31 లోపు టోకెన్ అడ్వాన్స్ చెల్లించాలి. ఫిబ్రవరి 4, 5 తేదీల్లో లాటరీ డ్రా నిర్వహిస్తారు. జీహెచ్ఎంసీ పరిధిలో సొంత ఇల్లు లేని వారు మాత్రమే ఈ పథకానికి అర్హులు. ఐదేళ్ల లాక్-ఇన్ పీరియడ్ నిబంధన కూడా ఉంది.తెలంగాణ రాష్ట్రంలో సొంతింటి కలను నెరవేర్చే దిశగా మరో కీలక అడుగు పడింది. తెలంగాణ రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రెడీ-టు-మూవ్ ఫ్లాట్ల విక్రయానికి ప్రకటన విడుదల చేసింది. మంగళవారం (21-01-2026) నోటిఫికేషన్ జారీ చేస్తూ.. హైదరాబాద్ నగర పరిధిలోని కీలక ప్రాంతాల్లో నిర్మితమైన ఫ్లాట్లను లాటరీ విధానం ద్వారా కేటాయించనున్నట్లు ప్రకటించింది.ఈ పథకంలో భాగంగా పోచారం, బండ్లగూడ, మేడ్చల్ మల్కాజ్‌గిరి వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో ఉన్న ఫ్లాట్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు.

2బీఎఖ ఫ్లాట్లు వివిధ విస్తీర్ణాల్లో అందుబాటులో ఉండగా.. సామాన్య మధ్యతరగతి కుటుంబాలకు అనుకూలంగా ధరలను నిర్ణయించారు. మొత్తం 289 ఫ్లాట్స్‌ను ఈ వేలం ద్వారా విక్రయించనున్నట్లు టీజీఆర్ఎస్సీఎల్‌మేనేజింగ్ డైరెక్టర్ వీ.పీ గౌతమ్ ఓ ప్రకటనలో తెలిపారు.1బీఎఖ ఫ్లాట్ల విస్తీర్ణం సుమారు 523 నుంచి 645 చదరపు అడుగులు కాగా.. వాటి ధరలు రెగ్యూలర్ ఫ్లాట్స్‌కు సుమారు రూ. 13 లక్షల నుంచి రూ. 18లక్షల వరకు నిర్ణయించారు. అలాగే 2బీఎఖ ఫ్లాట్లు 761 చదరపు అడుగుల విస్తీర్ణంతో.. రెగ్యులర్ ఫ్లాట్ల ధరలు రూ.19 లక్షలుగా నిర్ణయించారు. ఇక మోడల్ ఫ్లాట్ల ధరలు ఒక చదరపు అడుగుకి రూ.2750 నుంచి రూ. 2500లుగా నిర్ణయించారు.. డబుల్ బెడ్రూం ఫ్లాట్స్‌కు ఒక చదరపు అడుగుకి రూ.3200లుగా నిర్ణయించారు.ప్రతి ఫ్లాట్‌కు అవసరమైన అన్ని ప్రాథమిక సదుపాయాలతో పాటు పార్కింగ్ సౌకర్యం కూడా కల్పించినట్లు తెలిపారు. ఫ్లాట్ల కేటాయింపు పూర్తిగా ఆన్‌లైన్ లాటరీ విధానంలో జరగనుంది. ఆసక్తి ఉన్న అభ్యర్థులు జనవరి 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తుల స్వీకరణ అనంతరం ఫిబ్రవరి 4 మరియు 5 తేదీల్లో లైవ్ లాటరీ డ్రా నిర్వహించనున్నారు. ఈ లాటరీ డ్రాను యూట్యూబ్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయనుండటంతో.. పూర్తి పారదర్శకత ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. దరఖాస్తు సమయంలో దరఖాస్తుదారుడి ఆదాయం నెలకు.. 1దీఎఖ ఫ్లాట్లకు రూ. 35,000, 2BHK ఫ్లాట్లకు రూ. 50,000గా నిర్ణయించారు. వీటితో పాటు.. నో హౌస్ సర్టిఫికేట్ ను డిమాండ్ డ్రాఫ్ట్‌తో పాటు.. ప్రాజెక్ట్ సైట్ లో సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తుదారు, వారి కటుంబ సభ్యులకు కొత్త జీహెచ్ఎంసీ పరిధిలో ఇల్లు లేదా ప్లాట్ ఉండకూడదని కండీషన్ పెట్టారు. వీటితో పాటు.. దరఖాస్తుదారుడు ఒక కుటుంబం నుంచి ఒక్క దరఖాస్తు మాత్రమే సమర్పించాలి. ఆస్తిని ఇతరులకు బదిలీ చేయడానికి తప్పనిసరిగా లాక్ ఇన్ పిరియడ్ 5 ఏళ్ల వరకు ఉంటుందన్నారు.ఇక రిజిస్ట్రేషన్ చేసుకునే వారు సింగిల్ బెడ్రూం ఫ్లాట్స్ కు టోకెన్ అడ్వాన్స్ రూ.లక్ష.. డబుల్ బెడ్రూం ఫ్లాట్స్‌కు టోకెన్ అడ్వాన్స్ రూ.2 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. దీనికి గడువు జనవరి 31 సాయంత్రం 5 గంటల వరకు ఇచ్చారు. లాటరీలో ఎంపిక కాకపోయిన వారికి ఈ మొత్తాన్ని తిరిగి

చెల్లిస్తామని ప్రకటించింది.ఇక ఈ ఫ్లాట్లు నగరంలోని ఐటీ కారిడార్లు, ORR, మెట్రో, విద్యాసంస్థలు, ఆసుపత్రులకు సమీపంలో ఉండటం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. స్వగృహ వెబ్‌సైట్ ద్వారా పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని.. సందేహాల కోసం హెల్ప్‌లైన్ నంబర్లను కూడా అందుబాటులో ఉంచామని అధికారులు తెలిపారు. మొత్తంగా చూస్తే... పెరుగుతున్న రియల్ ఎస్టేట్ ధరల మధ్య ప్రభుత్వ ఆధ్వర్యంలో నమ్మకమైన గృహావకాశం పొందే అవకాశంగా ఈ స్వగృహ ఫ్లాట్ల విక్రయం నిలవనుంది. సొంతింటి కలతో ఎదురుచూస్తున్న అనేక కుటుంబాలకు ఇది ఒక మంచి అవకాశంగా మారిందని చెప్పవచ్చు.

# సీటీలో రోడ్ల విస్తరణ

**హైదరాబాద్, జనవరి 22 పెన్ పవర్:**



హైదరాబాద్ వాసులకు హెచ్ఎండీఏ తీపి కబురు చెప్పింది. నగరం నుంచి ఓఆర్ఆర్ వరకు ట్రాఫిక్ లేని ప్రయాణానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. కొత్తగా ఎలివేటెడ్ కారిడార్లతో పాటు.. కొన్ని జాతీయ రహదారుల విస్తరణకు శ్రీకారం చుట్టింది. వ ఇప్పటికే చాలా వరకు ప్రాజెక్టులో మొదలు కాగా.. మరికొన్నింటికి టెండర్లను ఆహ్వానించింది. రద్దీగా ఉండే ప్రాంతాల్లో భూ స్థాయిలో 4 లైన్ల రోడ్డును.. దాంతో పాటే 6 లైన్ల రోడ్డుతో రెండు భాగాలుగా అనుసంధానం చేసే ప్రణాళికలను హెచ్ఎండీఏ చేపట్టింది.

హైదరాబాద్ మహానగరంలో నానాటికీ పెరుగుతున్న వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని.. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ప్రభుత్వం భారీ రహదారుల విస్తరణ పనులకు శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా నగరం మధ్యలో నుంచి ప్రయాణ సమయాన్ని తగ్గించేలా 6 లైన్ల రహదారుల నిర్మాణం.. ప్రస్తుతం ఉన్న 3 లైన్ల రోడ్లను 4 లైన్లుగా మార్చే పనులకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రణాళికలు సిద్ధం చేసింది.ఐటీ కారిడార్‌లో అత్యంత రద్దీగా ఉండే నానక్‌రాంగూడ నుండి గచ్చిబౌలి వరకు ఉన్న ప్రధాన రహదారిని విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం ఇక్కడ సర్వీసు రోడ్డు కాకుండా ప్రధాన మార్గం మూడు వరుసలుగా ఉంది. గచ్చిబౌలి జంక్షన్ వద్ద కొత్తగా నిర్మించిన ఫ్లైఓవర్ల కారణంగా వాహనాల రాకపోకలు పెరిగి ట్రాఫిక్ నిలిచిపోతోంది. ఈ సమస్యను పరిష్కరించడానికి ఈ రహదారిని 4 లైన్ల మార్గంగా మార్చనున్నారు.దీని కోసం ప్రభుత్వం సుమారు రూ. 26.50 కోట్ల నిధులను మంజూరు చేస్తూ పరిపాలనా అనుమతులు ఇచ్చింది. ఈ విస్తరణతో అవుటర్ రింగ్ రోడ్డుకు చేరుకోవడం ప్రయాణికులకు సులభతరం కానుంది.కోకాపేట,మణికొండ, పుప్పాలగూడ వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో ట్రాఫిక్ కష్టాలను తీర్చేందుకు ఎంజీఐటీ నుండి మణికొండ వరకు కొత్త రహదారిని నిర్మించనున్నారు. సుమారు 3.57 కిలోమీటర్ల పొడవునానిర్మించే ఈ మార్గాన్ని పూర్తిస్థాయిలో 6 లైన్ల రహదారిగా తీర్చిదిద్దనున్నారు. రూ. 110 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే ఈ ప్రాజెక్టులో రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లు, వరద నీటి కాలువలు, ఆధునికల్యాండ్‌స్కేపింగ్‌ను ఏర్పాటు చేస్తారు. ఇది పూర్తయితే గండిపేట పరిసర ప్రాంతాల నుండి నగరంలోకి వచ్చే వాహనదారులకు పెద్ద ఉపశమనం లభిస్తుంది.బంజారాహిల్స్ ఐసీసీసీ టవర్ నుండి శిల్పా లేఅవుట్ వరకుప్రతిపాదించిన ఎలివేటెడ్ కారిడార్ నగర రవాణా వ్యవస్థలో కీలక మలుపు కానుంది. రూ. 1,656 కోట్ల వ్యయంతో నిర్మించే ఈ కారిడార్ ద్వారా బంజారాహిల్స్ నుండి గచ్చిబౌలి వరకు ఎక్కడా సిగ్నల్స్ లేకుండాప్రయాణించవచ్చు. ఈ మార్గంలో ఫిల్మ్ నగర్, టీహబ్, ఐటీసీ కోహినూర్ వంటి కీలక జంక్షన్ల వద్ద ప్రవేశ, నిష్క్రమణ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నారు. భూస్థాయిలో.. ఎలివేటెడ్ విధానంలో 4, 6 వరుసలుగా ఈరహదారిని అభివృద్ధి చేయడం ద్వారా హైటెక్ సిటీ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలు దాదాపుగా తొలగిపోనున్నాయి.

# ఎన్నికలకు రెడీ అవుతున్న పార్టీలు

**ఖమ్మం, జనవరి 22 పెన్ పవర్:**ఖమ్మం జిల్లాలో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల వేడి మొదలైనది ఒకవైపు ఎండలు వేడి ఎక్కువవుతుంది మరోవైపు రాజకీయ వేడి ఎక్కువవుతుంది ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే ఖమ్మం జిల్లాలోనిప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్ బిఆర్ఎస్ పార్టీలు ఏదులాపురం,వైరా, కల్లూరు మధిర,సత్తుపల్లి లో ఎన్నికలు ఇన్చార్జిలను నియమించుకున్నారు.మరోవైపు చాప కింద నీరు లాగా బలంగా ఉన్న కమ్యూనిస్టుపార్టీలైన సిపిఐ సిపిఎం పార్టీలు కూడా సమావేశాలు నిర్వహిస్తూ క్యాడర్ ని ఎన్నికలకు సిద్ధం చేస్తున్నారు వాళ్లకు బలంగా ఉన్నచోట పోటీ చేసి మిగతా చోట్ల ఎవరికి మద్దతు ఇవ్వాలని ప్రణాళికలు సిద్ధంచేసుకుంటున్నారు మిగతా పార్టీలైన బిజెపి సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ సైతం పోటీలో సిద్ధంగా ఉన్నాము అంటూ క్యాడర్లో ఉత్సాహాన్ని నింపుతున్నారు.సర్పంచ్ ఎన్నికల ఫలితాలతో మంచి జోష్ లో ఉన్నకాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల్లో కూడా అదే హవా కొన సాగించాలని, బిఆర్ఎస్ పార్టీ కూడా గత వైభవాన్ని దృష్టిలో ఉంచుకొని బాగా పనిచేసే మంచి ఫలితాలను సాధించాలని వ్యూహరచనలు చేస్తున్నాయి.మున్సిపల్ఎన్నికల్లో కాంగ్రెస్ టిఆర్ఎస్ సీపీఐ సిపిఎం పార్టీలు మధ్య పోటీ ఉండగా, కాంగ్రెస్ సిపిఐ కలిసి పోటీ చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి, అదేవిధంగా బిఆర్ఎస్ సీపీఎం పార్టీలు కలిసి పోటీ చేసే ఆలోచనలు ఉన్నట్లుకనిపి స్తున్నాయి అదే దిశగా పావులు కదుపుతున్నారు. ఖమ్మం జిల్లాలో అన్ని మున్సిపాలిటీల్లో క్లీన్ స్వీప్ చేయాలని కాంగ్రెస్ పార్టీకి చెందిన ముగ్గురు మంత్రులు సంకల్పంతో పనిచేస్తున్నారు.రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రిపొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారి నియోజకవర్గంలో ఉన్న ఏదులాపురం మున్సిపాలిటీలో ఇప్పటికే మంత్రి పలుమార్లు పర్యటించి ఇన్చార్జిలని నియమించి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అలాగే ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క పరిధిలో ఉన్న మధిర మున్సిపాలిటీలో అన్ని వార్డులతో సహా ఇన్చార్జిలను నియమించి వారితో చర్చించి దిశా నిర్దేశం చేస్తున్నారు. ఇకపోతే వైరా కల్లూరు సత్తుపల్లి మున్సిపాలిటీలలో మంచి పట్టు ఉన్నఎమ్మెల్యే రాందాస్ నాయక్ ఎమ్మెల్యే రాగమయి సత్తుపల్లి కాంగ్రెస్ నాయకులు దయానంద్ తో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పలుమార్లు చర్చించి వ్యూహాలను తయారు చేస్తున్నారు.మొత్తం మీద ముగ్గురు మంత్రులుకలిసి ఖమ్మం జిల్లాలో అన్ని మున్సిపాలిటీలలో అన్ని వార్డులతో సహా కైవసం చేసుకోవాలని మంచి పట్టుదలతో పని చేస్తున్నారు. మరోపక్క బిఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ మంత్రి అజయ్ కుమార్ వైరా పై దృష్టి పెట్టికార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపుతున్నారు. మధిరకు మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, లింగాల కమల్ రాజు విస్తృతంగా పర్యటించి కార్యకర్తలను సమాయత్తం చేస్తున్నారు. ఎదులాపురం మున్సిపాలిటీలో మాజీఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి,కల్లూరు సత్తుపల్లి కి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య లను ఇన్చార్జిలుగా నియమించి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యవేక్షిస్తున్నారు. ఇలా ఖమ్మం జిల్లాలోని పలుమున్సిపాలిటీల్లో జెండాలు ఎగురవేసేందుకు ఎవరి వ్యూహాల్లో వారు రచిస్తున్నారు. ఖమ్మం అంటే తెలుగుదేశం కంచుకోట అని, కనుక తెలుగు తమ్ముళ్లు ఎవరికి మద్దతిస్తే వాళ్లే గెలిచే అవకాశాలు ఎక్కువగాఉన్నాయనేది అందరూ భావిస్తున్నారు. ఇదే విషయాన్ని టిడిపి తమ్ముళ్లు పట్టు ఉన్నచోట పోటీ చేయాలని ఇప్పటికే పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్ళారు. ఇందుకు టీడీపీ నాయకులు దానికి సానుకూలంగా స్పందించినట్లుస మాచారం. ఈసారి ఖమ్మం జిల్లాలో టిడిపి కూడా పోటీలో ఉండే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

# బీఆర్ఎస్ చేరికలు



**హైదరాబాద్: పెన్ పవర్:** మాజీ మంత్రి హరీష్ రావు నివాసంలో సంగారెడ్డి, నర్సాపూర్, పటాన్చెరు నియోజకవర్గాలకు చెందిన పలువురు కీలక నాయకులు భారీ సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. హరీష్ రావు వారందరికీ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో పట్టణ ప్రగతి ద్వారా ప్రతినెలా నిధులు విడుదల చేసి పట్టణాలను సుందరంగా తీర్చిదిద్దాం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఒక్క రూపాయి కూడా విడుదల చేయడం లేదు. దీంతో మున్సిపాలిటీల్లో కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లడానికి, చెత్త ఎత్తడానికి కూడా నిధులు లేని దుస్థితి నెలకొందని అన్నారు. నిధుల కొరతతో పట్టణాల్లో పారిశుధ్యం లోపించింది. దోమల బెడద పెరిగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. స్ట్రీట్ లైట్లు వెలిగే పరిస్థితి లేదు. తాగునీటి సరఫరాలో కూడా కోతలు విధిస్తున్నారు. ఇస్నాపూర్, గుమ్మడిదల వంటి పారిశ్రామిక ప్రాంతాల్లో కూడా మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైంది. అధికారంలోకి రావడమే లక్ష్యంగా కాంగ్రెస్ 420 హామీలు ఇచ్చింది. ఇప్పుడు ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో పూర్తిగా చేతులెత్తేసిందని అన్నారు.మహిళలకు, యువతకు, రైతులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రజలు నిలదీస్తున్నారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు ఇవ్వడం లేదు. దళిత బంధు, బీసీ బంధు పథకాలను పూర్తిగా పక్కన పెట్టారు. పెన్షన్ల పంపిణీలో కూడా జాప్యం జరుగుతోంది. పేదల సంక్షేమాన్ని ఈ ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. కాంగ్రెస్ మోసపూరిత పాలనను ప్రజలు గమనిస్తున్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఉమ్మడి మెదక్ జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలపై గులాబీ జెండా ఎగరడం ఖాయం. సంగారెడ్డి, నర్సాపూర్, పటాన్చెరుతో సహా అన్ని మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుంది. కార్యకర్తలు, నాయకులు ప్రభుత్వ వైఫల్యాలను ఇంటింటికీ తీసుకెళ్లి ప్రజలను చైతన్యపరచాలని అన్నారు.

# "ప్రజా భద్రత పోలీసు బాధ్యత"



**మహబూబ్ నగర్: పెన్ పవర్:** జిల్లా ఎస్.పి.డి. జానకి ఆదేశాల మేరకు గురువారం నాడు జడ్చర్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని స్థానిక గీతాశ్రీ హైస్కూల్లో సురక్ష పోలీసు కళాబృందం, షీ టీం, ఏహెచ్టీయూ టీం, థర్మో కేబుల్స్ లిమిటెడ్ శ్రీ రామ చారిటబుల్ ట్రస్ట్ వారి సంయుక్త ఆధ్వర్యంలో సామాజిక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జడ్చర్ల ఎస్ఐ అక్షయ్ దీప్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టి క్రమశిక్షణతో జీవిస్తే మంచి భవిష్యత్తు సాధ్యమవుతుందని వివరించారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ లక్కీ డ్రా, గిఫ్టులు, లోన్లు, క్యూఆర్ కోడ్లు వంటి మోసాలను నమ్మవద్దని సూచించారు. సైబర్ నేరానికి గురైతే 1930 లేదా జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 8712659360 కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.18 సంవత్సరాల లోపు బాలబాలికలు వాహనాలు నడపరాదని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఏహెచ్టీయూ టీం బాల్య వివాహాల దుష్పరిణామాలు వివరించి, అలాంటి ఘటనలు గమనిస్తే 1098 చైల్డ్ హెల్ప్ లైన్కు ఫోన్ చేయాలని కోరారు. షీ టీం సభ్యులు గుడ్ టచ్ బ్యాడ్ టచ్, పోక్సో చట్టం 2012 గురించి తెలియజేసి, మహిళలు, బాలికలు ఇబ్బందులు ఎదురైతే షీ టీం నంబర్ 8712659365 ను సంప్రదించాలని తెలిపారు.

# మద్యం మత్తులో డ్రైవింగ్.. శిక్షగా ట్రాఫిక్ విధుల్లో మందుబాబులు

**పెద్దపల్లి:పెన్ పవర్:** మద్యం మత్తులో వాహనం నడుపుతూ పెద్దపల్లి ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడిన కాచాపూర్ గ్రామానికి చెందిన తీగల అజయ్ , చందపల్లికి చెందిన పర్శ తిరుపతి, చిన్నకల్వలకు చెందిన మెరుగు సతీష్, ఖిలావనపర్తికి చెందిన తలారి రాహుల్ లను కోర్ట్ ముందు హాజరుపరచగా పెద్దపల్లి న్యాయమూర్తి మంజుల రూ.500/- జరిమానా విధించడంతో పాటు, రెండు రోజుల పాటు ట్రాఫిక్ డ్యూటీ నిర్వహించాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా గురువారం పెద్దపల్లి పట్టణంలో ట్రాఫిక్ విధులు నిర్వర్తించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో విచారణ ఎదుర్కొన్న మందుబాబులకు తీర్పుకు అనుగుణంగా ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్ సమక్షంలో కమాన్, బస్టాండ్ కూడలిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ విధులు నిర్వర్తించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ప్రమాదం జరిగితే మీతో పాటు ఎదుటి వారి జీవితాలు రోడ్డున పడుతాయన్నారు.

# గెలుపు గుర్రాలకే టిఆర్‌పి టికెట్లు

## - టిఆర్‌పి సీనియర్ నాయకుడు గుండవేణ స్వామి



**పెద్దపల్లి: పెన్ పవర్:**మున్సిపల్ ఎన్నికల నగారా మోగనున్న తరుణంలో పెద్దపల్లి జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ అభ్యర్థులను పోటీకి నిలుపుతున్నట్లు పార్టీ సీనియర్ నాయకులు గుండవేణ స్వామి ప్రకటించా రు. జిల్లాలోని రామగుండం కార్పొరేషన్ సహా మంథని, పెద్దపల్లి, సుల్తానాబాద్ మున్సిపాలిటీలలోని అన్ని కార్పొరేటర్, కౌన్సిలర్ స్థానాలకు గెలుపు గుర్రాలకే పార్టీ బి-ఫారాలు అందజేస్తుం దని, నిబద్ధత కలిగిన కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు. గురువారం పెద్దపల్లి లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యావంతులు, ఉద్యమకారులు, యువత, మేధావులు ఈ ఎన్నికల్లో పోటీకి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఎన్నికల ముందు అనేక హామీలిచ్చి అధికారంలో కి వచ్చాక ప్రజలను, ముఖ్యం గా బీసీలను మోసం చేశాయని విమర్శించారు. బీసీలకు జనా భా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయకుండా కాంగ్రెస్ పార్టీ కపట ప్రేమ నటిస్తోందని, కేంద్రంలో ఉన్న బీజేపీ సైతం రిజర్వేషన్ల అంశంలో బీసీలను వంచిస్తోందని మండిపడ్డారు. ప్రజలను మోసం చేస్తున్న ఈ అగ్రకుల పార్టీలకు బుద్ధి చెప్పాలంటే రానున్న మున్సిప ల్ ఎన్నికల్లో వారిని ఓడించాల ని ఆయన కోరారు. కత్తెర గుర్తుపై పోటీ చేసే టిఆర్‌పి అభ్యర్థులను భారీ మెజారిటీ తో గెలిపించడం ద్వారానే బీసీ,ఎస్సీ,ఎస్టీ, పేద వర్గాలకు రాజ్యాధికారం సాధ్యమవు తుందని స్వామి పేర్కొన్నారు. బీసీ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తూ,రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీని అధికారం లోకి తీసుకురావడం లో జిల్లా ప్రజలు కీలకపాత్ర పోషించాల ని ఆయన విజ్ఞప్తి చేశారు.

# హనుమకొండ అడిషనల్ కలెక్టర్ ఇంట్లో ముగిసిన సోదాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** హనుమకొండ అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి ఇంట్లో ఏసీబీ సోదాలు ముగిశాయి. ఉదయం నుంచి హైదరాబాద్, నల్గొండ, మిర్యాలగూడలో తనిఖీలు చేశారు. రూ.100 కోట్ల వరకు అక్రమాస్తులను ఏసీబీ గుర్తించింది. ఏసీబీ అధికారులు భారీగా నగదు స్వాధీనం చేసుకున్నారు. అధునాతనమైన రెండు విల్లాలు, పది ప్లాట్స్, 14 ఎకరాల వ్యవసాయ భూమి, రూ.50 లక్షల బ్యాంక్ బ్యాలెన్స్, మరికొన్ని బినామీ ఆస్తులు గుర్తించినట్లు తెలుస్తోంది

# మద్యం మత్తులో గొడవ.. గొడ్డలితో దాడి గౌడవెల్లిలో వ్యక్తి హత్య



**హైదరాబాద్ పెన్ పవర్:** మేడ్చల్ జిల్లా గుండ్లపోచంపల్లి సర్కిల్ పరిధిలోని గౌడవెల్లి గ్రామంలో బుధవారం రాత్రి గోమారం లక్ష్మారెడ్డి (42) అనే పెయింటర్ హత్యకు గురయ్యాడు. తలపై తీవ్ర గాయాలతో మృతదేహాన్ని గుర్తించారు. ప్రాథమిక దర్యాప్తులో, లక్ష్మారెడ్డి తన ఇంట్లో అద్దెకుంటున్న గొర్రెల కాపరి మలిగ లింగంతో కలిసి మద్యం సేవించినట్లు, ఆ తర్వాత గొడవ జరిగి హత్య జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

## పరీక్షల్లో ఫెయిల్.. హాస్టల్ పైనుంచి దూకి విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

**హైదరాబాద్ పెన్ పవర్:** అంబర్పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో పరీక్షల్లో ఫెయిల్ అయిన మనస్తాపంతో ఓ విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. నిజామాబాద్ నల్లూరుకు చెందిన 18 ఏళ్ల యువతి స్థానిక ప్రైవేట్ హాస్టల్లో ఉంటూ డిగ్రీ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. తాజాగా వెలువడిన పరీక్షల ఫలితాల్లో ఐదు సబ్జెక్టులకు గాను నాలుగింట్లో ఫెయిల్ అవ్వడంతో, ఈ ఘటనకు పాల్పడింది. హాస్టల్ భవనం పైనుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది....

# సింహగిరిపై నేత్రపర్వంగా శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారి 'స్వర్ణ పుష్పార్చన'

## భక్తి పారవశ్యంలో మునిగితేలిన భక్తకోటి

## – గోవింద నామస్మరణతో మార్మోగిన సింహాచల క్షేత్రం

**హైదరాబాద్ పెన్ పవర్:** కలియుగ వైకుంఠంగా, కోట్లాది మంది భక్తుల ఇలవేల్పుగా విరాజిల్లుతున్న సింహాచల శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారి దివ్య క్షేత్రంలో గురువారం నాడు "స్వర్ణ పుష్పార్చన" సేవ అత్యంత వైభవంగా, ఆగమ శాస్త్రోక్తంగా జరిగింది. స్వామివారికి ఎంతో ప్రీతిపాత్రమైన ఈ సేవలో పాల్గొని భక్తులు తన్మయత్వం చెందారు.

**వైభవంగా ఆరాధన – కనుల పండుగగా అలంకరణ:**
ఆలయ కార్యనిర్వహణాధికారిణి శ్రీమతి ఎన్. సుజాత గారి ఆదేశాల మేరకు, పర్యవేక్షణ అధికారి కె. వెంకటేశ్వరావు గారి పర్యవేక్షణలో ఈ విశేష ఉత్సవం జరిగింది. గురువారం వేకువజామునే అర్చకస్వాములు అప్పన్న స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్యారాధనలు, ప్రాతఃకాల పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవిందరాజ స్వామి వారి ఉత్సవ మూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి, ఆలయ కల్యాణ మండపంలోని ప్రత్యేక వేదికపై వేంచేపు చేశారు.వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారికి 108 బంగారు పుష్పాలతో (స్వర్ణ పుష్పాలు) అర్చన గావించారు. అర్చక స్వాములు ఒక్కో సువర్ణ పుష్పాన్ని ఆ దేవదేవుని పాదాల చెంత సమర్పిస్తూ, అష్టోత్తర శతనామావళిని పఠిస్తుండగా.. ఆ దృశ్యాన్ని వీక్షించిన భక్తుల మనసు ఆధ్యాత్మిక ఆనందంతో పులకించిపోయింది. పసిడి కాంతుల్లో మెరిసిపోతున్న స్వామివారిని దర్శించుకున్నారు.ఈ అపురూప వేడుకను కళ్లారా వీక్షించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆర్జిత సేవలో పాల్గొన్న భక్తులు స్వామివారి దివ్య మంగళ స్వరూపాన్ని దర్శించుకుని పునీతులయ్యారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు. సింహగిరి మాడవీధులన్నీ భక్తుల "గోవింద... గోవిందా" నామస్మరణతో ప్రతిధ్వనించాయి. ఈ కార్యక్రమంలో ఆలయ వైదిక సిబ్బంది, ఇతర అధికారులు మరియు సిబ్బంది పాల్గొని స్వామివారి సేవలో తరించారు.

# ఆహార నాణ్యతలో తేడా వస్తే వేటు తప్పదు



**ములుగు: పెన్ పవర్:** తెలంగాణ కుంభమేళా గా పేరొందిన ములుగు జిల్లా మేడారం జాతర విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బందికి అందిస్తున్న భోజన ఏర్పాట్లను గురువారం మేడారంలో పోలీస్ సిబ్బందికి ఏర్పాటు చేసిన మెస్ ను ములుగు జిల్లా ఎస్పీ రామనాథ్ కేకన్ స్వయంగా పరిశీలించారు. మెస్‌లో భోజన నాణ్యతను పరిశీలించి, అన్ని ర్యాంకుల అధికారులు, సిబ్బంది తో పాటు పారిశుధ్య కార్మికులకు కూడా సమానమైన, నాణ్యమైన ఆహారం అందేలా చూడాలని ఆదేశించారు.భోజనం పరిశుభ్రత ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని, ఎలాంటి నిర్లక్ష్యం జరిగినా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటానని ఎస్పీ స్పష్టం చేశారు. ఎస్పీ స్థాయి అధికారి స్వయంగా తీసుకునే ఆహారమే బందోబస్తు విధుల్లో ఉన్న ప్రతి సిబ్బందికి అందించాలని ఆహార విభాగం ఇన్‌చార్జ్ అధికారులను ఆదేశించారు.బందోబస్తు విధుల్లో ఉన్న సిబ్బంది ఆరోగ్యం, భద్రత అత్యంత ముఖ్యమని పేర్కొంటూ, ఆహార నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని ఎస్పీ గారు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఓఎస్డి శివమ్ ఉపాధ్యాయ,ఏఎస్పి ఏటూరునాగారం మనన్ బట్,ఎస్బి సిఐ శంకర్, ఏటూరునాగారం సిఐ శ్రీనివాస్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సూర్యాపేటలో తొలిసారి బాధితుల ఇంటి వద్దే ఎఫ్ఐఆర్



**సూర్యాపేట:పెన్ పవర్:**సూర్యాపేట జిల్లా పోలీసులు తొలిసారి బాధితుల ఇంటి వద్ద తొలి ఎఫ్ఐఆర్ ను నమోదు చేసారు. నడిగూడెం పోలీసులు ఇంటి వద్దే ఎకఫ్ఐఆర్ నమోదు చేసారు. బాధితుల ఫిర్యాదుపై ఇంటికి వెళ్లి ఫిర్యాదు స్వీకరించి అక్కడే ఎఫ్ఐఆర్ నమోదు చేయడం కార్యాచరణ అమలు చేయడంలో భాగంగా నడిగూడెం పోలీసులు జిల్లాలో మొదటి కేసు నమోదు చేసినారని ఎస్పీ నరసింహ తెలిపారు. నడిగూడెం మండలం తెల్లబెల్లి గ్రామానికి చెందిన వికాళాంగురాలు భూమా రమాదేవిని భర్త వేధిస్తున్నాడు, కొడుతున్నాడు అని డయల్ 100 కు ఫోన్ చేయగా సంచారం అందుకున్న నడిగూడెం ఎస్ఐ అజయ్ కుమార్ తన సిబ్బందితో కలిసి బాధితురాలి ఇంటికి వెళ్లి ఫిర్యాదు స్వీకరించి అక్కడే కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్ కాపీని బాదితురాలికి అందించారని అన్నారు. ఎఫ్ఐఆర్ ఎట్ డోర్ స్టెప్‌లి కార్యక్రమం ద్వారా మహిళలపై, పిల్లలపై, వృద్దులపై దాడులు, దొంగతనాల, భౌతిక దాడులు, బాల్య వివాహాలు, వేదింపులు వట్టి సందర్భాల్లో బాధితులకు భరోసాగా ఉంటుంది, ఇంటికి వెళ్లి కేసు నమోదు చేయడం జరుగుతుంది అని ఎస్పీ తెలిపారు. మొదటి కేసు నమోదు చేసిన నడిగూడెం పోలీసులను ఈ సందర్భంగా అభినందించారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# గులాబీ పార్టీలో సిట్ లీక్స్ కలకలం...





**హైదరాబాద్, జనవరి 22 పెన్ పవర్:**ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలో ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్న విషయాలు, సిట్ లీక్స్ ప్రచారం తారా స్దాయికి చేరుతున్నాయి. తాజాగా ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీష్ రావును సిట్ విచారించిన విషయం తెలిసిందే. ఆ ఎనిమిది గంటల విచారణ ముగిశాక మీడియా సమావేశంలో సిట్ అధికారులపై మాజీ మంత్రి ,బీఆర్ ఎస్ కీలకనేత హరీష్ రావు చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. హరీష్ మాట్లడిన కొద్దిసేపటికే సిట్ పత్రికా ప్రకటన పేరుతో అవాస్తవాలు నమ్మొద్దంటూ సజ్జనార్ క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేశారు. ఇలా ఒక్క విచారణ వంద అనుమానాలు,మరెన్నో ప్రశ్నలు అన్నట్లుగా హరీష్ రావు విచారణ ముగిసింది. ఇదిలా ఉంటే తాజాగా సిట్ లీక్స్ తీవ్ర దుమారం రేపుతున్నాయి. సిట్ విచారణ సందర్భంగా హరీష్ రావు చేసిన వ్యాఖ్యలు, సిట్ వివరణలకు సంబంధం లేకుండా సరికొత్త వివాదం తెరపైకి తెచ్చాయి సిట్ లీక్స్. ఈ లీకులు ఎవరు చేశారు. ఎందుకు చేశారు. వాస్తవాలేంటి అనే సందేహాలు కాసేపు ప్రక్కన పెడితే. ఇంతకీ ఆ లీకుల్లో చెప్పిన విషయాలు కారు పార్టీలో తీవ్ర దుమారం రేపుతున్నాయి.సిట్ విచారణ సందర్భంగా నిన్న హరీష్ రావు ఫోన్ ట్యాప్ అయ్యిందనే విషయాన్ని సిట్ అధికారులు హరీష్ రావుకు చెప్పడంతో ఆయన ఒక్కసారిగా షాక్ అయ్యారట. మా ప్రభుత్వంలో నా ఫోన్ ట్యాప్ అవ్వడమేంటి అంటూ సిట్ అధికారుల ముందు ఆశ్చర్యం వ్యక్తం చేశారట. 2018 అసెంబ్లీ ఎన్నికల తరువాత నుండి కొన్ని నెలలపాటు హరీష్ రావు ఫోన్ ట్యాప్ అయినట్లు చెప్పారట. ఎప్పుడైతే తన ఫోన్ ట్యాప్ అయ్యిందని సిట్ అధికారులు చెప్పారో అప్పటి నుండి అధికారులు అడుగుతున్న ప్రతీ ప్రశ్నను పేపర్ పై రాసుకున్నారట హరీష్ రావు. నా ఫోన్ ట్యాప్ అయినట్లు మీరే కావాలని సృష్టిస్తున్నారా అంటూ సిట్ అధికారులను హరీష్ రావు తిరిగి ప్రశ్నించారట. ఏ రోజు, ఏ టైమ్ లో తన ఫోన్ ట్యాప్ అయ్యిందో ఆధారాలతో సహా హరీష్ రావుకు వివరించిన అధికారులు, మీకు తప్పుడు సమాచారం చెప్పాల్సిన అవసరం మాకు లేదంటూ సమాధనామిచ్చారట. ఒక్క హరీష్ రావు ఫోన్ మాత్రమే కాదు,తన అనుచరుల ఫోన్లు కూడా గత ప్రభుత్వంలో ట్యాప్ చేసినట్లుగా సిట్ అధికారులు హరీష్ రావుకు ఆధారాలతో సహా వివరించినట్లుగా సిట్ లిక్స్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.సిట్ లీక్స్ లో హరీష్ రావు ఫోన్ ట్యాప్ అయిన విషయం బయటకు రావడంతో సొంత పార్టీలో తీవ్ర స్దాయిలో చర్చ జరుగుతున్నట్లుగా తెలుస్తోంది. బీఆర్ ఎస్ పార్టీలో కేసీఆర్ తరువాత పార్టీని అన్నీ తామై నడిపించింది కేటీఆర్ ,హరీష్ రావు అనే విషయం అందరికీ తెలిసిందే. అయితే ఇప్పుడు హరీష్ రావు ఫోన్ ట్యాప్ చేయాల్సిన అవసరం ఎవరొకొచ్చింది. హరీష్ రావు సీక్రెట్ సంభాషణలు వినాలని ఎవరనుకున్నారు. పార్టీలో తనకు తెలియకుండానే హరీష్ పై కన్నేసిన వ్యక్తి ఎవరు అనేది గులాబీ దళంలో ప్రకపంనలు రేపుతోంది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బాధితుడిగా హరీష్ మారాడంటే, పార్టీలో అంతలా ప్రభావితం చేసిన కీలక నేతపైనే చర్చనడుస్తోంది. ఈ లీకులు కేటీఆర్ , హరీష్ రావు మధ్య గ్యాప్ కు కారణమతాయనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.ఇంతకీ ఈ సిట్ లీక్స్ బీఆర్ ఎస్ లో కేటీఆర్ , హరీష్ రావు మధ్య చిచ్చు పెట్టడం ద్వారా పార్టీకి హరీష్ ను దూరం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారా , లేక హరీష్ రావు ఫోన్ ట్యాప్ జరిగిందా అనే విషయాలు సిట్ అధికారులే నిర్ధారించాల్సి ఉంది.

# వరంగల్‌లో ఉమెన్ కమాండో ఫోర్స్ రుద్రమ

**వరంగల్, జనవరి 22 పెన్ పవర్:**
వరంగల్‌లో మహిళా శక్తికి ప్రతీకగా 'రుద్రమ' కమాండో బృందం సిద్ధమైంది. తెలంగాణలోనే తొలిసారిగా రూపుదిద్దుకున్న ఈ ప్రత్యేక దళం, కఠిన శిక్షణతో శత్రువుల గుండెల్లో నిద్రపోయేలా తయారైంది. ఉన్నతవిద్యావంతులు, క్రీడాకారులతో కూడిన ఈ బృందం.. ఆయుధ శిక్షణతో పాటు ఆత్మరక్షణలోనూ రాణిస్తోంది. అల్లర్లు, బందోబస్తు, కూంబింగ్ ఆపరేషన్లలో వీరు కీలక పాత్ర పోషించనున్నారు.వరంగల్ పోలీస్ కమిషనరేట్‌సరికొత్త చరిత్ర సృష్టించింది. మహిళా శక్తికి నిదర్శనంగా, రాణి రుద్రమదేవి వీరత్వాన్ని పుణికిపుచ్చుకున్నట్లుగా 'రుద్రమ' మహిళా పోలీస్ కమాండో బృందం రణక్షేత్రంలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమైంది. వరంగల్ పోలీస్‌కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ వినూత్న ఆలోచనతో.. తెలంగాణ రాష్ట్రంలోనే తొలిసారిగా వరంగల్‌లో ఈ ఉమెన్స్ స్పెషల్ పోలీస్ ఫోర్స్ రూపుదిద్దుకుంది. కేవలం శాంతిభద్రతల పరిరక్షణకే పరిమితం కాకుండా, అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లోనూ శత్రువుల గుండెల్లో నిద్రపోయేలా ఈ బృందానికి కఠిన శిక్షణ ఇచ్చారు.ఆర్మ్‌డ్ రిజర్వ్ (ఏఆర్) విభాగంలో శిక్షణ పూర్తి చేసుకున్న 40 మంది మహిళా కానిస్టేబుళ్లలో అత్యంత ప్రతిభావంతులైన 21మందిని ఈ ప్రత్యేక విభాగం కోసం ఎంపిక చేశారు. ఈ టీంలో కేవలం శారీరక ధృడత్వమే కాకుండా, మేధోపరమైన సత్తా ఉన్న వారు కూడా ఉన్నారు. బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్ వంటి క్రీడల్లో రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందిన వారితో పాటు ఎమ్మెస్సీ, ఎంసీఏ, ఎంబీఏ వంటి ఉన్నత విద్యావంతులు కూడా 'రుద్రమ' సైనికులుగా మారడం విశేషం.రుద్రమ టీంకు అందించిన శిక్షణ సాధారణమైనది కాదు. సుమారు నెలన్నర పాటు దేశంలోని ప్రతిష్టాత్మక ఎన్ఎస్‌జీ (బీూ+), గ్రేహౌండ్స్ తరహాలో కఠినతరమైన కమాండో ట్రైనింగ్‌ను వీరికి ఇప్పించారు. నిత్యం 10 కిలోమీటర్ల పరుగు, రోప్ క్లైంబింగ్, అడవుల్లో కూంబింగ్ వంటి సవాళ్లను వీరు అధిగమించారు. ముఖ్యంగా ఏకే-47, ఎస్ఎల్ఆర్ వంటి భారీ ఆయుధాలను వాడటంలో వీరు ఆరితేరారు. కళ్లకు గంతలు కట్టుకుని సెకన్ల వ్యవధిలో వెపన్స్‌ను విడదీయడం, తిరిగి అమర్చడం వంటి 'బ్లైండ్ ఫోల్డ్' విద్యలో వీరు అద్భుత ప్రతిభ కనబరుస్తున్నారు.కేవలం యుద్ధ తంత్రాలే కాకుండా.. ఆపద సమయాల్లో తోటి వారిని రక్షించడం, మ్యాప్ రీడింగ్ ద్వారా అడవుల్లో గమ్యాన్ని చేరడం వంటి సాంకేతిక అంశాల్లోనూ వీరికి పట్టు సాధించారు. కరాటే వంటి ఆత్మరక్షణ విద్యలతో పాటు మానసిక ప్రశాంతత కోసం యోగా, ధ్యానంలోనూ శిక్షణ పొందారు. బాంబులను నిర్వీర్యం చేయడం వంటి ప్రాణాంతకమైన పనులను కూడా వీరు అలవోకగా చేసేలా తీర్చిదిద్దారు.ఈ శిక్షణ పొందిన మహిళా కమాండోలు తమ అనుభవాలను పంచుకుంటూ.. మొదట్లో ఆయుధాలు పట్టాలంటే భయపడేవారమని, కానీ ఇప్పుడు పురుష కమాండోలతో సమానంగా ఎలాంటి ఆపరేషన్ అయినా చేయగలమన్న ఆత్మవిశ్వాసం కలిగిందని గర్వంగా చెబుతున్నారు. వరంగల్ నగరంలో అల్లర్లు అణచడానికైనా, ప్రముఖుల బందోబస్తుకైనా, అడవుల్లో కూంబింగ్ ఆపరేషన్లకైనా ఈ 'రుద్రమ' బృందం ఇప్పుడు ఒక శక్తివంతమైన ఆయుధంగా మారింది.

# కేబీఆర్ పార్క్ చుట్టూ సిగ్నల్ ఫ్రీ జంక్షన్

**హైదరాబాద్, జనవరి 22 పెన్ పవర్:**
కేబీఆర్ పార్క్ చుట్టూ ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం నెలరోజుల్లో ప్రారంభం కానుంది. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ అనుమతితో, రూ.1090 కోట్లతో ఈ ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఎన్‌జీటీ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో సాయిల్ టెస్ట్ జరుపుతున్నారు. నిర్వాసితులకు టీడీఆర్ ఇచ్చేందుకు అంగీకరించారు. రెండేళ్లలో ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే సిగ్నల్ ఫ్రీ జంక్షన్ అందుబాటులోకి వస్తుంది అంటున్నారు.కేబీఆర్ పార్క్ ప్రాంతంలో ట్రాఫిక్ మామూలుగా ఉండదు. ఈ సమస్య పరిష్కారం కోసం కేబీఆర్ పార్క్ చుట్టూ ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించాలని తీసుకున్న నిర్ణయం ఎట్టకేలకు కార్యరూపం దాల్చనుంది. మరో నెలరోజుల్లోగా ఈ పనులు ప్రారంభం అవుతాయని సమాచారం. ఈ ప్రాజెక్టుకు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నుంచి అనుమతి లభించడంతో పనులు త్వరలోనే మొదలవుతాయని భావిస్తున్నారు. రెండేళ్లలో ఈ ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ లక్ష్యంగా పెట్టుకుంది.ప్రస్తుతం ఈ ప్రతిపాదిత ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణంలో భాగంగా నేల పరీక్షలు జరుగుతున్నాయి. ఇవి హెచ్-సిటీ ( హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) ప్రోగ్రామ్ కిందకు వస్తాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే కేబీఆర్ పార్క్ చుట్టూ ఉండే భారీ ట్రాఫిక్‌ను తగ్గించవచ్చు. ముఖ్యంగా ఐటీ కారిడార్ వైపు అంటే మదాపూర్, హైటెక్ సిటీ, గచ్చిబౌలి, కొండాపూర్, మణికొండ వైపు వెళ్లే ప్రయాణికులకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది.ఎందుకంటే.. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 10, 12, జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్, మాసాబ్ ట్యాంక్ మార్గాల్లో నిత్యం తీవ్రమైన ట్రాఫిక్ రద్దీ ఉంటుంది. మరీ ముఖ్యంగా ఉదయం, సాయంత్రం ఆఫీసు సమయాల్లో గంటల తరబడి వాహనాలు రోడ్ల మీద నిలిచిపోతున్నాయి. ఇది ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో మరిన్ని ఇబ్బందులు తప్పవని భావించిన సర్కార్.. ఈ మార్గంలో సిగ్నల్ ఫ్రీ జంక్షన్ల కోసం 6 ఫ్లైఓవర్లు, 6 అండర్‌పాస్‌ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది.ఇందుకు గాను ప్రభుత్వం రూ. 1090 కోట్ల వ్యయానికి ఆమోదం తెలిపింది. ఈ ప్రాంతాన్ని సిగ్నల్ ఫ్రీ కారిడార్‌గా అభివృద్ధి చేయడం వల్ల వాహనదారుల ప్రయాణ సమయం చాలా వరకు తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు. సంవత్సరన్నర క్రితమే నేల పరీక్షలు చేసినా.. భూసేకరణ ఇబ్బందుల వల్ల ప్రాజెక్ట్ పట్టాలెక్కలేదు.ఈ క్రమంలో తాజాగా బల్దియా.. ప్రాజెక్టు వల్ల ఆస్తులు కోల్పోతున్న వారికి టీడీఆర్ ఇస్తామని హామీ ఇవ్వడంతో సమస్య పరిష్కారమైంది. దీంతో ప్రస్తుతం ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణానికి సంబంధించి సాయిల్ టెస్టింగ్ ప్రక్రియను ముమ్మరం చేశారు. దీని ఆధారంగా ఫ్లైఓవర్ల డిజైన్, నిర్మాణ విధానం, పిల్లర్ల ఎత్తును ఖరారు చేయనున్నారు. మరో రెండు రోజుల్లోనే సాయిల్ టెస్టింగ్ పూర్తి కానుందని, ఈ నేపథ్యంలో వచ్చే నెలలో నిర్మాణానికి సంబంధించిన పనులు మొదలుపెట్టే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు.ఈ ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం వల్ల సామాన్య ప్రజలతో పాటు కొన్ని వాణిజ్య సంస్థలు కూడా తమ ఆస్తులను కోల్పోతున్నాయి. ఈ క్రమంలో అధికారులు వీరికి పరిహారం గురించి ఒప్పించేందుకు ప్రయత్నంచేస్తున్నారు. ఒకవేళ నగదు పరిహారం కోరితే అక్కడున్న మార్కెట్ రేటుకు 2 రెట్లు ఎక్కువ ఇవ్వనున్నారు. లేదంటే టీడీఆర్ కోరితే మార్కెట్ విలువకు నాలుగు రెట్లు ఎక్కువ ఇస్తామని చెబుతున్నారు.



# అమరావతిలో తొలిసారి రిపబ్లిక్ డే వేడుకలు



**విజయవాడ, జనవరి 22, పెన్ పవర్:**
ఏపీ రాజధాని గా అమరావతి ని ప్రకటించి పదేళ్ల దాటిపోయింది. ఇంతవరకూ ఇండిపెండెన్స్ డే గానీ రిపబ్లిక్ డే కానీ ఇక్కడ జరుపలేదు. రెండోసారి కూటమి అధికారం లోకి వచ్చాక అమరావతి లో ఆగస్టు 15, జనవరి 26 వంటి వేడుకలను జరుపాలని ట్రై చేసినా అక్కడ రోడ్లు, సరైన గ్రౌండ్ ఏర్పడక పోవడం తో సెక్యూరిటీ పాయింట్ ఆఫ్ యాంగిల్ లో కూడా ఆలోచించి ఇంతవరకూ అలాంటి నిర్ణయం తీసుకోలేదు ప్రభుత్వం. అయితే ఇప్పుడు ఆ సమస్య చాలా వరకూ తీరిపోవడం తో సీడ్ యాక్సిస్ రోడ్డు ను సమీపంలో రిపబ్లిక్ డే కోసం ఒక గ్రౌండ్ ని రెడీ చేశారు.అమరావతి లో క్రొత్తగా నిర్మించిన ౫ూూ ల ప్లాట్స్,, మీూూ అపార్ట్మెంట్ ల మధ్యలో సీడ్ యాక్సిస్ రోడ్డు నుండి ఏపీ హై కోర్ట్ కు వెళ్లే రోడ్డు లో 22 ఎకరాల గ్రౌండ్ ని రిపబ్లిక్ డే పెరేడ్ కోసం ఎంపిక చేశారు. గత కొన్ని రోజులుగా అ గ్రౌండ్ ని చదును చేసి టెంట్స్ వేసి పెరేడ్ కి అనుకూలంగా బాట వేసారు. ఇప్పటికే ప్రతీ రోజూ ఉదయం, సాయంత్రం పోలీసులు, స్కౌట్స్, చీజజ కేడెట్స్ రిపబ్లిక్ డే డ్రిల్ రిహార్సల్ చేస్తున్నారు. జనవరి 26 వ తేదీన రాష్ట్రాన్ని ఉద్దేశించి ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగించే వేదిక కూడా రెడీ అయిపోయింది.రిపబ్లిక్ డే అంటే గుర్తు వచ్చేది వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన శకటాలు. ఈసారి దాదాపు 30 శకటాలు ఏపీ రిపబ్లిక్ డే లో పాల్గొన బోతున్నాయి. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు " స్వర్ణ ఆంధ్ర మిషన్ 2047 " కోసం ప్రవేశ పెట్టిన 10 సూత్రాలను ప్రతిబింబించేలా ఈ శకటాల తయారీ ని పర్యవేక్షిస్తోంది ఏపీ సమాచార శాఖ. పేదరిక నిర్మూలన,ఉద్యోగ కల్పన& నైపుణ్య అభివృద్ధి, నీటి భద్రత, అగ్రికల్చర్ & అగ్రిటెక్ వంటి 10 అంశాలతో శకటాలు ఈ రిపబ్లిక్ డే కి స్పెషల్ అట్రాక్షన్ కానున్నాయి. 26.01.26 తేదీ నుండి రిపబ్లిక్ డే, ఆగస్టు 15 వంటి కార్యక్రమాలు అన్నీ ఇకపై అమరావతి లోనే జరుగబోతున్నట్టు ప్రభుత్వం తెలిపింది. దీనితో ఇన్నాళ్ళు ఇలాంటి వేడుకలకు వేదిక అయిన విజయవాడ లోని ఇందిరాగాంధీ స్టేడియం ఇకపై ఆ రకం కళను కోల్పోనుందిఅయితే ఏపీ రాజధాని అమరావతి లోనే ఇకపై రిపబ్లిక్ డే, ఆగస్టు 15 వంటి వేడుకలు జరుగుతుండడం తమకు ఎంతో గర్వకారణం గా ఉందని అమరావతి రైతులు చెబుతున్నారు. ఈ రిపబ్లిక్ వేడుకల నేపథ్యంలో అమరావతి సీడ్ యాక్సిస్ రోడ్డు లో భద్రతను పెంచారు.

# దూకుడు పెంచిన ఈడీ




**విజయవాడ, జనవరి 22, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఒక్కసారిగా దూకుడు పెంచడం రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. గత రెండు రోజులుగా చోటుచేసుకున్న పరిణామాలు ఏదో జరగబోతోందన్న సంకేతాలు ఇస్తున్నాయి. మాజీ ఎంపీ విజయసాయిరెడ్, ప్రస్తుత ఎంపీ మిథున్ రెడ్డిలను ఈడీ వరుసగా విచారణకు పిలవడం ఈ కేసులో కీలక మలుపుగా కనిపిస్తోంది. ఇప్పటికే ఈ కేసులో మిథున్ రెడ్డి జైలుకు వెళ్లి రాగా, విజయసాయిరెడ్డి మాత్రం తనను తాను విజిల్ బ్లోయర్ గా ప్రకటించుకుని అరెస్టు నుంచి తప్పించుకున్నారు. విజయసాయిరెడ్డి ఇటీవల పార్టీ అధినేత జగన్‌కు దూరం జరిగి.. రాజకీయాల నుంచి వైదొలిగారు. వైసీపీకి రాజీనామా చేశారు. సిట్ విచారణలో ఆయన కీలకంగా ఉన్నారని చాలా వివరాలు చెబుతున్నారన్న ప్రచారం ఉంది. నిందితుడిగా ఉన్నప్పటికీ ఆయనను సిట్ అరెస్టు చేయలేదు. తనను తాను విజిల్ బ్లోయర్ గా ప్రకటించుకున్నారు. అదే సమయంలో రాజకీయంగా సైలెంట్ గా లేరు. జగన్ చుట్టూ ఉన్న కోటరీపై బహిరంగంగానే ఆరోపణలు చేస్తున్నారు. అంతర్గతంగా ఆయన సిట్ , ఈడీ అధికారులకు కీలక సమాచారం అందిస్తున్నట్లు వైసీపీ వర్గాలు అనుమానిస్తున్నాయి. తనపై ఉన్న కేసుల నుంచి బయటపడేందుకు విజయసాయిరెడ్డి అప్రూవర్ గా మారుతున్నారని.. భావిస్తున్నారు. ఆర్థిక వ్యవహారాలన్నీ చూసుకున్న వ్యక్తిగా విజయసాయిరెడ్డి ఇచ్చే స్టేట్‌మెంట్ ఈ కేసులో అత్యంత కీలకం కానుంది.ఇప్పటికే జైలు నుంచి బయటకు వచ్చిన మిథున్ రెడ్డిని ఈడీ మళ్ళీ విచారించడం వెనుక బలమైన ఆర్థిక లావాదేవీల ఆధారాలు ఉన్నట్లు తెలుస్తోంది. మద్యం కంపెనీల నుంచి వచ్చిన ముడుపులు ఎక్కడికి వెళ్లాయి? ఎవరి ఖాతాల్లోకి చేరాయి? అన్న అంశాలపై ఈడీ ఆరా తీస్తోంది. విజయసాయిరెడ్డి సహకారం అందిస్తున్నందున ఆయన ఇచ్చిన సమాచారాన్ని మిథున్ రెడ్డి ముందు ఉంచి ఈడీ అధికారులు ప్రశ్నించే అవకాశం ఉంది. ఈ ఇద్దరు కీలక నేతల విచారణ పూర్తయిన తర్వాత, ఈ కేసు నేరుగా పార్టీ అత్యున్నత నాయకత్వం చుట్టూ ముసురుకునే అవకాశం ఉంది.ఒకవైపు విజయసాయిరెడ్డి తిరుగుబావుటా ఎగురవేయడం, మరోవైపు దర్యాప్తు సంస్థల వేగం పెరగడం జగన్ కోటరీని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. వీరిద్దరి విచారణ తర్వాత మరికొన్ని కీలక అరెస్టులు ఉండవచ్చని లేదా విదేశీ నిధులకు సంబంధించిన ఆధారాలు బయటపడవచ్చని అంచనా వేస్తున్నారు. మొత్తం మీద ఏపీ లిక్కర్ స్కామ్ ఇప్పుడు కేవలం అవినీతి కేసుగా కాకుండా, వైసీపీ, జగన్ రాజకీయ భవిష్యత్తును ప్రభావితం చేసే దిశగా సాగుతోందని ఆ పార్టీ వర్గాలు ఆందోళనతో ఉన్నాయి.

# బస్సు యాత్రపై జగన్ కొత్త రాజకీయ వ్యూహం..



**గుంటూరు, జనవరి 22, పెన్ పవర్:**
వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాజకీయ వ్యూహంలో కీలక మార్పులు చేయబోతున్నారనే చర్చ ఇప్పుడు జోరుగా సాగుతోంది. 2029 ఎన్నికలే లక్ష్యంగా మళ్లీ ప్రజల్లోకి వెళ్తానని, మరోసారి పాదయాత్ర చేపడతానని గత ఏడాది జులైలో జగన్ స్వయంగా ప్రకటించారు. అయితే తాజాగా ఆ నిర్ణయాన్ని ఆయన పునరాలోచన చేసినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. గతంలో 2019 ఎన్నికలకు ముందు నిర్వహించిన ప్రజా సంకల్ప యాత్ర ద్వారా జగన్‌కు భారీ విజయమే దక్కింది. కానీ ఈసారి అదే ఫార్ములాను కొనసాగించాలా? లేదా కొత్త మార్గం ఎంచుకోవాలా? అన్న అంశంపై ఆయన ఆలోచిస్తున్నట్లు టాక్ఎన్నికలకు ఇంకా మూడేళ్ల సమయం ఉండటంతో ఇప్పుడే పాదయాత్ర ప్రారంభించడం వ్యూహపరంగా సరైనదా? అన్న ప్రశ్న వైసీపీలో చర్చకు వచ్చింది. ఒకవైపు పాదయాత్ర చేస్తే ప్రజల్లో నిరంతరం ఉండొచ్చు. మరోవైపు అంత సుదీర్ఘ కాలం అదే విధానంలో కొనసాగడం కష్టమేనని నేతలు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో జగన్ తన ప్రణాళికను మార్చుకున్నారని సమాచారం. పాదయాత్రకు బదులుగా బస్సు యాత్ర చేపట్టి తక్కువ సమయంలోనే రాష్ట్రం అంతా పర్యటించాలని ఆయన భావిస్తున్నట్లు చెబుతున్నారు.వైసీపీ వర్గాల ప్రకారం, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తమ పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలను పూర్తిగా కొనసాగించడం లేదని ప్రజల్లో అసంతృప్తి ఉందని పార్టీ అంచనా వేస్తోంది. ఇలాంటి సమయంలో ప్రజల మధ్యకు వెళ్లడం వల్ల పార్టీకి మళ్లీ ఊపు వస్తుందని భావిస్తున్నారు. అయితే పాదయాత్ర లాంటి దీర్ఘకాలిక కార్యక్రమం కంటే, బస్సు యాత్ర ద్వారా ప్రతి జిల్లా, ప్రతి మారుమూల ప్రాంతాన్ని త్వరగా కవర్ చేయొచ్చన్నది జగన్ ఆలోచనగా చెబుతున్నారు.ఈ ఏడాది మొత్తాన్ని బస్సు యాత్రకే కేటాయించి, గ్రామ స్థాయి వరకు వెళ్లాలని జగన్ భావిస్తున్నారని సమాచారం. ఇందుకోసం రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని పార్టీ నేతలకు సూచనలు ఇచ్చినట్లు కథనాలు వస్తున్నాయి. నిజానికి ఈ ఏడాది ఆరంభంలోనే జిల్లాల పర్యటనలు ఉంటాయని వైసీపీ ప్రకటించింది. కానీ అధినేత పాదయాత్ర చేస్తానన్న ప్రకటనతో కార్యకర్తలు అదే ప్రధాన కార్యక్రమంగా భావించారు. ఇప్పుడు బస్సు యాత్ర ప్రతిపాదన తెరపైకి రావడంతో పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.2024 ఎన్నికల్లో ఓటమి తర్వాత జగన్ పెద్దగా ప్రజల్లోకి రాలేదన్న విమర్శలు ఉన్నాయి. ఆయన బెంగళూరు లో ఎక్కువ సమయం గడపడం, తాడేపల్లిలో ఉన్నప్పుడు ఎక్కువగా పత్రికా సమావేశాలకే పరిమితమవడం వల్ల పార్టీకి ఆశించిన లాభం దక్కలేదన్న అభిప్రాయం కూడా కార్యకర్తల్లో వినిపిస్తోంది. అయితే ప్రభుత్వం ఏర్పడి కేవలం 19 నెలలే కావడంతో కొంత సమయం ఇవ్వాలన్న ఉద్దేశంతోనే జగన్ ఇప్పటివరకు వేచి చూశారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వైఎస్ జగన్ రాజకీయ ప్రస్థానంలో పాదయాత్రకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. 2014 ఓటమి తర్వాత ఆయన చేపట్టిన 'ప్రజా సంకల్ప యాత్ర' 2019లో ఆయనను ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టింది. దాదాపు 3,648 కిలోమీటర్ల మేర సాగిన ఆ యాత్ర అప్పట్లో జనంతో జగన్‌ను మమేకం చేసింది. 2024 ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత, పార్టీ ఉనికిని కాపాడుకోవడానికి, ప్రజల నమ్మకాన్ని తిరిగి పొందడానికి మళ్లీ అదే మార్గాన్ని ఎంచుకోవడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.ఎన్నికల ఫలితాల తర్వాత తాను నిత్యం ప్రజల్లోనే ఉంటానని, ప్రతి నెలా జిల్లాల్లో పర్యటిస్తానని జగన్ ప్రకటించినప్పటికీ, గత ఏడాది కాలంగా ఆయన ఎక్కువగా తాడేపల్లి నివాసానికే పరిమితమయ్యారు. వారం వారం బెంగళూరు వెళ్లి వస్తున్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమైన సందర్భాలు తక్కువ. దీంతో ప్రత్యర్థుల నుంచి విమర్శలు రావడమే కాకుండా, పార్టీ కార్యకర్తలు కూడా కొంత డీలా పడ్డారు. ఇప్పుడు జగన్ స్వయంగా పాదయాత్ర ప్రకటన చేయడంతో, గ్రామస్థాయి నేతల్లో మళ్లీ కదలిక వస్తుందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.వచ్చే ఏడాది పాదయాత్ర ప్రారంభించబోతున్న జగన్ ముందు కొన్ని కీలక సవాళ్లు ఉన్నాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్న టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి హామీల అమలులో వైఫల్యాలను ఎండగట్టాల్సి ఉంటుంది. ఓటమితో నిరుత్సాహపడి ఇతర పార్టీల వైపు చూస్తున్న నేతలను ఆపి, ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని బలోపేతం చేయాలి. గత ప్రభుత్వ హయాంలో జరిగిన లోపాలను సరిదిద్దుకుంటామనే నమ్మకాన్ని ప్రజల్లో కలిగించడం ముఖ్యం.మొత్తానికి, జగన్ నిర్ణయం వైసీపీలో ఒక కొత్త ఆశను చిగురింపజేసింది. రాజశేఖర్ రెడ్డి నుంచి జగన్ వరకు పాదయాత్ర వారి రాజకీయ విజయాలకు వెన్నెముకగా నిలిచింది. మరి 2027లో ప్రారంభం కాబోయే ఈ రెండో విడత మహా పాదయాత్ర జగన్‌కు పూర్వ వైభవాన్ని తెచ్చిపెడుతుందో లేదో వేచి చూడాలి.ప్రస్తుతం పరిస్థితులు మారుతున్నాయని, స్థానిక ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో ఇక ఆలస్యం చేయకుండా జిల్లాల పర్యటనకు సిద్ధం కావాలని జగన్ నిర్ణయించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ బస్సు యాత్ర నిజమైతే, వైసీపీ రాజకీయాల్లో ఇది మరో కీలక మలుపుగా మారే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## అమెరికా ఆహ్వానాన్ని అంగీకరించిన నెతన్యాహు

**హైదరాబాద్ పెన్ పవర్:** గాజా శాంతి మండలిలో చేరాల్సిందిగా ప్రధాని మోదీకి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పంపిన ఆహ్వానంపై భారత్ ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ఈ మండలి గాజా పునర్నిర్మాణ పనులు, పాలనను పర్యవేక్షించడమే కాకుండా, అంతర్జాతీయ ఘర్షణలూ పరిష్కరిస్తుందని తెలుస్తోంది. విధివిధానాలు పూర్తిగా బయటకు రాలేదు. ఈ అంశంపై ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని భారత్ భావిస్తోంది. మండలిలో చేరాలంటూ భారత్ సహా పలు దేశాధినేతలకు ట్రంప్ ఆహ్వానాలు పంపిన సంగతి తెలిసిందే. ఇందులో కొన్ని దేశాలు ట్రంప్ విజ్ఞప్తిని అంగీకరిస్తే, మరికొన్ని తిరస్కరించాయి. ట్రంప్ ఆహ్వానాన్ని అంగీకరిస్తున్నట్లు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తెలిపారు. పాకిస్థాన్, అర్జెంటీనా, ఆర్మేనియా, అజర్ బైజాన్, బహ్రెయిన్, బెలారస్, ఈజిప్టు, హంగరీ, కజకస్థాన్, మొరాకో, యూఏఈ, వియత్నాం కూడా మండలిలో చేరేందుకు సుముఖత వ్యక్తంచేశాయి. స్వీడన్, నార్వే తిరస్కరించాయి. రష్యా, చైనా, జర్మనీ, ఇటలీ తుర్కియే, స్లొవేనియా, ఉక్రెయిన్ తదితర దేశాలు ఇంకా నిర్ణయం తీసుకోలేదు.

## మచెల్‌కు ఇందిరాగాంధీ శాంతి పురస్కారం

**హైదరాబాద్ పెన్ పవర్:** మొజాంబిక్ మానవ హక్కుల కార్యకర్త, దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడు నెల్సన్ మండేలా రెండో భార్య గ్రాసా మచెల్... ఇందిరాగాంధీ శాంతి పురస్కారానికి ఎంపికయ్యారు. 2025 ఏడాదికి గానూ శాంతి, నిరాయుధీకరణ, అభివృద్ధి విభాగంలో మచెల్‌కు బహుమతిని ప్రదానం చేస్తున్నట్లు ఇందిరాగాంధీ మెమోరియల్ ట్రస్టు బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. విద్యా, ఆరోగ్యం, పోషకాహారం, ఆర్థిక సాధికారత సహా పలు కీలక రంగాల్లో క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొని ఆమె చేసిన కృషికిగాను మచెల్‌కు ఈ పురస్కారాన్ని అందిస్తున్నట్లు పేర్కొంది. జాతీయ భద్రతా మాజీ సలహాదారు శివశంకర్ మేనన్ నేతృత్వంలోని అంతర్జాతీయ జ్యూరీ ఆమెను ఎంపిక చేసినట్లు ప్రకటనలో తెలిపింది. శాంతి పురస్కారంతో పాటు రూ.కోటి నగదు బహుమతిని అందించనున్నారు.

## విశాఖ ఉత్సవ్ కు భారీ ఏర్పాట్లు

**విశాఖపట్టణం, జనవరి 22, పెన్ పవర్:** ఉత్తరాంధ్ర సాంస్కృతిక వైభవాన్ని, ప్రకృతి సౌందర్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా ఈ ఏడాది విశాఖ ఉత్సవ్ ను అత్యంత వైభవంగా నిర్వహించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. సాగరం నుంచి శిఖరం వరకు అనే ప్రత్యేక థీమ్‌తో జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1 వరకు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. ఈసారి ఉత్సవాలను కేవలం విశాఖ నగరానికే పరిమితం చేయకుండా, అనకాపల్లి , అల్లూరి సీతారామరాజు జిల్లాలకు కూడా విస్తరించడం విశేషం. మూడు జిల్లాల వ్యాప్తంగా మొత్తం 20 ప్రధాన వేదికలపై 500కు పైగా సాంస్కృతిక, పర్యాటక ప్రదర్శనలు నిర్వహించనున్నారు. విశాఖపట్నంలో ప్రారంభ వేడుకలు ఘనంగా మొదలై, ఫిబ్రవరి 1న అనకాపల్లిలో ముగింపు వేడుకలతో ఈ సంబరాలు ముగుస్తాయి. తీరప్రాంత పర్యాటకం నుంచి మన్యం ప్రాంతపు గిరిజన సంస్కృతి వరకు ప్రతి అంశాన్ని ఈ వేదికలపై ప్రదర్శించనున్నారు. ఈ మెగా ఈవెంట్ ద్వారా సుమారు రూ. 500 కోట్ల మేర ఆర్థికాభివృద్ధి జరుగుతుందని, అలాగే సుమారు 3000 మంది స్థానిక కళాకారులు, యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఆర్కే బీచ్‌తో పాటు రుషికొండ, సాగర్‌నగర్, భీమిలి బీచ్‌లలో డ్రోన్ షోలు, బీచ్ స్పోర్ట్స్, ఫ్లవర్ షో, మిస్ వైజాగ్ వంటి పోటీలు సందర్శకులను కనువిందు చేయనున్నాయి. అరకు, లంబసింగి వంటి ప్రాంతాలలో గిరిజన సంప్రదాయ నృత్యాలు, హస్తకళల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. పర్యాటక రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలనే లక్ష్యంతో ఈ ఉత్సవాలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఫ్లవర్ షో , మిస్ వైజాగ్, మిస్టర్ వైజాగ్,వైజాగ్ కల్చర్ టాలెంట్స్, రాష్ట్ర సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటం, ఫుడ్ కోర్టులు, షాపింగ్ స్టాళ్లు. డ్రోన్ షో, బీచ్ గేమ్స్, బీచ్ రెస్టారెంట్, అడ్వంచర్ స్పోర్ట్స్, బోటు రేసింగ్, స్పీడ్ బోటింగ్, కయాకింగ్, పారామోటరింగ్, కార్నివాల్ వాక్, టెంపుల్ రెప్లిక, వంటల పోటీలు వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు.అటవీ ప్రాంతంలో సైక్లింగ్ పోటీలు, ఫ్లోరీకల్చర్, అమ్యూజ్మెంట్ రైడ్స్, ఫుడ్ కోర్టులు, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ స్టాల్స్, కాఫీ ఫెస్టివల్, టాలీవుడ్ నటుల ప్రదర్శనలు, అరకు వ్యాలీ రైడ్స్, కార్నివాల్ వాక్, ట్రైబల్ పెర్ఫామెన్స్, అనంతగిరి, గాలికొండ ప్రాంతాల్లో ట్రెక్కింగ్ పారాగ్లైడింగ్, హాట్ ఎయిర్ బెలూన్, పారా మోటరింగ్ వంటివి ఎర్పాటు చేస్తున్నారు.స్థానిక వంటకాలు , చేనేత వస్త్రాలు, ఎంఎస్ఎంఈ ఉత్పత్తుల ప్రదర్శనకు ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. పర్యాటకులు, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని మంత్రులు పిలుపునిచ్చారు.

## సార్..ఈ సారైనా అవకాశం ఇవ్వండి అధినేతకు వేడ్కోలు

**కాకినాడ, జనవరి 22, పెన్ పవర్:** తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన ఒక అంతర్గత భేటీ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పార్టీ అధినేత చంద్రబాబు నాయుడుఇటీవల ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా పార్టీ కార్యాలయానికి వచ్చిన సమయంలో, పలువురు సీనియర్ నేతలు ఆయనను వ్యక్తిగతంగా కలిశారు. ఈ సమావేశాలు బయటకు సాధారణంగానే కనిపించినా, లోపల మాత్రం తీవ్రమైన ఆవేదన వ్యక్తమైందని సమాచారం."సర్కడ ఉద్యోగం వదిలేసి పార్టీ కోసం వచ్చాను. 25 ఏళ్లుగా సేవ చేస్తున్నా. నన్ను ఒక్కసారి గమనించండి" అంటూ ఒక నేత భావోద్వేగానికి లోనయ్యారు. మరో నేత "గత ఎన్నికల్లో కూటమి పొత్తులో భాగంగా టికెట్ త్యాగం చేశాను. ఇప్పుడు కూడా పట్టించుకోకపోతే నియోజకవర్గంలో తలెత్తుకోలేను" అని విన్నవించారు. ఇలా ఒక్కొక్కరు తమ సమస్యలను, త్యాగాలను చంద్రబాబు ముందు ఉంచారు. బయటికి చెప్పకపోయినా, లోపల వారి ఆకాంక్ష ఒక్కటే అని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.ఆ ఆకాంక్ష..త్వరలో ఖాళీ కాబోతున్న రాజ్యసభ సీట్లు. మొత్తం నాలుగు సీట్లు ఖాళీ అవుతున్న నేపథ్యంలో, అందులో కనీసం రెండు సీట్లు టీడీపీకి దక్కే అవకాశం ఉందని అంచనా. ఈ రెండు సీట్ల కోసం పార్టీలో పోటీ తీవ్రంగా ఉందని తెలుస్తోంది. ముఖ్యంగా కమ్మ సామాజిక వర్గానికి చెందిన పలువురు కీలక నేతలు ఈ రేసులో ఉన్నారని ప్రచారం జరుగుతోంది.ఇదే సమయంలో ఒక ఎస్సీ నాయకుడు కూడా ఆశలు పెట్టుకున్నట్లు సమాచారం. గతంలో పోలీస్ ఉద్యోగాన్ని వదిలేసి టీడీపీలో చేరిన ఈ నేత, పార్టీ కోసం నిరంతరం పనిచేశారని ఆయన అనుచరులు చెబుతున్నారు. గత రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన అనుభవం ఉన్నప్పటికీ, ఈసారి అయినా తనకు న్యాయం చేయాలనే ఆకాంక్షతో చంద్రబాబును కలిసినట్లు తెలుస్తోంది.మరోవైపు, ఒక మాజీ మంత్రి తన డిమాండ్‌ను బలంగా వినిపించినప్పటికీ, బహిరంగంగా మాత్రం ఏమీ తెలియనట్టు వ్యవహరిస్తున్నారని పార్టీలో చర్చ నడుస్తోంది. ఎవరు నేరుగా "నాకు రాజ్యసభ సీటు కావాలి" అని చెప్పకపోయినా, తమ సేవలు, త్యాగాలు, సామాజిక సమీకరణలు అన్నీ చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారని సమాచారం.ఈ భేటీలు జరిగిన రెండు రోజుల తర్వాతే ఈ వ్యవహారం బయటకు రావడం విశేషం. అప్పటివరకు ఎవరి భేటీ వారిదే అన్నట్టు నిశ్శబ్దంగా సాగింది. అయితే ఇప్పుడు ఈ రాజ్యసభ సీట్ల అంశం టీడీపీలో కొత్త చర్చకు తెరలేపింది. చంద్రబాబు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు, సామాజిక సమతుల్యతకు ఎంత ప్రాధాన్యం ఇస్తారు, పార్టీకి విధేయత చూపిన వారిని ఎలా ఆదరిస్తారు అన్నది ఆసక్తికరంగా మారింది. రానున్న రోజుల్లో ఈ అంశం పార్టీ అంతర్గత రాజకీయాలను మరింత వేడెక్కించే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

## టీడీపీ గూటికి పిల్లి...

**రాజమండ్రి, జనవరి 22, పెన్ పవర్:** వైసీపీ రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్పార్టీ మారే ఆలోచనతో ఉన్నారా? టిడిపిలో చేరుతారా? వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెబుతారా? అందుకే సొంత పార్టీ నేతలపై ఆరోపణలు చేస్తున్నారా? త్వరలో ఆయన ఎందుకు చంద్రబాబును కలవనున్నారు? పొలిటికల్ సర్కిల్లో దీనిపైనే ఆసక్తికర చర్చ నడుస్తోంది. నిన్నటికి నిన్న ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. రామచంద్రపురం నియోజకవర్గంలో వైసిపి హయాంలో భారీ అవినీతి జరిగిందని ఆరోపించారు. గృహ నిర్మాణంలో భాగంగా కోట్లాది రూపాయలు అప్పట్లో పక్కదారి పట్టించారని ఆరోపణలు చేశారు. మరో నాలుగు నెలలు రాజ్యసభ పదవీకాలం ముగియడం, సొంత పార్టీ నేతలపై బోస్ ఆరోపణలు చేయడంతో.. ఆయన పార్టీ మారుతారని ప్రచారం మొదలైంది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు తర్వాత జగన్ వెంట అడుగులు వేశారు సుభాష్ చంద్రబోస్. 2014 ఎన్నికల్లో ఓటమి చవి చూశారు. 2019 ఎన్నికల్లో సుభాష్ చంద్రబోస్ విషయంలో ప్రయోగం చేశారు జగన్. ఆయన సొంత నియోజకవర్గాన్ని కాదని మండపేట టిక్కెట్ ఇచ్చారు. రామచంద్రపురం నుంచి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను రంగంలోకి దించారు. అయితే రామచంద్రపురం నుంచి వేణుగోపాలకృష్ణ గెలిచారు. మండపేట నుంచి సుభాష్ చంద్రబోస్ ఓడిపోయారు. అయితే ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చారు జగన్ బోస్ కు. అలా ఎమ్మెల్సీగా ఉన్న బోస్ ను మంత్రిని కూడా చేశారు. అయితే ఇంతలో మండలిని రద్దు చేయాలని ఆలోచన చేశారు. ఈ క్రమంలోనే బోస్ను రాజ్యసభకు పంపించారు. ఆయన రాజీనామా చేసిన మంత్రి పదవిని చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణకు ఇచ్చారు. అయితే ఎంపీగా ఉన్న బోస్ కు, మంత్రిగా ఉన్న వేణుగోపాల కృష్ణ మధ్య విభేదాలు నడిచాయి.రాజ్యసభ సభ్యుడిగా ఉండడంతో సుభాష్ చంద్రబోస్ కు మొన్నటి ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం చిక్కలేదు. పైగా రామచంద్రపురం నియోజకవర్గ బాధ్యతల విషయంలో ఆయన అసంతృప్తితో ఉన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## తాగుబోతు నటనకు భాష్యం ఎంఎస్


**హైదరాబాద్ పెన్ పవర్:** ఎమ్.ఎస్. నారాయణ (ఏప్రిల్ 16, 1951–జనవరి 23, 2015)గా పిలువ బడే మైలవరపు సూర్యనారాయణ తెలుగు సినిమా హాస్యనటుడు, దర్శకుడు. దాదాపు 700 చిత్రాలలో నటించారు. కొడుకు, భజంత్రీలు చిత్రాలకు దర్శకత్వం వహించారు. ఆయన తాగుబోతు పాత్రలను పోషించడంలో పేరొందారు. గతంలో ఆయన భీమవరంలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేశారు. శ్రీకాంత్, కృష్ణంరాజు నటించిన "మా నాన్నకు పెళ్ళి" చిత్రం ద్వారా తెలుగు చలనచిత్ర రంగానికి పరిచయమయ్యారు. అంతకు ముందు సినీ కథా రచయితగా పనిచేశారు. కథా రచయితగా పేరుపడ్డ తొలిచిత్రం వేగుచుక్క పగటిచుక్క.స్వగ్రామం పశ్చిమ గోదావరి జిల్లా లోని నిడమర్రు. వీరిది మధ్యతరగతి రైతు కుటుంబము. వీరి తండ్రి మైలవరపు బాపిరాజు రైతు, తల్లి వెంకట సుబ్బమ్మ. పదవ తరగతి పూర్తి అయిన తరువాత నాలుగు మైళ్ళ దూరంలో ఉన్న పత్తేపురంలోని ప్రాచ్య కళాశాలలో ఐదు సంవత్సరాల భాషా ప్రవీణ కోర్సు చేశారు. పత్తేపురంలోని మూర్తిరాజు కళాశాలలో సినీ రచయిత పరుచూరి గోపాలకృష్ణ లెక్చరర్‌గా పని చేసేవారు. ఆయన వద్ద ఎంఎస్ శిష్యరికం చేశారు. అది ఆయన జీవితంలో రచయితగా స్థిర పడడానికి పునాది వేసిందంటారు. తన క్లాస్‌మెట్ అయిన కళాప్రపూర్ణను ప్రేమించగా పరుచూరి వారే దగ్గరుండి పెళ్ళి చేయించడం విశేషం. వీరిది కులాంతర ప్రేమ వివాహము. పశ్చిమ గోదావరి జిల్లా కె.జి.ఆర్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేశారు. కళారంగంపై ఉన్న ఆస్తకితో అధ్యాపకుడి పదవికి రాజీనామా చేసి నటనా రంగంలోకి అడుగులు వేశారు. మొదటగా రచయితగా చిత్ర పరిశ్రమలోకి ప్రవేశించారు. ఎనిమిది చిత్రాలకు రచయితగా పనిచేశారు. ఎమ్మెస్ నటించిన తొలి సినిమా యమ్.ధర్మరాజు ఎం.ఎ. అయన కుమారుడు విక్రం కొడుకు చిత్రం ద్వారా తన చిత్ర ప్రస్థానాన్ని ప్రారంభించారు. తల్లి సుబ్బమ్మ ప్రోత్సాహంతో ఉన్నత విద్యాభ్యాసం చేసిన ఎంఎస్ ఖాళీ రోజుల్లో మాత్రం నాటకాలు వేస్తు గడిపే వారు. తన స్నేహితులతో కలిసి "బాలనాగమ్మ, భట్టి విక్రమార్క" వంటి పౌరణిక నాటకాలు వేశారు. సాంఘిక నాటకాలకు తానే పాత్రలను ఎంపిక చేసుకుని దర్శకుడిగా నాటకాలు వేసి అందర్ని మెప్పించే వారు. భీమవరం కేజీఆర్ఎల్ కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా పనిచేస్తున్న సమయంలో దివిసీమ ఉప్పెన సంభవించగా తోటి కళాకారులతో కలిసి వివిధ ప్రాంతాల్లో నాటకాలు వేసి విరాళాలు సేకరించి దివి సీమ ప్రజలకు అందించారు.1996లో "పెదరాయుడు" చిత్రంలో తొలిసారిగా వెండి తెరపై కనిపించారు. అయితే అంతకు ముందే వెగుచుక్క-పగటి చుక్క, ప్రయత్నం, ముగ్గురు మొనగాళ్లు, పేకాట పాపారావు చిత్రాలకు అద్భుతమైన కథలు అందించి సినీ రంగంలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు. దర్శకుడు రవిరాజా పినిశెట్టితో రుక్మిణీ సినిమా కథ చర్చల్లో ఆయన హావ భావ ప్రదర్శనకు ముగ్దుడై హాస్య నటుడిగా ఎమ్ ధర్మరాజు ఎం. ఏ. అవకాశం కల్పించారు. పుణ్యభూమి నాదేశం, రుక్మిణి (సినిమా) చిత్రాల్లో చిన్న పాత్రలు వేసినప్పటికి 1997లో ఈవీవీ దర్శకత్వంలో మా నాన్నకు పెళ్ళి సినిమాలో తాగుబోతు తండ్రి పాత్ర ఆయనకు ఎంతో పేరు తెచ్చి పెట్టింది. దర్శకులు తనకు ఇచ్చిన పాత్రకు తానే సంభాషణ రాసుకుని సినిమాల్లో పలికే వారు. "ఏం చేస్తున్నావ్ ... ఏం చేస్తున్నావ్ ... అని మాటిమాటికీ అడగొద్దు. ఏదో ఒకటి చేసేయ గలను" (నువ్వు నాకు నచ్చావ్); "సోడా కొట్టడం అంటే పీజీ పాసైనంత వీజీ కాదు" (బన్ని);"ఇక్కడ ఏం జరుగుతుందో నాకు తెలియాలి" (అతడు) లాంటి డైలాగులు తెలుగు వారి హృదయాలలో చిరస్థాయిగా నిలిచి పోయాయి. ఎమ్మెస్ తన నట జీవితంలో 5 నంది అవార్డులు (రామసక్కనోడు, మానాన్నకు పెళ్ళి, సర్దుకుపోదాం రండీ, శివమణి, దూకుడు), 2 సినీ గోయెర్స్ అవార్డులు పొందారు. దూకుడు చిత్రానికిగాను ఉత్తమ సహాయనటుడిగా ఫిల్మ్‌ఫేర్ అవార్డును అందుకున్నారు. 200 చిత్రాల్లో తాగుబోతు పాత్రల్లో ఒదిగి పోయారు. గ్లాస్ చేతిలో పట్టుకున్న ప్రతిపాత్రను ప్రేక్షకులు ఎంతో ఎంజాయ్ చేశారు. అదే విధంగా పేరడీ పాత్రలకు ఎమ్మెస్ పెట్టింది పేరు. దూకుడు, డిస్కో, దూబాయ్ శీను తదితర చిత్రాల్లో పేరడీ, నటనా వైవిధ్యం ప్రదర్శించడం ద్వారా ప్రేక్షకుల మదిలో నిలిచిపోయారు. ఉత్తమ హాస్యనటుడు - శివమణి, 2003, ఉత్తమ హాస్యనటుడు - దూకుడు, 2001 నంది పురస్కారాలు ఆయనకు లభించాయి. అనారోగ్య కారణాలతో ఆయన చికిత్స పొందుతూ 2015, జనవరి 23 న మృతిచెందారు.

## యూరోపియన్ దేశాలపై యూఎస్ సుంకాలు ఉపసంహరణ




**హైదరాబాద్ పెన్ పవర్:** డెన్మార్క్ ఆధీనంలోని గ్రీన్‌ల్యాండ్‌ని అమెరికా స్వాధీనం చేసుకోవడానికి యూరోపియన్ యూనియన్ దేశాలు వ్యతిరేకించాయి. దీంతో జనవరి 17న గ్రీన్‌ల్యాండ్ స్వాధీనానికి మద్దతు ఇవ్వని ఎనిమిది దేశాలు డెన్మార్క్, నార్వే, స్వీడన్, ఫ్రాన్స్, జర్మనీ, నెదర్లాండ్స్, ఫిన్లాండ్, బ్రిటన్‌ల దిగుమతులపై 10 శాతం సుంకాల్ని విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఈ సుంకాలు ఫిబ్రవరి ఒకటి నుంచి అమల్లోకి రానున్నాయని, బహుశా జూన్ 1 నాటికి ఈ సుంకాలు 25 శాతం మేర పెరుగుతాయని కూడా ఆయన బెదిరించారు. తాజాగా గురువారం గ్రీన్‌ల్యాండ్ స్వాధీనానికి మద్దతివ్వడం వల్ల ఈ దేశాలపై ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి రానున్న పన్నుల్ని విధించడాన్ని ట్రంప్ ఉపసంహరించుకున్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ట్రూత్‌పోస్ట్‌లో ట్రంప్ పేర్కొన్నారు. కాగా, తాజాగా నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టేతో, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సమావేశమయ్యారు. ఈ సమావేశం అనంతరం ట్రంప్ యూరోపియన్ యూనియన్ దేశాలపై పన్నులు వేయడాన్ని ఉపసంహరించుకున్నారు. 'ఈ చర్య అమెరికాకు, నాటో మిత్ర దేశాలు రెంటికీ ప్రయోజనకరంగా ఉంది' అని ట్రంప్ ట్రూత్ సోషల్ పోస్ట్‌లో అభివర్ణించారు. నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టేతో నేను జరిపిన చాలా ఉత్పాదక సమావేశం ఆధారంగా.. గ్రీన్‌ల్యాండ్, ఆర్కిటిక్ ప్రాంతానికి సంబంధించి భవిష్యత్ ఒప్పందం యొక్క ఫ్రేమ్ వర్క్‌ని మేము రూపొందించాము. దీనివల్ల అమెరికాకు, నాటో మిత్ర దేశాలకు గొప్ప పరిష్కారం లభించింది. ఈ అవగాహన ద్వారా యూరోపియన్ యూనియన్ దేశాలపై ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి రావాల్సిన సుంకాను నేను విధించను' అని ట్రంప్ పోస్టులో పేర్కొన్నారు.

## రష్యా చమురు కొనుగోళ్లను భారత్ ఆపేసింది



**హైదరాబాద్ పెన్ పవర్:** రష్యా నుండి చమురు కొనుగోలు చేసే దేశాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 25శాతం టారిఫ్‌లు విధించడంతో ..భారత్ రష్యా నుండి చమురు కొనుగోళ్లను నిలిపివేసిందని అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ పేర్కొన్నారు. బుధవారం బెసెంట్ మీడియాతో మాట్లాడారు. "ఉక్రెయిన్‌తో వివాదం ప్రారంభమైన తర్వాత భారత్ రష్యా నుండి చమురును కొనుగోలు చేయడం ప్రారంభించింది. కానీ ట్రంప్ వారిపై 25శాతం సుంకం విధించారు.భారత్ రష్యా నుండి చమురు కొనుగోళ్లను నిలిపివేసింది" అని పేర్కొన్నారు. సెనెటర్ లిండ్సే గ్రాహం ప్రవేశపెట్టిన బిల్లుపై మాట్లాడుతూ.. ఈ బిల్లును సెనెటర్ గ్రాహం సెనెట్ ముందు ఉంచిన ప్రతిపాదన అని, అది ఆమోదం పొందుతుందా లేదా అనేది చూడాల్సి వుందని అన్నారు. అయినప్పటికీ అధ్యక్షుడు ట్రంప్‌కు ఆ అధికారం అవసరం లేదని, ఆయన ఐఇఇపిఎ కింద చేయగలరని తాము విశ్వసిస్తున్నామని అన్నారు. కానీ సెనెట్ ఆయనకు ఆ అధికారాన్ని ఇవ్వవచ్చని అన్నారు. రష్యా చమురును కొనుగోలు చేయడం ద్వారా యూరప్ దేశాలు ఉక్రెయిన్‌పై యుద్ధానికి నిధులు సమకూర్చాయని ఆయన ఆరోపించారు. ఇప్పటికీ యూరప్ రష్యన్ చమురును కొనుగోలు చేస్తోందని, ఇప్పుడు లేదా నాలుగేళ్ల తర్వాతైనా.. వారిపై వారు యుద్ధానికి నిధులు సమకూర్చుకుంటున్నారని బెసెంట్ పేర్కొన్నారు.

# దేశభక్తికి ప్రతిరూపం నేతాజీ

**హైదరాబాద్ పెన్ పవర్:** భారతదేశ స్వాతంత్ర్య సమరంలో అహింసా మార్గంలోనే మాత్రమే కాదు పోరాట (సాయుధ) మార్గంనూ బ్రిటర్లపై పోరాడుదామని పిలుపిచ్చిన సమర సేనాని నేతాజీ సుభాష్. వలసవాదాన్ని ప్రతిఘటించడంలో ధైర్యంగా పోరాడటం చేయడంలో సుభాష్ చంద్రబోస్‌కు చేసిన కృషి అపూర్వం, అనన్య సామాన్యం, అజరామరం. ఇండియన్ సివిల్ సర్వీసెస్‌కు ఎంపికైనప్పటికీ తృణప్రాయంగా ఉద్యోగాన్ని వదులుకొని దేశానికి స్వాతంత్ర్యం తేవడమే ప్రధమ కర్తవ్యం అని ఉద్యమంలోకి అడుగుపెట్టిన స్వాతంత్ర్య పిపాసి. భారతీయుడు గౌరవప్రద జీవితాన్ని గడపేలా చేసేందుకు తనను తాను కట్టుబడి ఉన్న ఒక అద్భుతమైన వ్యక్తి."ఆజాద్ హిందూ ఫైజ్"ను స్థాపించి భారత్‌కు స్వాతంత్ర్యం తీసుకు రావడంలో కీలకపాత్ర వహించాడు. స్వాతంత్ర్యం రావాలంటే సొంత సైన్యంతో పాటు ఇతర దేశాల సహకారం కూడా అవసరమని భావించాడు. సుభాష్ బాబు మేథో పరాక్రమం, సంస్థాగత నైపుణ్యాలకు కూడా ప్రసిద్ధి చెందారు. ప్రతి భారతీయుడు గౌరవప్రదమైన జీవితాన్ని గడపేలా చేసేందుకు గాను తనను తాను కట్టుబడి ఉన్న ఒక అద్భుతమైన వ్యక్తి. సుభాష్ బాబు మేథో పరాక్రమం, సంస్థాగత నైపుణ్యాలకు కూడా ప్రసిద్ధి చెందారు. 2021నుండి నేతాజీ జన్మదినమైన జనవరి 23న ప్రతి సంవత్సరం అంతర్జాతీయ స్థాయిలో 'పరాక్రమ దివస్'గా జరపాలని కేంద్రం ప్రభుత్వం నిర్ణయించింది. భారత దేశానికి స్వాతంత్ర్యం రావడానికి అహింస మార్గంలో గాంధీ మార్గంలో కొందరు నాయకుల పోరాటం ఎంత ముఖ్యమో, సుభాస్ బోస్ పోరాట పటిమ అంతే ప్రధానం. తన జీవితంలో స్వార్థం లేకుండా దేశ స్వాతంత్ర్య సాధనే పరమార్థం గా, 12 దేశాలు తిరిగి అతి పెద్ద సైనిక బలగాన్ని ఏర్పాటు చేసి బ్రిటీష్ సామ్రాజ్యానికి వణుకు పుట్టించిన ఒక గొప్ప యుద్ధ వీరుడు సుభాష్ చంద్రబోస్. నివృత్తి కాని సందేహంగా ఆయన అదృశ్యం జరగక పోయి ఉంటే 1947 కంటే రెండు సంవత్సరాల ముందే స్వాతంత్ర్యం వచ్చి ఉండేదని చాలా మంది నమ్ముతారు. సుభాష్ చంద్రబోస్ జనవరి 23, 1897 లో ప్రభావతి దేవి, జానకి నాద్ బోస్ దంపతులకు కటక్‌లో జన్మించాడు. బాల్యం నుండే ఎక్కడ అన్యాయం జరిగిన ఎదురు నిలిచి అడిగేవాడు. ఇంటర్ చదివే రోజుల్లో "స్వేచ్ఛా సేవ సంఘ్" అనే సంస్థ ఏర్పాటు చేసి యువకులకు సమాజ సేవ, ధ్యానం, మానసిక ఆరోగ్యం కోసం వ్యాయామం వంటి అనేక అంశాల పైన ఉపన్యాసాలు ఇచ్చేవాడు. బోస్ కు స్వామి వివేకానంద అంటే ఎంతో ఇష్టం. ఇక 1919లో ఇండియన్ సివిల్ సర్వీసెస్ ఉత్తమ ర్యాంక్ సాధించి శిక్షణ కోసం ఇంగ్లాండ్ వెళ్ళాడు. 1920 లో ఇంగ్లాండ్ లో జరిగిన పరీక్షలో మెరిట్‌లో ఉత్తీర్ణుడైనాడు. అయితే జలియన్ వాలా భాగ్ వార్త తెలిసిన అతడికి మనసులో ఆవేదన కలిగి దానిని మధ్యలోనే వదిలేసి 1921 లో ఇండియా తిరిగి వచ్చాడు. తరువాత గాంధీజీ కలిసి ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ లో చేరాడు. చిత్తరంజన్ దాస్ వద్ద పనిచేసే వాడు. ప్రిన్స్ ఆఫ్ వేల్స్ భారత దేశానికి వచ్చినప్పుడు నిరసన తెలిపినందుకు ఆర్నెల్లు జైలు శిక్ష విధించారు. ఇక అయన జైలు నుండే కలకత్తా శాసన సభకు ఎన్నికయ్యాడు. జైలులో నిరాహార దీక్ష వల్ల ఆరోగ్యం క్షీణించడం చూసి బ్రిటిష్ ప్రభుత్వం కొన్ని ఆంక్షలు విధిస్తు ఆయనను విడుదల చేసింది. ఆ తర్వాత బెంగాల్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, అఖిల భారత కాంగ్రెస్స్ సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యాడు. అలా దేశమంతా పర్యటిస్తూ ఆయన చేసే ప్రసంగాలకు లక్షలాది మంది ప్రేరితులయ్యారు. ఉప్పు సత్యాగ్రహ సమయంలో బోస్ ను నిర్బంధించడం కాకుండా దేశ బహిష్కరణ కూడా చేసారు. ఆ సందర్భంలో అయన యూరప్ లో పర్యటించి హిట్లర్, ముస్సోలిని వంటి మహనీయులను కలిసాడు. అయితే బోస్ హిట్లర్ ని కలసిన సందర్భంలో ఒక సంఘటన జరిగింది. హిట్లర్ కోసం వేచి చూస్తుండగా ఒక వ్యక్తి వచ్చి విషయం ఏమిటి అని అడుగగా నేను మీ బాస్ హిట్లర్ తో మాట్లాడాలని జవాబిచ్చాడు. అయితే కొద్దిసేపటికి వచ్చిన హిట్లర్ బోస్ తో చర్చలు చేసి వెళుతుండగా నీ వద్దకు "ముందుగా వచ్చిన వ్యక్తి హిట్లర్ కాదని నీకెలా తెలిసింది అని ప్రశ్నించిగా, నా భుజాన్ని తట్టే ధైర్యం హిట్లర్ కు తప్ప మరెవ్వరికీ లేదని" ఆయన జవాబిచ్చాడు. అయితే 1934 వ సంవత్సరంలో సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొని జైలు పాలై, ఆరోగ్యం దెబ్బతినడంతో చికిత్స నిమిత్తం ఆయనని ఆస్ట్రియాకు తరలించారు. ఇలా ఆస్ట్రియలో చికిత్స పొందుతున్న ఆయన యూరప్‌లో ఉన్న భారతీయ విద్యార్థులను ఏకం చేసి, వారు స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొనేలా చేయాలని బోస్ భావించాడు. "ద ఇండియన్ స్ట్రగుల్" అనే పుస్తకం రాసే సందర్భంలో ఇంగ్లీష్ వచ్చి టైప్ చేయగలిగే ఒక వ్యక్తిగా పరిచయమైన 23 ఏళ్ల ఎమిలీ షెంకెల్ అనే ఆస్ట్రియా యువతిని తన సహాయకురాలిగా నియమించు కోగా, ఎమిలీ 1934 జూన్ నుంచి బోస్‌తో కలిసి పని చేయగా, వారి మధ్య ప్రేమ చిగురించిందని చెపుతారు. స్వాతంత్ర్యం తప్ప వేరే ఆలోచన లేని బోస్ 1934-36 లో జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు అయినాక దేశమంతా తిరుగుతూ తన ఉపన్యాసాలతో దేశంలోనే అత్యంత ప్రజాధారణ కలిగిన నాయకుడయ్యాడు. ఇలా గొప్ప నాయకుడిగా ఉన్న సమయంలో కాంగ్రెస్ లో అంతర్గతంగా జరిగిన కుట్రల కారణంగా 1939 లో ఆయనను కాంగ్రెస్ నుండి బహిష్కరించారు. ఆ తరువాత వెంటనే ఫార్వర్డ్ బ్లాక్ అనే పార్టీ ని స్థాపించి దేశం అంతటా పర్యటించగా ఆయనకి మద్దతుగా కొన్ని లక్షల్లో జనాలు అయన వెంట నడిచారు. ఇలా ఉద్యమ కారుడిగా ప్రజల్లో చైతన్యం నింపుతుండగా 1941 అరెస్ట్ చేసి తప్పనిసరి పరిస్థితుల్లో విడుదల చేసి గృహ నిర్బంధంలో ఉంచారు. కానీ అయన పథకం ప్రకారం హమ్మద్ జియా ఉల్ హక్ అనే మారు పేరుతో పాస్ పోర్ట్ సంపాదించి తప్పించుకుని తన వ్యక్తి గత సేవకుడు భగత్ రామ్ కు రహమత్ ఖాన్ అని పేరు పెట్టి కాబుల్ కి వెళ్ళాడు. అక్కడ ఉత్తం చంద్ మల్హోత్రా అనే వ్యాపారి ఆయనకి ఆశ్రయం కల్పించగా అక్కడ ఉంటూనే రష్యా, జర్మని, ఇటాలి దేశ రాయబారులతో మంతనాలు చేసాడు. 1941 మార్చ్ 18 న అక్కడి నుండి ఒర్లాండ్ అనే మారు పేరుతొ సమర్ఖండ్, మాస్కో ల మీదుగా బెర్లిన్ చేరుకొని జపాన్, ఇటలి, జెర్మని లకు చెందిన సైన్యాధికారులను కలుసు కున్నాడు. ఇలా చేరుకున్న బోస్ ను వారు స్వతంత్ర భారత రాయబారిగా గుర్తించారు. ఆ తరువాత బోస్ అక్కడే ఆజాద్ హింద్ ఫౌజ్ స్థాపించాడు. 1941 ఫిబ్రవరి 27 న బోస్ రేడియోలో ఇచ్చిన ప్రసంగం యావత్ దేశాన్ని కదిలించింది. ప్రపంచ యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో జపాన్ లోని ఆజాద్ హింద్ ఫౌజ్ సభ్యులు బోస్ ను అక్కడికి ఆహ్వానించగా 45 రోజుల పాటు జలాంతర్గామిలో ప్రయాణించి అక్కడ మత్సుడ అని పేరు మార్చు కున్నాడు. అక్కడ బోస్ ఇచ్చిన స్ఫూర్తిదాయకమైన ఉపన్యాసాలతో హింద్ ఫౌజ్ లో తండోప తండాలుగా సైనికులు చేరారు. ఇక్కడ మహిళలకు ప్రత్యేకంగా ఝాన్సీ లక్ష్మీ బాయి రెజిమెంట్ ను ఏర్పాటు చేసి మహిళలకు యుద్ధ శిక్షణ నివ్వడం మొదలు పెట్టారు. ఇలా ఎంతో శక్తివంతమైన సైన్యాన్ని తయారుచేసి చలో ఢిల్లీ అనే నినాదంతో ప్రత్యక్ష యుద్ధానికి దిగి జపాన్ సహకారంతో ఇంఫాల్, అండమాన్, నికోబార్ లను జయించి అక్కడ స్వతంత్ర భారత పతాకాన్ని ఎగురవేసి ముందుకు సాగుతుండగా ఆయనకి కష్టాలు మొదలయ్యాయి. తనకు అండగా నిలిచినా జపాన్ దేశం యుద్ధంలో ఓటమికి చేరువైంది. ఇక బర్మాలో వరదల కారణంగా ఆరోగ్యం క్షీణిస్తూ అనేక మంది సైనికులు మరణించారు. ఆ సమయంలో రష్యా దాడికి దిగి, అణుబాంబు వేయడంతో జపాన్ అతలాకుతలం అయింది. అప్పటివరకు తనకు అండగా ఉన్న జపాన్ అలా అవ్వడంతో బోస్ నిస్సహాయు డైనాడు. ఆ తరువాత సింగపూర్, రంగూన్ సైనిక దళాలకు బ్రిటీష్ దళాలు దగ్గరయ్యాయి. 1945వ సంవత్సరం ఆగస్టు భారత జాతీయ సైన్యానికి సహకరించిన జపాన్ సైనిక దళాలు బ్రిటీష్ సైనిక దళాలకు శరణుజొచ్చాయి. దీనితో నేతాజీ సింగపూర్‌ను వీడి వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. 1945 ఆగస్టు 18 వ తేదీన తైపీలో జరిగిన విమాన ప్రమాదంలో అయన మరణించి నట్లుగా రేడియో లో ప్రకటించారు.ఇక తైవాన్ కి సంబంధించిన ఎయిర్ క్రాష్ లో చంపేశారని కొందరు, ఆగస్ట్ 1945 తర్వాత నేతాజీ రష్యాలో ఉన్నాడని చెప్పడం వల్ల అతను చనిపోలేదని మరికొందరు, సుభాష్ చంద్రబోస్ మారువేశంలో మన దేశం లోనే ఉన్నాడని ఇలా ఎన్నో రకాలుగా చెప్పుకునేవారు. సైన్యానికి శిక్షణ ఇచ్చేప్పుడు... "నేను మీకు కేవలం ఆకలి, దాహం, కష్టం, మృత్యువును మాత్రమే ఇవ్వగలను. నాకు మీ రక్తాన్ని ఇవ్వండి. మీకు స్వతంత్రాన్ని ఇస్తాను"... అని సైన్యంలో విశ్వాసాన్ని చిగురించేలా చేసేవాడు. దేశం కోసం ఎవరు చేయని విధంగా అహింస వలన కాదు, పోరాడితేనే స్వాతంత్ర్యం వస్తుందని కట్టు బట్టల్తో జపాన్ వెళ్లి ఇండియన్ ఆర్మీని సిద్ధం చేసి బ్రిటిష్ సైన్యానికి గుండెల్లో రైళ్లు పరిగెత్తించి చివరికి స్వాతంత్ర్య చూడ కుండానే కనుమరుగైన యోధుడు బోస్. నేతాజీ సుభాస్ చంద్రబోస్ యొక్క విలువైన వారసత్వాన్ని, చరిత్రను పరిరక్షించడానికి భారత ప్రభుత్వం అనేక రకాల చర్యలను చేపట్టింది. న్యూఢిల్లీలోని ఎర్రకోట వద్ద నేతాజీపై మ్యూజియం ఏర్పాటు చేశారు. దీనిని 23.01.2019న ప్రధాని ప్రారంభించారు. దేశంలో చారిత్రాత్మక విక్టోరియా మెమోరియల్ భవనంలో కోల్‌కతాలో నేతాజీపై లైట్ అండ్ సౌండ్ షో శాశ్వత ప్రదర్శన ఏర్పాటు చేయడానికి ప్రణాళిక చేయ బడింది. అండమాన్, నికోబార్‌లోని 3 ద్వీపాలకు పేరు మార్చి ప్రధాని మోదీ రాస్ ద్వీపానికి నేతాజీ సుభాష్ "చంద్రబోస్ ద్వీపంగా" పేరు మార్చారు.

# హసీనాపై దేశద్రోహం కేసులో ఫిబ్రవరి 9న విచారణ



**హైదరాబాద్ పెన్ పవర్:** పదవీచ్యుత ప్రధాని షేకహేసీనాపై దాఖలైన దేశద్రోహం కేసులో మరో విచారణను ఫిబ్రవరి 9న నిర్వహిస్తామని బంగ్లాదేశ్‌కోర్టు బుధవారం ప్రకటించింది. ఢాకా స్పెషల్ జడ్జి కోర్ట్ -9 జస్టిస్ ఎం.డి.అబ్దుస్ సలాం ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు మీడియా తెలిపింది. ఈ అంశంపై వేర్వేరు అభ్యర్థలను పరిశీలించిన అనంతరం జడ్జి ఈ నిర్ణయం ప్రకటించినట్లు పేర్కొంది. 286మంది నిందితుల్లో, పదవీచ్యుత ప్రధాని షేక్ హసీనాతో సహా 259మంది ఇప్పటికే పరారీలో ఉన్నారని, వారిపై విచారణ జరుగుతోంది. హసీనా సహ పరారీలో ఉన్న నిందితులందరూ కోర్టు ఎదుట హాజరుకావాల్సిందిగా వార్తాపత్రికలో నోటీసులు ముద్రించాల్సిందిగా కోర్టు గతేడాది అక్టోబర్ 14న ఆదేశించింది.స్థానిక మీడియా అందించిన వివరాల ప్రకారం.. .. 2024 డిసెంబర్ 19న 'జాయ్ బంగ్లా బ్రిగేడ్' నిర్వహించిన వర్చువల్ సమావేశంలో హసీనా మరియు పలువురు అవామీ లీగ్ సభ్యులు పాల్గొన్నారు. యుఎస్ అవామీలీగ్ నేత డా.రబ్బీ ఆలం నిర్వహించిన ఈ ఆన్‌లైన్ సమావేశంలో హసీనాను తిరిగి ప్రధానిగా నియమించేందుకు అంతర్యుద్ధం చేస్తామని ప్రతిజ్ఞ చేశారని పేర్కొంది. బంగ్లాదేశ్ మరియు విదేశాల నుండి మొత్తం 577మంది వ్యక్తులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో వారు ముహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు కుట్రపన్నారని పేర్కొన్నారు. హసీనా ఆదేశాలను పాటిస్తామని హామీ ఇచ్చారని తెలిపింది. సిఐడి ఎఎస్‌పి మొహమ్మద్ ఎనాముల్ హక్ గతేడాది మార్చిలో హసీనా మరియు 72మందిపై కోర్టులో దేశద్రోహం కేసు నమోదు చేశారు. ఆగస్టు 14న హసీనా సహా 286మందిపై చార్జిషీటు సమర్పించారు. కోర్టు చార్జ్‌షీటును స్వీకరించి, నిందితులందరికీ అరెస్ట్ వారెంట్లు జారీ చేసింది. విద్యార్థుల నేతృత్వంలోని నిరసనలపై ప్రభుత్వం క్రూరమైన అణచివేత చర్యలకు పాల్పడినందుకు నవంబర్‌లో ప్రత్యేక ట్రిబ్యునల్ హసీనాకు మరణశిక్ష విధించిన సంగతి తెలిసిందే.

# కర్ణాటక అసెంబ్లీలో గవర్నర్ రెండు లైన్ల ప్రసంగం



**హైదరాబాద్ పెన్ పవర్:** కర్ణాటక గవర్నర్ థావర్ చంద్ గెహ్లోట్ రాష్ట్ర శాసనసభను ఉద్దేశించి చేసిన రెండు లైన్ల ప్రసంగం కర్ణాటకలోని కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం నుండి తీవ్ర విమర్శలకు దారితీసింది. గురువారం గెహ్లోట్ రాష్ట్ర శాసనసభ ఉమ్మడి సమావేశంలో తన సాంప్రదాయ ప్రసంగాన్ని రెండు ప్రారంభ పంక్తులు మాత్రమే చదివి ముగించారు. సభ్యులను పలకరించిన తర్వాత, గవర్నర్.. "ఉమ్మడి సమావేశంలో ప్రసంగించడం సంతోషంగా ఉంది. రాష్ట్ర ఆర్థిక, సామాజిక, భౌతిక అభివృద్ధిని రెట్టింపు చేయడానికి నా ప్రభుత్వం కట్టుబడి ఉంది. జై హింద్, జై కర్ణాటక" అని ఆయన హిందీలో చదివారు. గవర్నర్ తన ప్రసంగాన్ని కుదించడంపై కాంగ్రెస్ సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, సభలో "షేమ్ షేమ్" అని నినాదాలు చేశారు. ప్రభుత్వం తయారుచేసిన పూర్తి ప్రసంగాన్ని గవర్నర్ థావర్ చంద్ గెహ్లోట్ చదవకపోవడం ద్వారా రాజ్యాంగాన్ని ఉల్లంఘించారని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నారు. గవర్నర్ కేంద్ర ప్రభుత్వానికి 'కీలు బొమ్మ'లా వ్యవహరించారని, రాజ్యాంగం ప్రకారం తన విధులను నిర్వర్తించలేదని మండిపడ్డారు. ఈ వైఖరికి వ్యతిరేకంగా తాము నిరసన తెలుపుతామని సిద్ధరామయ్య అన్నారు. గవర్నర్ ప్రవర్తనపై సుప్రీంకోర్టుకు వెళ్లాలా వద్దా అని ప్రభుత్వం పరిశీలిస్తుందని ఆయన అన్నారు. లోక్ భవన్, కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం మధ్య ఉద్రిక్త ప్రతిష్టంభన తర్వాత గవర్నర్ కొద్దిసేపు కనిపించడం జరిగింది. ప్రభుత్వం తయారుచేసిన ప్రసంగంలో కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఆరోపణలున్న మొత్తం 11 పేరాలు, ఓఉఔఖీఇఉం "రద్దు", నిధుల పంపిణీతో సహా పలు అంశాలను ప్రస్తావిస్తూ.. వాటిని తొలగించాలని గవర్నర్ కోరారు. అయితే, కర్నాటక ప్రభుత్వం వాటిని తొలగించకపోవడంతో, గవర్నర్ తన ప్రసంగాన్ని రెండు వాక్యాలతోనే ముగించారు. బిజెపియేతర పాలిత రాష్ట్రాల్లో గవర్నర్ లబ ప్రభుత్వం ఘర్షణల పరంపరలో ఇది తాజాది. రాష్ట్ర ప్రథమ పౌరుడిగా, రాజ్యాంగ పరిరక్షకుడిగా వ్యవహరించాల్సిన గవర్నర్లు ప్రతిపక్షాల పాలిత రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వ ఏజెంట్లుగా వ్యవహరిస్తున్న పోకడలు పెరిగిపోతున్నాయని రాజకీయ విశ్లేషకులు విమర్శిస్తున్నారు.

## తీవ్ర అగాథంలోకి రూపాయి..



**హైదరాబాద్ పెన్ పవర్:** అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ అత్యంత అధ్వాన్న స్థాయికి పడిపోయింది. పతనంలో మరో నూతన రికార్డ్‌ను చవి చూసింది. భారతదేశ చరిత్రలోనే ఎప్పుడూ లేని స్థాయిలో బుధవారం డాలర్‌తో రూపాయి మారకం విలువ ఏకంగా 92 చేరువకు పతనమయ్యింది. విదేశీ సంస్థగత మదుపర్లు వరుసగా తమ నిధులను తరలించుకుపోవడం, అమెరికా, భారత్ మధ్య వాణిజ్య ఒప్పంద అనిశ్చితి, పడిపోతోన్న రూపాయిని కాపాడటంతో మోడీ సర్కార్, రిజర్వ్ బ్యాంక్ విఫలం కావడంతో అత్యంత పేలవ ప్రదర్శన కనబర్చుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలోనే జనవరి 21న ఒక్క పూటలోనే 76 పైసలు కోల్పోయి 91.73కు దిగజారింది. ఫారెక్స్ ఎక్స్ఛేంజీ మార్కెట్‌లో ఉదయం 91.05 వద్ద ప్రారంభమైన రూపాయి విలువ ఓ దశలో 91.74 కనిష్టాన్ని చవి చూసింది. దీంతో ఒక్క డాలర్‌కు రూ.91.73 చెల్లించాల్సిన దుస్థితి నెలకొంది. ఈ ఒక్క నెలలోనే రూపాయి విలువ 1.50 శాతం విలువ కోల్పోయింది. ఇంతక్రితం 2025 డిసెంబర్ 16న డాలర్‌తో రూపాయి మారకం విలువ 91.14 కనిష్ట స్థాయిని చవి చూసింది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ ముడి చమురు ధర 1.88 శాతం తగ్గి 63.70 డాలర్లుగా నమోదయ్యింది. రూపాయి విలువ పతనం అంతర్జాతీయ మార్కెట్‌లో దిగుమతులను తీవ్ర భారం చేయనున్నాయి. మరోవైపు విదేశీ చెల్లింపుల భారం అమాంతం పెరిగిపోనుంది.

## వరుస షాకులిచ్చి..
## భారీగా పడిపోయిన బంగారం ధరలు!



**హైదరాబాద్ పెన్ పవర్:** బ్రేకుల్లేకుండా దూసుకెళ్లిన బంగారం ధరలు నేడు శాంతించాయి. గత మూడ్రోజులుగా వరుస షాకులు తిన్న మహిళలకు నేడు కాస్త ఊరట లభించింది. ఇక ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా మహిళలు బంగారు అభరణాలు ధరిస్తారు. ముఖ్యంగా మన తెలుగు రాష్ట్రాల్లోని మహిళలందరూ బంగారానికి ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తారు. అనేక రకాల డిజైన్లతో లక్షల్లో విలువ చేసే కమ్మలు, నెక్లెస్లు, బ్యాంగిల్స్ వంటివి కొనుగోలు చేస్తుంటారు. ఆడవాళ్లకు ప్రతిరోజూ షాపింగ్ చేసిన బోర్ కొట్టదనడంలో ఎటువంటి సందేహం లేదని చెప్పవచ్చు. కాగా గోల్డ్ రేట్లు ఎప్పుడెప్పుడు తగ్గుతాయా? అంటూ మహిళలు వేయి కళ్లతో ఎదురుచూస్తుంటారు. కాస్త పసిడి ధరలు తగ్గుముఖం పట్టగానే బంగారం షాపుల్లో ఎగబడుతారు. అయితే ఇటీవల బంగారం ధరల్లో హెచ్చుతగ్గులు జరుగుతోన్న విషయం తెలిసిందే. ఈ రేట్లతో మహిళల్లో ఓసారి ఉత్సాహం నెలకొనగా... మరోసారి నిరాశకు గురవుతుంటారు. ముఖ్యంగా ఈ మధ్య కాలంలో బంగారం రేట్లు భారీగా పెరుగుతున్నాయి. కొంచెం తగ్గగానే డబుల్, త్రిబుల్ ధర పెరుగుతుంది. ఇవాళ గోల్డ్ ప్రియులకు కాస్త ఊరట లభించింది. నిన్న 22 క్యారెట్లు.. 10 గ్రాముల బంగారం రూ.1,43,550 ఉండగా.. నేడు రూ. 2,100 తగ్గి రూ. 1, 41, 450గా ఉంది. ఇక నిన్న 24 క్యారెట్లు 10 గ్రాముల బంగారం ధర రూ.1,56,600 గా ఉంది. నేడు రూ.2,290 తగ్గి రూ.1,54, 310 గా ఉంది. కాగా ఈ నేపథ్యంలో నిన్నటి ధరతో పోలిస్తే ఇవాళ పసిడి ధరల్లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి.

## భారత్‌తో త్వరలోనే భారీ వాణిజ్య ఒప్పందం



**హైదరాబాద్ పెన్ పవర్:** స్విట్జర్లాండ్‌లోని దావోస్ వేదికగా జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్- 2026 సదస్సులో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాల్గొన్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన భారత్-అమెరికా మధ్య జరగబోయే వాణిజ్య ఒప్పందం, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వాన్ని ప్రశంసిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. మోదీపై తనకు అపారమైన గౌరవం ఉందన్నారు. ఆయన తనకు మంచి స్నేహితుడు మాత్రమే కాదు, ఒక అద్భుతమైన నాయకుడని కితాబిచ్చారు. ఇరు దేశాల మధ్య ఉన్న సంబంధాలు మోదీ నాయకత్వంలో మరింత బలోపేతం అయ్యాయని ఆయన పేర్కొన్నారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం (ఠతీజీటవ ఆవజీశ్రీ) గురించి ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు. తాము భారత్‌తో ఒక అద్భుతమైన ఒప్పందాన్ని కుదుర్చుకోబోతున్నాం. దీనిపై చర్చలు తుది దశకు చేరుకున్నాయని అన్నారు. ఈ ఒప్పందం ఇరు దేశాల ఆర్థిక వ్యవస్థలకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని కామెంట్ చేశారు. ప్రపంచ దేశాలతో వాణిజ్యపరమైన సవాళ్లు ఉన్నప్పటికీ, భారత్‌ను అమెరికా ఒక నమ్మకమైన మరియు వ్యూహాత్మక భాగస్వామిగా చూస్తోందని ట్రంప్ స్పష్టం చేశారు. 2030 నాటికి ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 500 బిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యంగా ఈ కొత్త ఒప్పందం ఉండబోతోందని సమాచారం. కాగా, గతంలో కొన్ని సుంకాల (ఴజీతీఱటటబ) విషయంలో విభేదాలు వచ్చినప్పటికీ, ట్రంప్ తాజా వ్యాఖ్యలతో ఆ అడ్డంకులు తొలగిపోయి, త్వరలోనే చారిత్రాత్మక వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## డాక్టర్ రెడ్డీస్ లాభం రూ.1,210 కోట్లు




**హైదరాబాద్ పెన్ పవర్:** డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ ఏకీకృత ఖాతాల ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.8,726.8 కోట్ల ఆదాయం, రూ.1,210 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఈపీఎస్ రూ.14.53గా నమోదైంది. 2024-25 ఇదే కాలంలో ఆదాయం రూ.8,358.6 కోట్లు, నికర లాభం రూ.1,413 కోట్లుగా ఉన్నాయి. దీంతో పోలిస్తే ఈసారి ఆదాయం 4.4 శాతం పెరిగింది. నికర లాభం 14 శాతం క్షీణించింది. బ్రాండెడ్ ఔషధాల మార్కెట్లో బలమైన వృద్ధి నమోదైనప్పటికీ, అమెరికాలో లెనాలిడోమైడ్ విక్రయాలు తగ్గడం, కొత్త లేబర్ కోడ్ నిబంధనల వల్ల ఏర్పడిన అదనపు ఖర్చుల కారణంగా నికర లాభంలో క్షీణత నమోదైనట్లు కంపెనీ పేర్కొంది. '2025-26 మూడో త్రైమాసికంలో మా వృద్ధికి బ్రాండెడ్ వ్యాపారాల్లో కొనసాగుతున్న జోరు అనుకూలంగా నిలిచింది. విదేశీ మారక ద్రవ్య విలువలు మద్దతుగా నిలిచాయి. ఇది లెనాలిడోమైడ్ విక్రయాల తగ్గుదల ప్రభావాన్ని భర్తీ చేసింది. మా వాటాదారులకు దీర్ఘకాలిక విలువను సృష్టించేందుకు మా భవిష్యత్తు వ్యూహాలను అమలు చేయడం, కార్యాచరణ సామర్థ్యాన్ని పెంచుకోవడంపై దృష్టి సారించాం' అని ఫలితాల సందర్భంగా డాక్టర్ రెడ్డీస్ సహ ఛైర్మన్, ఎండీ జీవీ ప్రసాద్ అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-డిసెంబరు మధ్య కాలంలో డాక్టర్ రెడ్డీస్ రూ.26,077 కోట్ల ఆదాయంపై రూ.4,065 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే 9 నెలల కాలంలో ఆదాయం రూ.24,047 కోట్లు, నికర లాభం రూ.4,060 కోట్లుగా ఉంది.

# గ్రీన్‌లాండ్‌లో ట్రంప్‌కి కావలసిందేమిటి?

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ భద్రతకు గ్రీన్‌లాండ్ కీలకం, వెనక్కి తగ్గేది లేదంటున్నారు ట్రంప్. వెనిజువెలా తర్వాత ట్రంప్ గ్రీన్‌లాండ్‌పై కన్నేయడంతో ప్రపంచం నివ్వెరపోతోంది. ఇదిలా ఉంటే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఓ వైపు యూరప్ దేశాలతో వ్యాపారం కోసం ఒప్పందాలు చేసుకుంటూ.. మరోవైపు వారిపైనే సుంకాలు విధిస్తానని బెదిరింపులకు దిగడంతో ట్రంప్‌కు ఆయా దేశాలు షాకిచ్చాయి. అమెరికాతో కుదుర్చుకుంటున్న ట్రాన్స్ అట్లాంటిక్ వాణిజ్య ఒప్పందానికి బ్రేక్ వేశాయి. వెనిజువెలా అధ్యక్షుడు మదురోపై దాడిచేసి ఎత్తుకొచ్చిన ఘటనను వారికి గుర్తు చేస్తున్నారు. అయితే యూరప్ దేశాలు మాత్రం ఈ బెదిరింపులకు లొంగేందుకు సిద్ధంగా లేవు. దీంతో గ్రీన్‌లాండ్‌పై ట్రంప్ బెదిరింపులకు నిరసనగా..యూరోపియన్ పార్లమెంట్ అమెరికాతో గత జులైలో సంతకం చేసిన వాణిజ్య ఒప్పందం అమలును తాత్కాలికంగా నిలిపేసింది. ట్రంప్, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్ మధ్య గతజులైలో వాణిజ్య ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం ఇయు వస్తువులపై అమెరికా సుంకాలను 15 శాతానికి పరిమితం చేయాలని నిర్ణయించారు. బ్లాక్ అమెరికన్ ఎగుమతులపై సుంకాలను కూడా తగ్గించారు.అయితే ఇప్పుడు గ్రీన్‌లాండ్ కబ్జా కోసం చేస్తున్న ప్రయత్నాలతో తాజా పరిణామాలు ట్రంప్‌కి షాకిచ్చాయనే చెప్పాలి. ఆర్కిటిక్ ద్వీపమైన గ్రీన్‌లాండ్‌లో మోహరింపు కోసం దళాలను పంపిన యూరోపియన్ దేశాలపై ట్రంప్ అదనంగా 10% సుంకాన్ని ప్రకటించారు. జూన్ 1 నుండి ఇది 25 శాతానికి పెరుగుతుందని, గ్రీన్‌లాండ్ పూర్తి కొనుగోలు కోసం ఒక ఒప్పందం కుదిరే వరకు అమలులో ఉంటుందని తెలిపారు. గ్రీన్‌లాండ్ పేరు వెనుక కారణం చారిత్రక మార్కెటింగ్ వ్యూహంగానే భావించాలి. దీనిపేరుకు విరుద్ధంగా ఇది నాలుగింట మూడు వంతులు మంచుతో కప్పబడి ఉంది, అయినప్పటికీ పురాతన కాలంలో పచ్చగా ఉండేదని, ప్రస్తుతం ఖనిజ వనరులు, వ్యూహాత్మక ప్రాముఖ్యత, పునరుత్పాదక ఇంధన వనరులు వంటి కారణాల వల్ల దీనికి ప్రాముఖ్యత పెరిగింది. గ్రీన్‌లాండ్ ప్రాంతం ఆర్కిటిక్ ప్రాంతంలో ఉన్నందున, ఇది అమెరికాకు రక్షణ వ్యూహాల్లో ముఖ్యమైంది. ఇక్కడ విలువైన ఖనిజాలు అంటే గ్రాఫైట్, లిథియం, టైటానియం వంటివి, రత్నాలు విరివిగా లభిస్తాయి. ప్రపంచంలోనే అత్యధిక శాతం పునరుత్పాదక ఇంధనాన్ని ముఖ్యంగా జలవిద్యుత్‌కి ఇది ఎంతో ఉపయోగకరమయింది. ప్రపంచంలోనే అతిపెద్ద ద్వీపం, డెన్మార్క్ రాజ్యానికి స్వయం 1979లో డెన్మార్క్ దీనికి స్వాతంత్ర్యాన్ని ప్రసాదించింది. ప్రపంచంలోని అతి పెద్ద దీవి ఇది. అంటార్కిటికా తరువాత అత్యధికంగా ఐస్‌పొరతో నిండిన భూభాగం ఇదే. ట్రంప్ గ్రీన్‌లాండ్ స్వాధీన హెచ్చరికల నేపథ్యంలో తాము డెన్మార్క్ యూనియన్‌లోనే కొనసాగుతామని గ్రీన్‌లాండ్ ప్రధాని జెన్స్ ఫ్రెడెరిక్ నీల్సన్ విస్పష్ట ప్రకటన చేశారు. అమెరికా, డెన్మార్క్‌లలో ఏ దేశంతో కొనసాగుతారని తమకు ఎంపిక అవకాశం ఇస్తే తాము యూరోపియన్ యూనియన్‌లో భాగంగానే ఉంటామన్నారు. అంతర్జాతీయ సంబంధాలను ఎప్పుడూ కూడా ఒక వ్యాపార ఒప్పందంగా భావించడం ట్రంప్ వైఖరిని స్పష్టం చేసింది. అవసరైతే తన నిర్ణయాలకు మద్దతు ఇస్తారో వారికి సుంకాల నుంచి రాయితీలు ఇవ్వడం, వ్యతిరేకించే వారిపై పెనాల్టీలు వేయడం అనే ఎక్స్ఛేంజ్ లాజిక్‌ను ఆయన అనుసరిస్తున్నారు. జాతీయ భద్రత అనే కార్డును ట్రంప్ ఇక్కడ బలంగా వాడుతున్నారు. ఆర్కిటిక్ మహాసముద్రంలో రష్యా, చైనా ఉనికి పెరుగుతున్న సమయంలో గ్రీన్‌లాండ్ అమెరికాకు ఒక రక్షణ కవచంలా పనిచేస్తుందని అంతర్జాతీయ నిపుణులు చెబుతున్నారు. ట్రంప్ వ్యాఖ్యలపై నూక్‌లో చరిత్రలోనే అతిపెద్ద నిరసనలు చెలరేగాయి. 'గ్రీన్‌లాండ్ అమ్మకానికి లేదు' అంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సంస్కృతిని, స్వయం ప్రతిపత్తిని కాపాడుకుంటామని గ్రీన్‌లాండ్ వాసులు స్పష్టం చేశారు. గ్రీన్‌లాండ్‌కు మద్దతుగా ఆ దేశంలో యూరోపియన్ కంట్రీస్ తమ సైనిక సిబ్బందిని మోహరించాయి. జర్మనీ 13 మంది సిబ్బందితో కూడిన నిఘా బృందాన్ని పంపింది. నార్వే ఇద్దరు సైనిక సిబ్బందిని, నెదర్లాండ్స్ ఒక నావికాదళ అధికారిని గ్రీన్‌లాండ్‌కు పంపాయి. అదే విధంగా యుకె కూడా ఒక సైనిక బృందాన్ని గ్రీన్‌లాండ్‌కు తరలించింది. ఫ్రాన్స్ 15మంది, స్వీడన్ ముగ్గురు, ఫిన్లాండ్ ఇద్దరు సైనికులను పంపాయి. యూరోపియన్ యూనియన్ దేశాలు అమెరికాకు వ్యతిరేకంగా గ్రీన్‌లాండ్‌లో సైన్యాన్ని మోహరించడం ప్రపంచ దేశాల్లో కొత్త చర్చకు దారితీసింది.

# సామాన్యుల కోసం ఎస్బీఐలో బెస్ట్ పొదుపు స్కీమ్




**హైదరాబాద్ పెన్ పవర్:** రోజు వారీ కూలీలు, నిర్మాణ రంగంలోని కార్మికులు రోజంతా కష్టపడి వచ్చిన కొద్ది డబ్బుతో తమ కుటుంబాన్ని పోషించుకుంటారు. వారు పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టడం అసాధ్యమనే చెప్పాలి.దీంతో కూలీ డబ్బుల్లోంచి కొంత తీసి ఇంట్లో దాచుకుంటుంటారు. అయితే ఇంట్లో దాయడం వల్ల దొంగతనం జరగడం, ఎలుకల బెడద వంటివి ఉంటాయి. అలాంటి సామాన్య ప్రజలు చిన్న మొత్తాల్లో పొదుపు చేసుకునేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) అద్భుతమైన పొదుపు పథకం అందిస్తోంది. పొదుపు ఖాతాను మించిన వడ్డీ రేటు ఆఫర్ చేస్తోంది. అదే ఎస్‌బీఐ రికరింగ్ డిపాజిట్ స్కీమ్. నిర్ణీత కాలానికి చిన్న మొత్తాల్లో పొదుపు చేసుకునేందుకు ఈ రికరింగ్ డిపాజిట్ స్కీమ్ అవకాశం కల్పిస్తుంది. తమ ఆర్థిక లక్ష్యాన్ని చేరుకునేందుకు చేయూతనిస్తుంది. ఈస్కీమ్ కనీస మెచ్యూరిటీ కాలం 12 నెలలు. గరిష్ఠంగా 120 నెలలు (5 సంవత్సరాలు) పొదుపు చేసేందుకు అవకాశం ఉంటుంది. దేశంలోని అన్ని ఎస్‌బీఐ బ్యాంకు బ్రాంచీల్లో ఈ రికరింగ్ డిపాజిట్ స్కీమ్ అందుబాటులో ఉంటుంది.నెలవారీ కనీస డిపాజిట్ రూ.100 మాత్రమే. ఆ తర్వాత ఎంత మొత్తమైనా పొదుపు చేసుకోవచ్చు. అయితే, ప్రతి నెల టైమ్‌కి డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. గడువులోగా డబ్బులు కట్టకపోతే పెనాల్టీ ఉంటుంది. వరుసగా ఆరు నెలలు డిపాజిట్ చేయకపోతే అకౌంట్ మూసేస్తారు. ఖాతాదారుకు అందులోని డబ్బులను తిరిగి ఇచ్చేస్తారు. ఎస్‌బీఐ రికరింగ్ డిపాజిట్ స్కీమ్‌లో నెలకు రూ.100 లేదా రూ.500 చొప్పున పొదుపు చేయాలని మీరు అనుకుంటే ఆర్‌డీ ఖాతా తెరవాల్సి ఉంటుంది.మీరు 5 సంవత్సరాల మెచ్యూరిటీ వ్యవధి ఎంచుకుంటే అప్పుడు వడ్డీ రేటు 6.50 శాతం ఉంటుంది. 60 ఏళ్ల వయసు దాటిన సీనియర్ సిటిజన్లు అయితే వడ్డీ రేటు 7 శాతంగా ఉంటుంది. 5 సంవత్సరాల తర్వాత ఎంత వస్తుందో ఆన్‌లైన్ కాలిక్యులేటర్ ద్వారా ముందే లెక్కగట్టవచ్చు. నెలకు రూ.100 చొప్పున పొదుపు చేసిన వారికి 5 ఏళ్ల తర్వాత మీ డిపాజిట్ మొత్తం రూ.6 వేలు అవుతుంది. దానిపై వడ్డీ రూ.1,106 వస్తుంది. అంటే అసలు వడ్డీ కలిపి మొత్తం రూ.7,106 వస్తాయి. ఇక నెలకు రూ.500 చొప్పున పొదుపు చేశారు అనుకుందాం. 5 సంవత్సరాల తర్వాత మీ డిపాజిట్ మొత్తం రూ.30 వేలు అవుతుంది. వడ్డీ రూ.5,528 వస్తుంది. మొత్తంగా అసలు, వడ్డీ కలిపి రూ. 35,528 వస్తాయి. అదే నెలకు రూ.1000 జమ చేస్తే చేతికి అసలు, వడ్డీ కలిపి రూ.71,057 వరకు లభిస్తాయి. సీనియర్ సిటిజన్లు అయితే 7 శాతం వడ్డీ లభిస్తుంది.

# సాగర్ సిమెంట్స్ ఆదాయం రూ.591 కోట్లు

SAGAR CEMENT
SOLID CEMENT. SOLID GHAR.

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో సాగర్ సిమెంట్స్ రూ.591 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. దీనిపై రూ.64.10 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం రూ.564 కోట్లు, నికర నష్టం రూ.54.45 కోట్లుగా ఉన్నాయి. మొత్తం 9 నెల కాలానికిగాను ఆదాయం రూ.1,863 కోట్లు, నికర నష్టం రూ.100.78 కోట్లుగా ఉన్నాయి. దాచేపల్లిలోని ఆంధ్రా సిమెంట్స్ ప్లాంటులో ఆగస్టు 2026 నాటికి సిమెంటు సామర్థ్యాన్ని ఇప్పుడున్న 2.25 మి.టన్నుల నుంచి 3 మి.టన్నులకు పెంచాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకొంది. రుతుపవనాలు దీర్ఘకాలం కొనసాగడం, పండగల నేపథ్యంలో గిరాకీ తక్కువగానే ఉన్నప్పటికీ, త్రైమాసికం చివరి నాటికి క్రమంగా మెరుగుపడిందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీకాంత్ రెడ్డి వివరించారు. సామర్థ్యం పెంపు, ఖర్చుల నియంత్రణపై దృష్టి సారించినట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, కర్బన ఉద్గారాల తగ్గింపులో భాగంగా హైదరాబాద్‌కు చెందిన సో అండ్ రీవ్ వారితో సాగర్ సిమెంట్స్ తాజాగా ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా తెలంగాణలోని మట్టంపల్లి సాగర్ సిమెంట్స్ ప్లాంటులో బయోచార్, గ్యాసిఫికేషన్ యూనిట్లను ఏర్పాటు చేయనున్నారు. స్థానిక గ్రామాల నుంచి సేకరించిన పత్తి పంట వ్యర్థాలను ఉపయోగించి సిన్‌గ్యాస్ ఉత్పత్తి చేస్తారు. దీనిని సిమెంట్ తయారీలో ఇంధనంగా వినియోగిస్తారు. ఈ ప్రక్రియలో వచ్చే బయోచార్‌ను రైతులకు ఎరువుగా అందిస్తారు.

# ట్రంప్ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా అమెరికాలో ఆందోళనలు



**హైదరాబాద్ పెన్ పవర్:** గత ఏడాది కాలంగా ట్రంప్ అనుసరిస్తున్న విధానాల వల్ల వలసదారులపైనా, తక్కువ సంపాదించే బృందాలపైనా, ఇతర రంగాలపైనా తీవ్ర ప్రభావం పడుతుంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అజెండాను తిరస్కరిస్తూ.. మంగళవారం దేశవ్యాప్తంగా ఆందోళనలు జరిగాయి. దాదాపు 900కి పైగా శాంతియుతంగా జరిగిన ఆందోళనల్లో వేలాదిమంది పాల్గొన్నారు. ఈ ఆందోళనల సందర్భంగా నిరసనకారులు "ఫ్రీ అమెరికా వాకౌట్" అని పిలుపునిచ్చారు. జాతీయ కార్యాచరణ దినోత్సవంలో భాగంగా జరిగిన ఈ ఆందోళనలు మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యాయి. చేసే పనిని వదిలిపెట్టి, పాఠశాలలను, వ్యాపారాలను విడిచిపెట్టి, దేశాన్ని విచ్ఛిన్నం చేసిన అధ్యక్షుడి నిరంకుశత్వాన్ని, బలప్రయోగ పద్ధతులకు సవాల్ చేస్తూ వీధులకొచ్చి నిరసనల్లో పాల్గొనాలని పౌరులు పిలుపునిచ్చారు. ట్రంప్ అనుసరిస్తున్న విధానాల వల్ల వందలాది సమాజాల్లో భయాన్ని పుట్టించాయి. ప్రపంచస్థాయిలో దౌర్జన్యపరంగా కూడా ఆ దేశాన్ని ఒంటరిని చేశాయని నిరసనకారులు ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, నిరంకుశ పద్ధతులకు సహకరించడం ఆపినప్పుడే అమెరికాకు స్వేచ్ఛ లభిస్తుందని.. అందుకే 'ఫ్రీ అమెరికా వాకౌట్' అనే పిలుపునిచ్చినట్లు పౌరులు వెల్లడించారు. ట్రంప్ ఏడాది పదవీ కాలంలో సమాజంలో దాడులు పెరగడం, భద్రత పేరుతో నగరాలు ఆర్మీ చేతుల్లోకి వెళ్లడం.. వలసదారులపై దాడులు విపరీతంగా పెరగడం, కుటుంబంలోని విభజనలు ఏర్పడడం, నిఘా పేరుతో భయభ్రాంతులకు గురిచేయడం వంటి చర్యలకు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టినట్లు పలు సంస్థల నిర్వాహకులు వెల్లడించారు. ఈ భయాందోళనల మధ్యే ట్రంప్ పదవీ కాలం సంవత్సరం గడిచిపోయింది. ఈ నిరసనల వల్లనైనా రెండో సంవత్సరంలో బలమైన ఉద్యమాలకు ప్రేరణనిస్తాయని తాము నమ్ముతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుతం ట్రంప్ విధానాలను 58 శాతం మంది వ్యతిరేకిస్తున్నారు. జీవన వ్యయాన్ని మెరుగుపరుస్తామని, దేశీయ ఆర్థిక వ్యవస్థను స్థిరీకరిస్తామని అధ్యక్ష ఎన్నికల సమయంలో ట్రంప్ చెప్పిన వాగ్దానాలను అమలు చేయలేదు. పైగా అమెరికాలో ప్రస్తుతం 2020 తర్వాత అత్యధిక స్థాయిలో నిరుద్యోగం 4.6 శాతానికి చేరుకుంది. ద్రవ్యోల్బణం 3 శాతానికి చేరుకుంది. ట్రంప్ అనుసరిస్తున్న వలస విధానాల్ని పదిమందిలో ఆరుగురు పౌరులు వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలో పలు సంఘాలు, సంస్థలు, పలువురు ప్రముఖులు స్థానిక సమ్మేళకు పిలుపునిచ్చారు.

# ఈ ఆహారాలు తింటే రోగనిరోధక శక్తి డబుల్

మన శరీరంలో రెండో మెదడు ఎక్కడ ఉంటుందో తెలుసా? అది మన పొట్ట. పొట్ట ఆరోగ్యంగా ఉంటేనే మన మూడ్ బాగుంటుంది. అన్ని పనులు సజావుగా చేయడానికి శరీరం కూడా సహకరిస్తుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. చివరికి చర్మం కూడా కాంతివంతంగా మెరుస్తుంది. కానీ ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో గ్యాస్, ఎసిడిటీ, మలబద్ధకం వంటి సమస్యలు ప్రతి ఒక్కరినీ వేధిస్తున్నాయి. వీటన్నింటికీ ప్రధాన కారణం మనం తీసుకునే ఆహారంలో ఒక ముఖ్యమైన అంశం తగ్గిపోవడమే. అదే 'ఫైబర్' (పీచు పదార్థం). ప్రముఖ గ్యాస్ట్రో స్పెషలిస్ట్ డాక్టర్ పాల్, మన వంటింట్లో దొరికే సాధారణ పదార్థాలతోనే పొట్టను ఎలా క్లీన్ చేసుకోవచ్చో వివరించారు. ఆయన సూచించిన ఆ ఐదు సూపర్ ఫుడ్స్ ఏంటి? ఫైబర్ అనేది జీర్ణవ్యవస్థకు ఒక క్లీనర్ లాగా పనిచేస్తుంది. ఇది మనం తిన్న ఆహారం సాఫీగా కదలడానికి సహాయపడటమే కాకుండా, మన పొట్టలో ఉండే మంచి బ్యాక్టీరియాకు ఆహారాన్ని అందిస్తుంది. ఫైబర్ అందించడంలో వేయించిన శనగలు అగ్రస్థానంలో నిలుస్తాయి. ప్రతి 100 గ్రాముల శనగలలో సుమారు 17 గ్రాముల ఫైబర్ ఉంటుంది. ఇందులో ఉండే ఇన్‌సోల్యూబుల్ ఫైబర్, ప్రోటీన్ మిమ్మల్ని ఎక్కువ సేపు ఆకలి వేయకుండా ఉంచుతాయి. వీటిని చిరుతిండిగా నేరుగా తీసుకోవచ్చు లేదా సలాడ్లలో కలుపుకోవచ్చు. మన ఇళ్లలో సాధారణంగా వాడే నల్ల మినుములలో ఒక కప్పుకు 16 గ్రాముల ఫైబర్ లభిస్తుంది. ఇందులో కరిగే, కరగని ఫైబర్స్ రెండూ ఉంటాయి. ఇవి జీర్ణక్రియను మెరుగుపరచడమే కాకుండా, మన పొట్టలోని మంచి బ్యాక్టీరియాను పోషిస్తాయి. పప్పు మఖానీ లేదా అన్నంలో కలిపి తీసుకోవడం వల్ల గుండెకు కూడా మేలు జరుగుతుంది. చియా విత్తనాలు ఇప్పుడు సూపర్ ఫుడ్‌గా ప్రాచుర్యం పొందాయి. కేవలం రెండు టేబుల్ స్పూన్ల చియా విత్తనాల్లో 10 గ్రాముల ఫైబర్ ఉంటుంది. ఇవి పొట్టలోకి వెళ్ళగానే జెల్ లాగా మారి జీర్ణక్రియను సులభతరం చేస్తాయి. బ్లడ్




షుగర్ లెవల్స్ స్థిరంగా ఉండటానికి కూడా ఇవి తోడ్పడతాయి. డాక్టర్ పాల్ వీటిని పెరుగుతో కలిపి తీసుకోవాలని సూచిస్తున్నారు. చూడటానికి చాలా చిన్నవిగా ఉన్నా, రాస్ప్‌బెర్రీస్ ఫైబర్ పవర్‌హౌస్‌లు. ఒక కప్పు రాస్ప్‌బెర్రీస్‌లో 8 గ్రాముల ఫైబర్ లభిస్తుంది. ఇవి మంచి బ్యాక్టీరియాకు మద్దతు ఇవ్వడమే కాకుండా, శరీరానికి కావాల్సిన యాంటీ ఆక్సిడెంట్లను అందిస్తాయి. వీటిని స్మూతీలలో లేదా ఓట్స్‌లో కలిపి తీసుకోవచ్చు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆరోగ్యాన్ని ఇచ్చే పండు జామ. ఇందులో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. మలబద్ధకంతో బాధపడేవారికి ఇది ఒక దివ్యౌషధంలా పనిచేస్తుంది. రోజూ

ఒక జామ పండు తినడం వల్ల జీర్ణవ్యవస్థ మొత్తం శుభ్రపడుతుంది. ఆరోగ్యకరమైన పొట్టే సంతోషకరమైన జీవితానికి ఆధారం. డాక్టర్ పాల్ సూచించిన ఈ ఐదు పదార్థాలను మీ రోజువారీ ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల జీర్ణ సమస్యల నుండి శాశ్వత ఉపశమనం పొందవచ్చు. ఇవి కేవలం మీ పొట్టనే కాకుండా, మీ పూర్తి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.

## ప్యాకేజీ ఫుడ్‌తో క్యాన్సర్ ముప్పు!



ఆధునిక జీవనశైలిలో మనకు సమయం దొరకడమే కష్టమవుతోంది. అందుకే త్వరగా తయారయ్యే ఇన్స్టంట్ ఫుడ్స్, ప్యాక్ చేసిన పానీయాలు, ఎక్కువ కాలం నిల్వ ఉండే ఆహార పదార్థాల వైపు అందరం మొగ్గు చూపుతున్నాం. కానీ మనం సౌకర్యవంతంగా భావిస్తున్న ఈ ఆహారమే మన ప్రాణాల మీదకు తెచ్చే ప్రమాదం ఉందని మీకు తెలుసా?ఆహారం పాడవకుండా, ఎక్కువ కాలం తాజాగా ఉంచేందుకు కంపెనీలు వాడే కొన్ని కెమికల్స్.. నిశ్శబ్దంగా మన శరీరంలో క్యాన్సర్ కణాలను పెంచుతున్నాయని తాజా అంతర్జాతీయ పరిశోధనలో తేలింది. ముఖ్యంగా మహిళల్లో వచ్చే రొమ్ము క్యాన్సర్, పురుషుల్లో వచ్చే ప్రోస్టేట్ క్యాన్సర్‌లకు ఈ నిల్వ కారకాలే ప్రధాన శత్రువులని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అసలు ఆ ప్రమాదకరమైన ప్రిజర్వేటివ్స్ ఏంటి? ఫ్రాన్స్‌లోని 'యూనివర్సిటీ పారిస్ సిటీ' పరిశోధకులు సుమారు 1,05,260 మందిపై సుదీర్ఘ కాలం పాటు జరిపిన అధ్యయన ఫలితాలను 'ది బిఎమ్?జె (ఃఓఎ)' జర్నల్‌లో ప్రచురించారు. ప్యాక్ చేసిన ఆహారాల్లో వాడే 17 రకాల ప్రిజర్వేటివ్స్ గురించి వారు పరిశీలించగా, అందులో కొన్ని సాధారణ కెమికల్స్ క్యాన్సర్ రిస్క్‌ను విపరీతంగా పెంచుతున్నట్లు గుర్తించారు. పొటాషియం సోర్బేట్: ఇది మొత్తం క్యాన్సర్ ముప్పును 14 శాతం, రొమ్ము క్యాన్సర్ ముప్పును 26 శాతం పెంచుతున్నట్లు తేలింది.సోడియం నైట్రైట్: మాంసం నిల్వ ఉంచేందుకు వాడే ఈ కెమికల్ వల్ల ప్రోస్టేట్ క్యాన్సర్ వచ్చే అవకాశం 32 శాతం ఎక్కువగా ఉంది.పొటాషియం నైట్రేట్: దీని వల్ల రొమ్ము క్యాన్సర్ ముప్పు 22 శాతం పెరుగుతోంది.సల్ఫైట్లు: ఆహారంలో వీటి పరిమాణం ఎక్కువైతే సాధారణ క్యాన్సర్ రిస్క్ 12 శాతం పెరుగుతుంది.అసిటేట్లు: ఇవి రొమ్ము క్యాన్సర్ ముప్పును 25 శాతం పెంచుతాయని పరిశోధనలో వెల్లడైంది. ఆహారం నిల్వ ఉండటానికి వాడే ఈ రసాయనాలు మన శరీరంలోని రోగనిరోధక శక్తిని దెబ్బతీస్తాయి. ఇవి శరీరంలో ఇన్ఫ్లమేషన్ (వాపు)ను పెంచి, క్యాన్సర్ కణాలు వృద్ధి చెందడానికి అనువైన వాతావరణాన్ని కల్పిస్తాయి. సహజమైన యాంటీ ఆక్సిడెంట్ ప్రిజర్వేటివ్స్ పెద్దగా నష్టం చేయకపోయినా.. సోడియం ఎరిథోర్బేట్ వంటి కొన్ని రసాయనాలు మాత్రం అనారోగ్యానికి కారణమవుతున్నాయి.

## రాత్రి భోజనానికి ఏది ప్రయోజనకరం



రాత్రి పూట అన్నం తింటే బాగుంటుందా? లేదా రోటీ తింటే బాగుంటుందా? అనే ప్రశ్న తలెత్తుతుంటుంది. రాత్రి పూట ఈ రెండింటిలో ఏదీ తీసుకుంటే మంచిది? వీటి శరీరానికి ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయి? దీనిపై నిపుణులు కీలక విషయాలు వెల్లడించారు. రాత్రి భోజనంలో అన్నం తినాలా లేక రోటీ తినాలా అనేది తరచుగా ప్రజలను కలవరపెట్టే ప్రశ్న. నిపుణులు సమాధానం మీ జీవనశైలి, జీర్ణ సామర్థ్యం, ఆరోగ్యంపై ఆధారపడి ఉంటుందని అంటున్నారు. రెండూ పోషకమైనవి. కానీ కొన్ని తేడాలు ఏ విందు ఎంపిక ఉత్తమమో నిర్ణయిస్తాయి. పోషకాహార నిపుణుల అభిప్రాయం ప్రకారం.. రోటీ కంటే బియ్యం వేగంగా జీర్ణమవుతాయి. రాత్రిపూట జీర్ణశక్తి బలహీనంగా ఉంటుంది. అందుకే బియ్యం శరీరంపై ఎక్కువ ఒత్తిడిని కలిగించదు. తెల్ల బియ్యం తేలికగా ఉంటుంది. అలాగే కడుపు, ప్రేగులపై ఒత్తిడిని కలిగించదు. ఇది నిద్రకు కూడా సహాయపడుతుంది. కానీ జాగ్రత్తగా ఉండండి. వడ్డించే పరిమాణాలను అదుపులో ఉంచండి. ఎల్లప్పుడూ పప్పుధాన్యాలు, కూరగాయలను పక్కన పెట్టుకోండి. బ్రెడ్‌లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ముఖ్యంగా గోధుమ, జొన్న లేదా మల్టీగ్రెయిన్ పిండి అయితే. రాత్రిపూట రోటీ తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. మధుమేహ వ్యాధిగ్రస్తులకు, బరువును నియంత్రించుకోవాలనుకునే వారికి రోటీ మంచిదని నిపుణులు భావిస్తున్నారు. ఇక రోటీలో ఫైబర్ పుష్కలంగా ఉండటం వల్ల మిమ్మల్ని ఎక్కువసేపు కడుపు నిండి ఉండేలా చేస్తుంది. అన్నం త్వరగా జీర్ణమవుతుంది. అందుకే రాత్రిపూట ఆకలిగా ఉన్నవారికి 1-2 రోటీలు మంచి ఎంపిక. బియ్యంలో ఉండే ట్రిప్టోఫాన్ తేలికపాటి విశ్రాంతినిస్తుంది. అందువల్ల రాత్రిపూట తేలికపాటి భోజనాన్ని ఇష్టపడేవారు కొంచెం అన్నం తినవచ్చు. బరువు తగ్గాలనుకుంటున్నారా ? అయితే రాత్రిపూట రోటీ మంచిది. జీర్ణశక్తి బలహీనంగా ఉందా లేదా తేలికైన భోజనం కావాలనుకునేవారికి అన్నంమంచి ఎంపిక.నిపుణుల అభిప్రాయం ప్రకారం.. రోటీ- అన్నం రెండూ రాత్రిపూట మంచివి. అది మీ ఆరోగ్యం, అవసరాన్ని బట్టి ఉంటుంది.

# ఆహారాలు కుక్కర్‌లో ఉడికించి తింటే.. కిడ్నీలు మటాష్! జాగ్రత్త మరీ..




వంట ప్రక్రియ త్వరగా పూర్తవుతుందని కుక్కర్‌లో అన్ని రకాల ఆహారాలను వండటం సరైనది కాదు. అవును.. కుక్కర్‌లో కొన్ని ఆహార పదార్థాలను వండటం వల్ల వాటి పోషకాలు నాశనమవుతాయి. అలాంటి ఆహారాలు తీసుకోవడం వల్ల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు ఉంటాయి. దాదాపు ప్రతి ఇంట్లోనూ ప్రెషర్ కుక్కర్లు వాడుతారు. అన్నం వండటం నుంచి సాంబారు తయారీ వరకు త్వరగా వంట పూర్తి చేయడానికి, సమయం, గ్యాస్ ఆదా చేయడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. కానీ వంట ప్రక్రియ త్వరగా పూర్తవుతుందని కుక్కర్‌లో అన్ని రకాల ఆహారాలను వండటం సరైనది కాదు. అవును.. కుక్కర్‌లో కొన్ని ఆహార పదార్థాలను వండటం వల్ల వాటి పోషకాలు నాశనమవుతాయి. అలాంటి ఆహారాలు తీసుకోవడం వల్ల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు ఉంటాయి. అందువల్ల ఈ రకమైన ఆహారాలను ప్రెషర్ కుక్కర్‌లో వండకూడదు.సాధారణంగా చాలా మంది కుక్కర్‌లో బియ్యం వండుతారు. కానీ బియ్యాన్ని ఎప్పుడూ కుక్కర్‌లో వండకూడదు. ఎందుకంటే ఇలా కుక్కర్‌లో బియ్యం వండడం వల్ల ఆర్సెనిక్ అనే విష పదార్థం విడుదల అవుతుంది. ఇది మన ఆరోగ్యానికి హానికరం. కాబట్టి ఓపెన్ పాత్రలో మాత్రమే బియ్యం వండటం మంచిది. పాలకూర, మెంతులు, కొల్లార్డ్ ఆకుకూరలు వంటి ఆకుకూరలను ప్రెజర్ కుక్కర్‌లో ఉడికించడం వల్ల వాటి పోషకాలు నశించి, మూత్రపిండాల్లో రాళ్లు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. కాబట్టి వాటిని సాధారణ పాన్‌లో తక్కువ వేడి మీద ఉడికించడం మంచిది. బీన్స్‌లో లెక్టిన్ అనే సహజంగా లభించే టాక్సిన్ ఉంటుంది. ఇది సరిగ్గా ఉడికించకపోతే జీర్ణ సమస్యలను కలిగిస్తుంది. ఫుడ్ పాయిజనింగ్‌కు కూడా కారణమవుతుంది. అలాగే, ప్రెషర్ కుకింగ్ బీన్స్‌లోని లెక్టిన్‌ను వేగంగా విచ్ఛిన్నం చేస్తుంది. ఇది జీర్ణ సమస్యలకు దారితీస్తుంది. కాబట్టి ఈ కూరగాయలను ప్రెజర్ కుక్కర్‌లో ఉడికించడం మంచిది కాదు. ప్రెషర్ కుక్కర్‌లో పాలు మరిగించడం వల్ల దాని సహజ నిర్మాణం మారి అది పెరుగులా మారుతుంది. తద్వారా దాని పోషక విలువలు తగ్గుతాయి. పాలు మరిగించడానికి స్టీల్ లేదా నాన్-స్టిక్ పాన్ ఉత్తమం. టమోటాలు, చింతపండు లేదా పుల్లని పదార్థాలను ప్రెషర్ కుక్కర్‌లో ఉడికించడం వల్ల అవి ఆమ్లంగా మారతాయి. ఇది శరీరానికి హానికరం. కాబట్టి వాటిని స్టీల్ లేదా మట్టి పాత్రలో ఉడికించడం మంచిది. బీన్స్, కొన్ని ధాన్యాలు సహజ విష పదార్థాలను కలిగి ఉంటాయి. వీటిని ప్రెజర్ కుక్కర్‌లో పూర్తిగా తొలగించలేం. కాబట్టి, వాటిని రాత్రంతా నానబెట్టి ఆపై తక్కువ వేడి మీద ఓపెన్ పాత్రలో ఉడికించడం ఆరోగ్యకరమైనది.

# మటన్‌లోని ఈ పార్ట్ తింటే ఇక తిరుగుండదంతే



మేక మెదడు (మటన్ బ్రెయిన్) కూర బలహీనంగా ఉన్న పిల్లలకు, ఆపరేషన్ల నుండి కోలుకుంటున్న వారికి, కండరాల నిర్మాణానికి అద్భుతమైన పోషకాహారం. ఇందులో తక్కువ కార్బోహైడ్రేట్లు, ఎక్కువ ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, ఐరన్, ప్రోటీన్ ఉంటాయి. రక్తం గడ్డకట్టకుండా చేసి, జ్ఞాపకశక్తిని పెంచుతుంది. నాన్ వెజ్ ప్రియులు మటన్ (మేక మాంసం) ను ఎంతో ఇష్టంగా తింటారు.. అయితే.. మేకలోని పలు భాగాలు.. ఎన్నో ప్రత్యేకతలను కలిగి ఉంటాయి.. ఒక్కో పార్ట్.. ఒక్కో ప్రయోజనాన్ని కలిగి ఉంటుంది.. మటన్ తిల్లి, తలకాయ, లివర్, పాయా అన్ని స్పెషలే.. అయితే.. మేక మెదడు కూడా ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలను చేకూరుస్తుంది.. మేక మెదడులో ప్రోటీన్, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్ ః12, ఐరన్, భాస్వరం వంటి పోషకాలు అధికంగా ఉంటాయి.. ఇవి మెదడు ఆరోగ్యం, జ్ఞాపకశక్తి, రక్త ఉత్పత్తి, కండరాల బలానికి మేలు చేస్తాయి. కణాల మరమ్మత్తుకు సహాయపడటమే కాకుండా.. రోగనిరోధక శక్తిని పెంచుతుంది. నాన్-వెజ్ ఆహారాన్ని ఇష్టపడేవారికి, ప్రత్యేకించి ఆరోగ్య ప్రయోజనాలను కోరుకునేవారికి మేక మెదడు కూర ఒక అద్భుతమైన ఎంపిక అని డైటీషియన్లు చెబుతున్నారు. ఈ వంటకం కేవలం రుచిని మాత్రమే కాకుండా, అనేక పోషక విలువలను కూడా అందిస్తుంది. ముఖ్యంగా, ఎదుగుతున్న పిల్లలకు, శారీరకంగా బలహీనంగా ఉన్నవారికి, ఇటీవల ఆపరేషన్ల నుండి లేదా గాయాల నుండి కోలుకుంటున్న వారికి, అలాగే కండరాల నిర్మాణాన్ని లక్ష్యంగా చేసుకుని వ్యాయామం చేసేవారికి ఈ కూర చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. మేక మెదడులో కార్బోహైడ్రేట్లు తక్కువగా ఉంటాయి. అయితే ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, ఐరన్, ప్రోటీన్ వంటి ముఖ్యమైన పోషకాలు అధికంగా ఉంటాయి. ఈ పదార్థాలు శరీరానికి శక్తిని అందించి, రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ మెదడు ఆరోగ్యానికి, హృదయ ఆరోగ్యానికి ఎంతో అవసరం. ఐరన్ శరీరంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తికి తోడ్పడుతుంది. తద్వారా రక్తహీనతను నివారిస్తుంది. ప్రోటీన్ కండరాల మరమ్మత్తుకు, పెరుగుదలకు కీలకం. అంతేకాకుండా, మేక మెదడు రక్తం గడ్డకట్టకుండా చేసి, శరీరంలో రక్త ప్రవాహాన్ని సక్రమంగా నిర్వహించడానికి సహాయపడుతుంది. ఇది ఎర్ర రక్త కణాల ఉత్పత్తిని కూడా పెంచుతుంది. తద్వారా ఆక్సిజన్ రవాణాను మెరుగుపరుస్తుంది. జ్ఞాపకశక్తిని పెంచే గుణాలు కూడా దీనిలో ఉన్నాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. అయితే కొలెస్ట్రాల్, కొవ్వు ఎక్కువగా ఉండటం వల్ల గుండె జబ్బులు ఉన్నవారు మితంగా తీసుకోవాలి. ఈ రుచికరమైన కూరను తయారుచేయడానికి, ముందుగా తాజా మేక మెదళ్లను పసుపు, ఉప్పు వేసిన నీటిలో 2-3 నిమిషాలు ఉడికించి, శుభ్రం చేసుకోవాలి. ఆ తర్వాత, నూనెలో ఉల్లిపాయలు, పచ్చిమిర్చి, కరివేపాకు, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి వేయించాలి. శుభ్రం చేసిన మెదళ్లను వేసి, పసుపు, ఉప్పు, కారం కలిపి నిదానంగా వేయించుకోవాలి. లవంగాలు, దాల్చినచెక్క, యాలకులు, మరాఠీ మొగ్గ, అనాస పువ్వు, జీలకర్ర, ధనియాలు, గసగసాలతో తయారుచేసిన మసాలా పేస్ట్‌ను వేసి, తగినంత నీళ్లు పోసి ఉడికించాలి. మెదళ్లు మెత్తబడిన తర్వాత ముక్కలుగా కట్ చేసి, మూతపెట్టి పది నిమిషాలు ఉడికించి, చివరగా కొత్తిమీరతో గార్నిష్ చేస్తే సరిపోతుంది..

## డ్రాగన్ కంట్రీలో జనాభా సంక్షోభం గణనీయంగా తగ్గిన సంతానోత్పత్తి



డ్రాగన్ కంట్రీ చైనాలో వరుసగా నాలుగో సంవత్సరం జననాల రేటు గణనీయంగా తగ్గింది. ఫలితంగా ఇది అక్కడ జనాభా సంక్షోభానికి దారితీస్తుందన్న ఆందోళన మొదలైంది. ఒకప్పుడు జనాభాలో ప్రపంచంలో అన్ని దేశాలకంటే చైనా టాప్ లో ఉండేది. కానీ గతేడాది జులై1 జనాభా లెక్కల ప్రకారం.. ప్రపంచంలో అత్యధిక జనాభా ఉన్న దేశాల లిస్టులో భారత్ ఫస్ట్ ప్లేస్ లో నిలిచింది. చైనా రెండోస్థానానికి పడిపోయింది. 2022లో చైనా మొదటి స్థానంలో ఉండగా.. మూడేళ్లుగా రెండోస్థానంలోనే కొనసాగుతోంది. 2024లో నమోదైన జనాభా సంఖ్యతో పోలిస్తే 2025లో జననాల సంఖ్య 17 శాతం తక్కువగా నమోదైందని అక్కడి గణాంకాలు చెబుతున్నాయి. గతేడాది అక్కడ జననాల సంఖ్య 79.2 లక్షలుగా నమోదయింది. ఆసియా ఖండంలో ఉన్న ఇతర దేశాలతో పోలిస్తే.. చైనాలో సంతానోత్పత్తి రేటు రోజురోజుకూ తగ్గుతోందని, ఇది దేశంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని చైనా ఆర్థిక రంగ నిపుణులు చెప్తున్నారు. చైనాలో పిల్లల్ని కనేందుకు జంటలు వెనుకాడుతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం.. అక్కడి ప్రజల జీవన ఖర్చులు పెరగడమే. పిల్లల పెంపకం చాలా ఎక్స్పెన్సివ్ కావడంతో కనకపోవడమే మంచిదని భావిస్తున్నారు. పిల్లలు పుట్టినప్పటి నుంచి 18 ఏళ్ల వరకూ చదువుకి, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు సరాసరి 76 వేల డాలర్లు అంటే మన కరెన్సీలో రూ.69 లక్షలు ఖర్చవుతున్నట్లు ఒక అంచనా ఉంది. అందుకే పెళ్లిళ్లు చేసుకునేందుకు వెనుకాడుతున్నారు. పెళ్లయిన వాళ్లు పిల్లల్ని కనాలంటే ఖర్చు గురించి ఆలోచిస్తున్నారు. ఈ ఆలోచన ధోరణిని తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఇప్పటికే కండ్రోమ్స్, గర్భనిరోధక మాత్రలపై 13 శాతం పన్ను విధించింది. నర్సరీ నుంచి కిండర్ గార్టెన్స్ వరకూ, వృద్ధుల సంరక్షణ, వికలాంగుల సేవలు, వివాహ సంబంధిత సేవలు.. వంటివాటిపై ఈ ఏడాది జనవరి 1 నుంచి పన్నును మినహాయించింది.

## ప్రజల్లో పెరుగుతున్న పొట్టతో దేశానికి తీవ్ర నష్టం తప్పదట?



మీరు ఆఫీసులో గంటల తరబడి కూర్చుంటున్నారా..? మీ బరువు పెరుగుతోందా..? చిన్న వయసులోనే షుగర్ వచ్చిందా..? అయితే అలర్ట్..! ఇది కేవలం మీ ఇంట్లో సమస్య కాదు.. దేశ ఆర్థిక వ్యవస్థకే ఒక పెద్ద ముప్పు! అదేంటని ఆశ్చర్యపోతున్నారా..? అసలు లావు (రాఎవబతిబిఎ) వల్ల దేశానికి ఇంత నష్టమా? మనం తినే తిండికి, దేశం డెవలప్‌మెంట్‌కి లింక్ ఏంటి? ప్రపంచాన్ని ఇప్పుడు రెండు దెయ్యాలు పట్టి పీడిస్తున్నాయి. ఒకటి ఊబకాయం.. రెండు డయాబెటిస్! ఈ జబ్బుల వల్ల ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏడాదీ ఏకంగా 5 కోట్ల 40 లక్షల మంది పనికి దూరమవుతున్నారు. అంటే ఒక రకంగా ఒక చిన్న దేశ జనాభా మాయమైపోతున్నట్టే! ఇదే స్పీడ్‌లో వెళ్తే.. 2035 నాటికి ప్రపంచంలో సగం మంది జనాభా.. అవును సగం మంది.. ఓవర్ వెయిట్‌తో బాధపడతారట. దీనివల్ల ప్రపంచానికి ఏటా 4 ట్రిలియన్ డాలర్ల నష్టం వస్తుందని హెచ్చరిస్తున్నారు నిపుణులు. ?ఇక మన భారతదేశ పరిస్థితి చూస్తే భయమేస్తుంది. డయాబెటిస్ వల్ల ఎక్కువ నష్టపోతున్న దేశాల్లో మనది రెండో స్థానం. మన దేశం మీద పడుతున్న భారం ఎంతో తెలుసా? 1.6 ట్రిలియన్ డాలర్లు! మన దగ్గర చాలామందికి చిన్న వయసులోనే షుగర్ రావడం, ఆఫీసులకు సెలవులు పెట్టడం, లేదా త్వరగా రిటైర్ అయిపోవడం వల్ల.. కంపెనీలకు, దేశానికి కోట్లలో నష్టం వస్తోంది. ?కానీ.. ఇప్పుడే మేల్కొంటే లాభం కూడా గట్టిగానే ఉంటుంది! ప్రజల ఆరోగ్యం మీద రూపాయి ఖర్చు పెడితే.. భవిష్యత్తులో అది వంద రెట్లు తిరిగి ఇస్తుంది. అందరూ ఫిట్‌గా ఉంటే 2050 నాటికి ప్రపంచ ఎకానమీకి 11 ట్రిలియన్ డాలర్లు అదనంగా వచ్చి చేరతాయట. ఇప్పటికే అమెరికాలో కొత్త రకం మందులు (ఉఒఖ-1) వాడి ఒబేసిటీని 2శాతం తగ్గించారు. మనం కూడా ఆ దిశగా వెళ్లాల్సిన టైం వచ్చింది. ఫైనల్‌గా చెప్పేది ఒక్కటే.. కంపెనీలు, గవర్నమెంట్లు.. జబ్బు వచ్చాక మందులకు డబ్బులు ఇవ్వడం కాదు.. అసలు జబ్బు రాకుండా ముందే జాగ్రత్త పడాలి. పోషకాహారం, రెగ్యులర్ చెకప్స్ ముఖ్యం. ఎందుకంటే.. వర్కర్ ఫిట్‌గా ఉంటేనే.. దేశం హిట్ అవుతుంది! ఇది మన ఆర్థిక నిపుణులు చెబుతున్న అంచనాలు.

### 30 ఏళ్ల తర్వాత అకస్మాత్తుగా బరువు ఎందుకు పెరుగుతారు



30 సంవత్సరాల వయస్సు తర్వాత.. చాలా మందికి అకస్మాత్తుగా బరువు పెరగడం.. అలాగే అలసట, నీరసం లాంటివి పెరుగుతాయి. దీనికి ప్రధాన కారణం అవసరమైన విటమిన్లు లేకపోవడం కావచ్చంటున్నారు ఆరోగ్య నిపుణులు. 30 ఏళ్ల తర్వాత చాలా మంది పురుషులు, మహిళలు అకస్మాత్తుగా బరువు పెరగడం.. నిరంతరం అలసటను అనుభవిస్తారు. గతంలో సులభంగా ఉండే పనులు ఇప్పుడు శ్రమతో కూడుకున్నవిగా.. అలసిపోయేలా చేసేవిగా అనిపిస్తాయి. ప్రజలు తరచుగా వృద్ధాప్యం, పని ఒత్తిడి లేదా మారుతున్న దినచర్యలు దీనికి కారణమని చెబుతారు. అయితే, చాలా సందర్భాలలో, ముఖ్యమైన విటమిన్లు లేకపోవడం ప్రధాన కారణం కావచ్చు.. దీనిని తరచుగా నిర్లక్ష్యం చేస్తారని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. శరీరానికి తగినంత విటమిన్లు అందనప్పుడు.. దాని ప్రభావాలు క్రమంగా కనిపిస్తాయి. బరువు పెరగడం, శక్తి లేకపోవడం, బద్ధకం దీనికి సంకేతాలు కావచ్చు. ఈ లక్షణాలు రోజువారీ జీవితాన్ని ప్రభావితం చేయడం ప్రారంభిస్తాయి. కాబట్టి, ఈ మార్పులను తేలికగా తీసుకోవడం తెలివైనది కాదు. శరీరంలో ఏ విటమిన్ లోపాలు బరువు పెరగడానికి, అలసటకు దారితీస్తాయి..? ఇంతలో, విటమిన్ ః12 శరీరానికి శక్తిని అందించడంలో, ఆరోగ్యకరమైన నాడీ వ్యవస్థను నిర్వహించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ః12 లోపం శక్తి ఉత్పత్తి తగ్గడానికి దారితీస్తుంది.. అలసట, బలహీనత, కార్యాచరణ తగ్గడానికి దారితీస్తుంది. ఈ రెండు విటమిన్లలో దీర్ఘకాలిక లోపాలు బరువు నియంత్రణను కష్టతరం చేస్తాయి.. ఇంకా తీవ్ర అలసటకు దారితీస్తాయి. విటమిన్ డి లోపాన్ని అధిగమించడానికి, ప్రతిరోజూ కొంత సమయం ఎండలో గడపడం ప్రయోజనకరంగా ఉంటుంది. అదనంగా, మీ ఆహారంలో పాలు, పెరుగు, బలవర్ధకమైన ఆహారాలను చేర్చుకోండి. విటమిన్ బి 12 కోసం, పాలు, పెరుగు, జున్ను, పప్పుధాన్యాలు, ఆకుపచ్చ కూరగాయలు, చేపలు, చికెన్, గుడ్లు, బలవర్థకమైన ఆహారాలను మీ ఆహారంలో చేర్చుకోండి. అవసరమైతే, వైద్యుడి సలహాతో సప్లిమెంట్లను తీసుకోవచ్చు. సమతుల్య ఆహారం, క్రమం తప్పకుండా తనిఖీలు చేయడం వల్ల ఈ విటమిన్ లోపాలను సకాలంలో పరిష్కరించవచ్చు.

# టీ20 వరల్డ్ కప్ నుంచి బంగ్లాదేశ్ ఔట్.. భారత్‌లో ఆడేందుకు నిరాకరణ

- భారత్‌లో ఆడేది లేదంటూ టీ20 వరల్డ్ కప్ నుంచి వైదొలిగిన బంగ్లాదేశ్
- భద్రతా కారణాల రీత్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపిన బంగ్లా ప్రభుత్వం
- వేదిక మార్పు విజ్ఞప్తిని తిరస్కరించిన ఐసీసీ.. బంగ్లా స్థానంలో స్కాట్లాండ్
- ప్రభుత్వ నిర్ణయానికి కట్టుబడి ఉన్నామన్న బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు




**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్ 2026లో ఆడకూడదని బంగ్లాదేశ్ సంచలన నిర్ణయం తీసుకుంది. భారత్‌లో జరిగే మ్యాచ్‌లు ఆడేందుకు తమ జట్టు నిరాకరిస్తున్నట్లు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డ్ (దీజదీ) స్పష్టం చేసింది. భద్రతాపరమైన ఆందోళనలు, రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. దీంతో బంగ్లాదేశ్ స్థానంలో స్కాట్లాండ్‌ను టోర్నీలోకి తీసుకుంటున్నట్లు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ప్రకటించింది.తమ మ్యాచ్‌లను భారత్ నుంచి శ్రీలంకకు తరలించాలని బీసీబీ చేసిన విజ్ఞప్తిని ఐసీసీ తిరస్కరించింది. జనవరి 21న జరిగిన బోర్డు సమావేశంలో ఈ విషయంపై చర్చించిన ఐసీసీ, భారత్‌లో భద్రతా సమస్యలు లేవని, షెడ్యూల్‌ను మార్చడం సాధ్యం కాదని తేల్చిచెప్పింది. భారత్‌లో ఆడేందుకు బంగ్లాదేశ్‌కు ఒక రోజు గడువు ఇవ్వగా, బీసీబీ ఆ ప్రతిపాదనను కూడా తోసిపుచ్చింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఢాకాలో బీసీబీ అధ్యక్షుడు అమినుల్ ఇస్లాం, క్రీడా సలహాదారు అసిఫ్ నజ్రుల్, ఆటగాళ్లు లిట్టన్ దాస్, నజ్ముల్ హొస్సేన్ షాంటో తదితరులతో సమావేశమయ్యారు. ప్రపంచకప్ ఆడాలనే ఆసక్తి ఆటగాళ్లకు ఉన్నప్పటికీ, ప్రభుత్వ నిర్ణయానికే కట్టుబడి ఉండాలని నిర్ణయించారు. "మేం ఐసీసీతో చర్చలు కొనసాగిస్తాం, మా పోరాటం ఆపబోం" అని బీసీబీ అధ్యక్షుడు ఈ సందర్భంగా తెలిపారు.గతంలో ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను ఐపీఎల్ నుంచి తప్పించినప్పటి నుంచి ఇరు దేశాల క్రికెట్ బోర్డుల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. తాజా వివాదం దానికి కొనసాగింపుగా భావిస్తున్నారు. టోర్నీ నుంచి తప్పుకున్నా 2022 ఐసీసీ ఒప్పందం ప్రకారం ఆర్థికంగా ఎలాంటి నష్టం ఉండదని బీసీబీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పుడు గ్రూప్-సిలో ఇంగ్లండ్, వెస్టిండీస్ వంటి జట్లతో బంగ్లాదేశ్ బదులు స్కాట్లాండ్ తలపడనుంది.

# రోహిత్ శర్మకు అరుదైన గౌరవం.. యూనివర్సిటీ నుంచి హిట్ మ్యాన్‌కు డాక్టరేట్






**హైదరాబాద్ పెన్ పవర్:** భారత జట్టు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ అరుదైన గౌరవం అందుకోనున్నాడు. అజీంక్య డివై పాటిల్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ (డి.లిట్.) అందుకోనున్నారు. శనివారం (జనవరి 24) జరిగే 10వ స్నాతకోత్సవ కార్యక్రమంలో రోహిత్ శర్మకు ఈ సన్మానం జరగనుంది. రోహిత్ క్రీడల్లో చేసిన అసమానమైన కృషికి.. అదేవిధంగా చాలా మందికి స్ఫూర్తినిచ్చిన కారణంగా డాక్టరేట్ గౌరవంతో సత్కరించనున్నారు. అభిమానులు క్రికెట్‌లో 'హిట్‌మ్యాన్' గా పిలుచుకునే రోహిత్ కు ఇది అతని కెరీర్ లో ఒక గొప్ప గౌరవంగా నిలిచిపోనుంది.

**బోటు ప్రయాణ టికెట్లు**

ఈ వేడుకకు విశ్వవిద్యాలయ అధ్యక్షుడు.. ఛాన్సలర్ డాక్టర్ అజీంక్య డి.వై. పాటిల్ అధ్యక్షత వహిస్తారు. ఈ వేడుక స్టార్‌లతో నిండి ఉంటుందని.. రోహిత్ ప్రధాన ఆకర్షణగా ఉంటారని ప్రకటించింది. రోహిత్ శర్మ ప్రస్తుతం అంతర్జాతీయ క్రికెట్ లో ఒకటే ఫార్మాట్ లో ఆడుతున్నాడు. 2024 టీ20 వరల్డ్ కప్ గెలిచినా తర్వాత రోహిత్ టీ20 ఫార్మాట్ కు రిటైర్మెంట్ ప్రకటించాడు. 2025లో ఇంగ్లాండ్ సిరీస్ కు ముందు టెస్ట్ సిరీస్ కు కూడా గుడ్ బై చెప్పాడు. వన్డే ఫార్మాట్ మాత్రమే ఆడుతున్న హిట్ మ్యాన్ 2027 వన్డే వరల్డ్ కప్ తర్వాత క్రికెట్ కు రిటైర్మెంట్ ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. తన కెరీర్‌లో 67 మ్యాచ్‌లు ఆడిన రోహిత్ 4,301 రన్స్ చేశాడు. ఇందులో 12 సెంచరీలు, 18 ఫిఫ్టీలు ఉన్నాయి. 2013లో ఈడెన్ గార్డెన్స్‌లో వెస్టిండీస్‌పై టెస్టు అరంగేట్రం చేసిన అతను గతేడాది మెల్‌బోర్న్‌లో ఆస్ట్రేలియాపై చివరి మ్యాచ్ ఆడాడు. ఆస్ట్రేలియాతో గత వరల్డ్ టెస్టు చాంపియన్ షిప్ ఫైనల్లో ఇండియాను నడిపించిన రోహిత్ 24 టెస్టుల్లో కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఇందులో ఇండియా 12 మ్యాచ్‌ల్లో నెగ్గి తొమ్మిదింట్లో ఓడింది. మూడు డ్రాగా ముగిశాయి. గతేడాది టీ20 వరల్డ్ కప్ నెగ్గిన తర్వాత షార్ట్ ఫార్మాట్ నుంచి తప్పుకున్న రోహిత్.. ఇకపై కేవలం వన్డే ఫార్మాట్‌లోనే ఇండియాకు ఆడనున్నాడు. 159 టీ20 మ్యాచ్ ల్లో రోహిత్ 4231 పరుగులు చేశాడు. కెప్టెన్ గా ఇండియాకు 2024 టీ20 వరల్డ్ కప్ అందించాడు. వన్డే ఫార్మాట్ లో జరిగిన 2025 ఛాంపియన్స్ ట్రోఫీ అందించి ఏడాదిలోనే ఇండియాకు రెండు ఐసీసీ టైటిల్స్ అందించిన కెప్టెన్ గా నిలిచాడు. 2023 లో టీమిండియా వన్డే వరల్డ్ కప్ తో పాటు టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్ కు చేరుకుంది. బ్యాటర్ గా 282 వన్డేలాడిన రోహిత్ 11577 పరుగులు చేశాడు.

# గిల్ టైమ్ బాగోలేదు.. రెండో బంతికే టీమిండియా కెప్టెన్ డకౌట్




**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా వన్డే, టెస్ట్ కెప్టెన్ శుభమాన్ గిల్ కు ప్రస్తుతం బ్యాడ్ లక్ నడుస్తోంది. గత ఏడాది ఇండియా టెస్ట్, వన్డే కెప్టెన్సీ గిల్ కు అప్పగించడంతో పాటు టీ20ల్లో వైస్ కెప్టెన్ గా ప్రకటించారు. ఒక్కసారిగా గిల్ ఆల్ ఫార్మాట్ కెప్టెన్ గా కితాబులందుకున్నాడు. అయితే ఆసియా కప్ నుంచి గిల్ కు బ్యాడ్ టైమ్ స్టార్ట్ అయింది. ఆసియా కప్ లో పేలవ ప్రదర్శన చేసిన తర్వాత కెప్టెన్ గా ఆస్ట్రేలియాతో జరిగిన తొలి సిరీస్ లో కెప్టెన్ గా, బ్యాట్స్‌మెన్ గా ఫెయిలయ్యాడు. సౌతాఫ్రికాతో టీ20 సిరీస్ తర్వాత ఇండియా టీ20 జట్టులో స్థానం కోల్పోయాడు. స్వదేశంలో జరగబోయే టీ20 వరల్డ్ కప్ కు ఫామ్ లేని కారణంగా గిల్ ఎంపిక కాలేదు. 2026 లోనూ గిల్ కు మంచి ఆరంభం రాలేదనే చెప్పాలి. గిల్ కెప్టెన్సీలో న్యూజిలాండ్ చేతిలో టీమిండియా సొంతగడ్డపై 1-2 తేడాతో వన్డే సిరీస్ కోల్పోయింది. వరల్డ్ కప్ లో చోటు కోల్పోయిన గిల్ రంజీ ట్రోఫీ ఆడాలని నిర్ణయించుకున్నాడు. గురువారం (జనవరి 22) సౌరాష్ట్రతో జరుగుతున్న మ్యాచ్ లో బరిలోకి దిగాడు. తొలి ఇన్నింగ్స్ లో గిల్ డకౌటయ్యాడు. నేహాల్ వధేరా ఔటైన తర్వాత క్రీజ్ లోకి వచ్చిన గిల్ ఎదుర్కొన్న రెండో బంతికే పెవిలియన్ బాట పట్టాడు. పార్ధ్ బట్ బౌలింగ్ లో ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. ఫామ్ కోసం రంజీ బాట పట్టిన గిల్.. డొమెస్టిక్ క్రికెట్ లోనూ ఈ టీమిండియాకు నిరాశే ఎదురైంది. ఈ మ్యాచ్ విషయానికి వస్తే మొదట బ్యాటింగ్ చేసిన సౌరాష్ట్ర 172 పరుగులకు ఆలౌటైంది. గోహిల్ ఒక్కడే 82 పరుగులు చేసి సగానికి పైగా పరుగులు చేశాడు. ప్రేరక్ మన్ కండ్ 32 పరుగులు చేసి రాణించాడు. వీరిద్దరూ తప్పితే మిగిలిన వారు తక్కువ స్కోర్ కే ఔటయ్యారు. పంజాబ్ బౌలర్లలో హరిప్రీత్ బ్రార్ ఏకంగా 6 వికెట్లు తీసుకొని అదరగొట్టాడు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన పంజాబ్ కూడా బ్యాటింగ్ లో ఘోరంగా విఫలమైంది. ప్రస్తుతం 8 వికెట్ల నష్టానికి 122 పరుగులు చేసింది. సౌరాష్ట్ర బౌలర్లలో పార్ధ్ బట్ నాలుగు వికెట్లు తీసుకొని రాణించాడు.

# మహేష్ బిజినెస్ స్కెచ్ అదుర్స్!



కావ్య థాపర్ టాలీవుడ్ & కోలీవుడ్ గ్లామర్ క్వీన్

మల్టీప్లెక్స్ చైన్‌ని విస్తరిస్తున్న సూపర్‌స్టార్ మహేష్ బిజినెస్ స్కెచ్ అదుర్స్ అంటున్నారు ఫ్యాన్స్. ఓ పక్క సినిమాలు చేస్తూనే మరో పక్క మల్టీప్లెక్స్ బిజినెస్‌ని మహేష్ పరుగులు పెట్టిస్తున్నారు. ఏషియన్ ఫిలింస్ అధినేత సునీల్ నారంగ్‌తో కలిసి ఏఎంబీ బ్రాండ్‌ని క్రియేట్ చేసిన ఆయన దీనిని దేశ వ్యాప్తంగా విస్తరించే ప్లాన్‌ని అమలు చేసే పనిలో ఉన్నాడు. స్టార్ హీరోలు అల్లు అర్జున్, విజయ్ దేవరకొండ, రవితేజ ఒక్కో మల్టీప్లెక్స్ థియేటర్లతో సరిపెట్టుకుంటే మహేస్ మాత్రం భారీ చైన్ సిస్టమ్‌ని క్రియేట్ చేయబోతున్నాడు. తొలి ప్రయత్నంగా హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఏరియాలో ఏఎంబీ సినిమాలు పేరుతో తొలి మల్టీప్లెక్స్‌ని ప్రారంభించారు. ప్రస్తుతం అది ఐటీ కారిడార్‌కు అత్యంత సమీపంలో ఉండటం, లగ్జరీ జనావాసాల మధ్య ఉండటంతో దీనికి ప్రేక్షకుల తాకిడి విపరీతంగా ఉంటోంది. ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు ఇక్కడ పలు బ్రాండ్‌లకు సంబంధించిన రెస్టారెంట్స్, క్లాతింగ్ షోరూమ్స్ వంటి వివిధ మినీ షోరూమ్స్ ఉండటంతో వీకెండ్స్‌లో ప్రేక్షకులు అధిక సంఖ్యలో ఇక్కడికి విచ్చేస్తున్నారు. దీంతో సిటీలో మరిన్ని మల్టీప్లెక్స్‌లకు శ్రీకారం చుట్టాలని ప్లాన్ చేసిన మహేష్ ఇప్పటికే హకీంపేట్, ,ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లలో రెండు థియేటర్లని మొదలు పెట్టాడు. ప్రస్తుతం కన్‌స్ట్రక్షన్ దశలో ఉన్న ఈ మల్టీప్లెక్స్ థియేటర్స్ త్వరలోనే ప్రారంభం కానున్నాయి. సిటీలో మరిన్ని మల్టీప్లెక్స్‌లని సునీల్ నారంగ్‌తో కలిసి ప్లాన్ చేస్తున్న మహేష్ బెంగళూరులోనూ కపాలి థియేటర్ ప్రాంగణంలో ఏఎంబీ సినిమాస్ కపాలి థియేటర్ ని జనవరి 16న లాంఛనంగా ప్రారంభించిన విషం





ఫాతిమా సనా షేక్ ఉల్లాసభరితమైన ఫోటోను పంచుకున్నారు

తెలిసిందే. ఇదే తరమాలో చెన్నైలోనూ భారీ స్థాయిలో మల్టీప్లెక్స్‌లకు శ్రీకారం చుట్టబోతున్నారట. దానితో పాటు గోవాకు కూడా తన మల్టీప్లెక్స్ థియేటర్ల చైన్‌ని విస్తరించే పనిలో ఉన్నట్టుగా టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. 3డీ స్క్రీన్స్, డాల్బీ అట్మాస్ సౌండ్ సిస్టమ్‌తో పాటు ఐమ్యాక్స్ టెక్నాలజీ థియేటర్లని కూడా అందుబాటులోకి తీసుకురానున్నారట. ఇదిలా ఉంటే మహేష్ ప్రస్తుతం జక్కన్న అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ -వారణాసి-లో నటిస్తున్నాడు. దీనికి సంబంధించిన షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. మరో ఏడు నెలలు పూర్తయితే షూటింగ్ మొత్తం పూర్తవుతుంది. మిగిలిందిక వీఎఫ్ ఎక్స్ వర్క్.. దానికి ఎక్కువ టైమ్ పడుతుంది కాబట్టి ఈ భారీ పాన్ వరల్డ్ మూవీని 2027లో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టుగా టీమ్ ప్రకటించింది. అయితే సినిమా రిలీజ్ వాయిదా పడే అవకాశం ఉందని వార్తలు వస్తున్న నేపథ్యంలో టీమ్ క్లారిటీ ఇచ్చింది. 2027లో పక్కాగా వస్తామని ఫుల్ క్లారిటీ ఇచ్చేసింది. అయితే మార్చిలో వచ్చే అవకాశాలు ఉన్నాయని కొంత మంది అంటుంటే ఏప్రిల్ ఫస్ట్ వీక్‌లో వచ్చే అవకాశాలు ఉన్నాయని మరికొంత మంది అంటున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965